# సంధ్యావందనము - గాయత్రీ మంత్రార్ధము



వ్యాఖ్యాత:

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

# సంధ్యా వందనము

## గాయత్రీ మంత్రార్థము

వ్యాఖ్యాత

**సాహిత్య విద్యా ప్రవీణ - వేదాంత విద్యా ధురీణ**

యల్లంరాజు శ్రీనివాసరావ్, M.A.

# విషయసూచిక

1. ఉప శ్రుతి ........................................................ 4

2. సంధ్యావందనము, గాయత్రీ మంత్రార్థము ............ 12

3. ఫల శ్రుతి ........................................................ 149

# ఉప శ్రుతి

మన వేద వాఙ్మయం రెండు భాగాలు. ఒకటి ప్రవృత్తి. మరొకటి నివృత్తి. ప్రవృత్తి క్రిందికి వస్తుంది కర్మ కాండ అంతా. పోతే ఒక్క జ్ఞానమే నివృత్తి క్రిందికి వస్తుంది. అందులో కర్మ అనేది ఒకటి గాదు. శాస్త్రోక్తమైన కర్మలు నాలుగు విధాలు. అవే నిత్యనైమిత్తిక కామ్య నిషిద్ధాలు. నిషిద్ధ కర్మలు ఇటు కర్మిష్ఠులకూ పనికి రావు. అటు జ్ఞానులకూ పనికి రావు. అవి ఎప్పుడూ వర్జనీయమే. వర్జనీయమని చెప్పటానికే వేదమవి గూడా పరిగణించింది. పోతే మిగిలిన వీక నిత్య నైమిత్తిక కామ్య కర్మలు. అందులో కూడా జ్ఞానులకూ జిజ్ఞాసువులకూ అవి కూడా నిషిద్ధ కర్మల లాగా వర్జనీయమే. కర్మిష్ఠులు మాత్రం చేస్తే చేయవచ్చు. మానితే మానవచ్చు. వారి వారి కామాన్ని బట్టి ఉంటుందది. కాని నిత్యనైమిత్తికాలు మాత్రమలా మానటానికి లేదు. చేసి తీరవలసిందే. ఆత్మ జ్ఞానమే పరాయణంగా పెట్టుకొన్న జిజ్ఞాసువులకూ జ్ఞానులకూ మాత్రమలాటి నిర్బంధం లేదు. కర్మిష్ఠులకు కామ్యకర్మ లెలా వైకల్పికమో Optional అలాగే జ్ఞానులకూ జిజ్ఞాసులకూ నిత్య నైమిత్తికాలు కూడా వైకల్పికమే. చేసినా చేయకున్నా

నష్టం లేదు. తామెంచుకొన్న జ్ఞానమార్గంలో ఉండకపోతేనే నష్టం. అప్పుడటు కర్మకూ ఇటు జ్ఞానానికీ రెంటికీ చెడ్డ  రేవళ్లవుతారు. ఇలా ఇద్దరికీ ఆస్తి పంచి పెట్టింది వేదం.

కాగా ఇప్పుడీ సంధ్యా వందనాది కర్మలన్నీ నిత్యకర్మల క్రిందికి వస్తాయి.  అహరహ స్సంధ్యా ముపాసీత. ప్రతి దినమూ మూడు పూటలా సంధ్యా వందన మాచరించాలి అని విధించింది శాస్త్రం. ఎవరా ఆచరించవలసిన వారంటే  త్రైవర్ణికులన్నారు. బ్రహ్మక్షత్ర వైశ్యులే త్రైవర్ణికులంటే. వారు సంధ్యోపాసన చేసి తీరాలి. ఉప నీతులైన పెద్దలూ పిన్నలూ మనలో చాలామంది అలా పాటిస్తున్నారు కూడా. కాని కేవలం యాంత్రికంగా చేస్తున్నారా కర్మ. ఏదో మన పెద్దలందరూ ఇలా  చేస్తూ వచ్చారు మనమూ ఇలాగే నడుచుకోవాలది మనకూ మన కుటుంబానికీ మంచిదని చేస్తున్నారే తప్ప  తాము చదివే మంత్రాలేమిటో చేసే అనుష్ఠానమేమిటో దాని అర్థం తెలిసి కాదు. నూటికి తొంభయి మందికి అర్థ జ్ఞానమే లేదు. అర్థం దేవుడెరుగు. అసలు శబ్దోచ్చారణమే సరిగా చేయటం లేదు. తత్సవితుః అనే మాటలు విడగొట్టి తత్స - వితుః అని ఒకడుచ్చరిస్తే  వితుః అని కూడా కాక తత్స - పితుః అని మరొక డుచ్చరిస్తున్నాడు. మనచేత వ్రతాలూ అవీ చేయించే పురోహితులనూ దేవాలయాల్లో మంత్రాలు చదివే అర్చక సార్వభౌములనూ గమనిస్తే మీకే తెలుస్తుంది. చాలా వరికిదే వ్యవహారం.

అసలు అర్థం లేని చదువు వ్యర్థమన్నారు. వేదంలోనే ఒక మాట ఉన్నది. స్థాణు రయం భారహరః కిలాభూత్ - అధీత్య వేదం న విజానాతి యోఒర్థమ్. అర్థం తెలియకుండా ఎవడు వేదాధ్యయనం చేస్తుంటాడో వాడు కేవలం వేద శబ్దభారాన్ని మోస్తున్నాడు. బరువు మోసే కూలి వాడెలాటి వాడో వీడూ అలాటి వాడే. యదధీత మవిజ్ఞాతం - నిగదేనైవ శబ్యతే - అనగ్నా వివ శుష్కైధో - నత జ్వలతి కర్హిచిత్ - ఊరక మంత్రా లేకరువు పెడుతుంటాడే గాని అర్థజ్ఞానం లేదు వాడికి. వట్టి కట్టెలెన్ని పోగు చేసి వాటినెంత పొగ గొట్టం పెట్టి ఊదితే ఏమి ప్రయోజనం. నిప్పు కణిక వేయకపోతే మండుతుందా. నిప్పు కణిక లాంటిది జ్ఞానం. అది లేని మాటలన్నీ శుష్కమైన కట్టెల లాంటివేనని చీవాట్లు కూడా పెడుతున్నది శాస్త్రం. కాబట్టి శబ్దోచ్చారణ చేస్తున్నావంటే అది ఏమి చెబుతున్నదో దాని అర్థం మీద కూడా చూపుండాలి నీకు. అయితే అర్థజ్ఞానం లేకున్నా శబ్దోచ్చారణ చేస్తూ కర్మ లాచరించినా ఫలితముందని మహా అయితే జ్ఞానంతో చేస్తే వీర్యవత్తరం భవతి అని కూడా చెప్పింది గదా వేదమని అడగవచ్చు. అది మరీ మనం బద్ధకిస్తామని మనచేత కర్మలు యధావిధిగా చేయించాలని చెప్పిన ప్రశంసా వాక్యమే గాని యధార్థం కాదు. అదే యధార్థమైతే ముందు చెప్పిన మాటల కర్థం లేదు. కాబట్టి శబ్దార్థ జ్ఞాన మనేది ఆవశ్యకం.

దీనిబట్టి పదక్రమ జటాఘనలు చెప్పుకొని మహా పండితులమని విర్రవీగే చాలామంది వేద పండితులు కూడా ఎంత పండితమ్మన్యులో మీరే ఊహించవచ్చు. వారు వేద మీ మూల నుంచి ఆ మూల వరకూ చిలుక పలుకులాగా వల్లె వేస్తున్నారే తప్ప అంతకన్నా ఏమీ లేదు. అదేమిటి. ఉదాత్తాది స్వరంతో చదువుతుంటారు గదా. ఇటూ అటూ తిప్పి తిప్పి పదాలు శ్రావ్యంగా చదువుతారు గదా అంటే దానికి మనం మూర్ఛపో నక్కర లేదు. పూర్వకాలంలో అచ్చు యంత్రాలు లేవు. కాగితాలు లేవు. అంచేత వేద మంత్రాలు కంఠస్థం చేయవలసి వచ్చింది. ఆ చేసేటపుడవి ధారణలో నిలవాలంటే స్వరం మార్చి అటూ ఇటూ ఒకే మాట పలుమారు ఉచ్ఛరిస్తూ అవి కంఠస్థమయ్యే దాకా సాధన చేస్తూ వచ్చారు. అందుకోసం వచ్చిందీ ఘనాంత స్వాధ్యాయ మంతా. వినటానికి శ్రావ్యంగానే ఉంటుంది. సందేహం లేదు. సంగీతంలో ఒక చరణం పదే పదే సంగతి మార్చి పాడుతుంటే శ్రావ్యంగా ఉండటం లేదా. అలాగే ననుకోండి.

ఆకాలంలో నంటే అది అనివార్యమయితే కావచ్చు గాని. ఇప్పుడీ కాలంలో కూడా అలాగే చర్విత చర్వణంగా చేస్తూ పోతే ఏమి బాగు. అది కాదండీ మంత్రాలు చాలా గోప్యంగా ఉండాలి. అవి బాహాటం చేయటం మహాపచార మంటారా. ఈ రోజుల్లో అనవలసిన మాట కాదది. వేదాలన్నీ ఇప్పుడచ్చు వేసి పుస్తకాలు పంచి పెడుతున్నారు. వాటి అర్థం కూడా

తమకు తోచినట్టు వ్రాసి పారేస్తున్నారు. పదిమందీ చదువుకొంటున్నారు. మనమొక వేళ మడిగట్టుకొని కూచున్నా పాశ్చాత్య పండితు లూరుకోరు. తమ భాషల్లోకి అనువదించారు. అనువదిస్తున్నారు కూడా. అంతే కాదు. గాయత్రి దగ్గరి నుంచి మంత్రాలన్నీ వద్దని చెవులు మూసుకొన్నా మైకులలో వినిపిస్తూనే ఉన్నాయి ఎక్కడబడితే అక్కడ. దానికేమంటారు మీరు. అనధికారులైన incompetent వారి చెవిన పడగూడదని గదా గోప్యంగా ఉంచమన్నారు. అనధికారులు విన్నా పరవాలేదు. వారి కర్థం కాదు కాబట్టి. అర్థం కూడా వ్రాశారు గదా అంటే అది కేవలం వాచ్యార్థమే. దానితో తృప్తి పడే బాపతే కాబట్టి అప్పటికీ భయం లేదు.

ఇంతెందుకు. సాయనాచార్యుల లాంటి మహనీయులు వ్రాసిన భాష్యగ్రంథ ముందా లేదా నాలుగు వేదాలకూ. అది చాలా మంది వేదజడులు చూడకపోయినా దాని గంధమంతో ఇంతో ఉన్న వేద పండితుల కది విదితమే గదా. కాని బాహ్యార్థ జ్ఞానమే అది. అంతరార్థం వాళ్ళకూ తెలియదు. వీళ్లకూ తెలియదు. వాచ్యార్థం అంతరార్థం పరమార్థమని అసలు అర్థమనేది మూడు భూమికలు. ఎక్కడికక్కడ ఆగిపోతే సుఖం లేదు. పరమార్థం దాకా ప్రయాణం చేయాలి పాఠకుడు. నా వేదవిన్మను తేతం బృహంత మన్నారు. వేదార్థ జ్ఞానం లేకుండా సర్వవ్యాపకమైన బ్రహ్మతత్త్వాన్ని ఎవడూ అర్థం చేసుకోలేడట. ఆ వేదార్థం

కూడా వాచ్యార్థం కాదు. అంతరార్థం కూడా కాదు. రెండింటినీ మించిన పరమార్థం. అందుకే నహ్యాన ధ్యాత్మ విత్కశ్చి త్క్రియా ఫలము పాశ్నుతే అని మనువు తెగేసి చెప్పాడు లోకానికి. పరమార్థ జ్ఞానం లేకుండా నీవక్కడి కక్కడే ఎన్ని అర్థాలు చెప్పుకొన్నా లాభం లేదు. నీవు చేసే కర్మలకు సమగ్రమైన ఫలాన్ని నీవు ఆసించలేవని చాటి చెప్పాడాయన. బాహ్యార్థం కేవల మీకర్మ స్వరూపాన్ని దాన్ని ఆచరించే విధానాన్ని చెబుతుంది. అంతరార్థ మాయా కర్మ లేయే దేవతల నుద్దేశించి చేస్తున్నావో వాటి స్వరూప ప్రభావాలను మాత్రమే ఏకరువు పెడుతుంది. అంతేగాని వాటికతీతమైన తత్త్వాన్ని చెప్పలేదు. అదే అధ్యాత్మ మని మనువు పేర్కొన్నది. పరమార్థ మదే జీవితానికి. మిగతా అర్థాలు అర్థాలు కావా అంటే కావచ్చు. కాని ఎంతవరకో అంతవరకే. పరిచ్ఛిన్నమవి. పరిపూర్ణం కావు.

పరిపూర్ణమైనది ఒక్క పరమార్థమే. ఎక్కడ ఉందది. ఎక్కడ అని ప్రశ్నే లేదు. సర్వత్రా ఉన్నది. అద్వితీయమది. ద్వితీయముంటే అది సార్వత్రికం కాదు. అలాటి అద్వైత భావమనేది ఒక్కటే పరిపూర్ణం. అందులోనే మిగతా అర్థాలూ శబ్దాలూ అన్నీ చేరిపోతాయి. అసలు ప్రపంచ మంతా అదే వ్యాపించినప్పుడు శబ్దమనీ అర్థమనీ తేడా ఏముంది. భౌతిక ప్రపంచమంతా అదే. వేద వాఙ్మయమంతా అదే. కర్మకాండ అంతా అదే. దానివల్ల ఉపాసించే దేవతలూ దేవలోకాలూ అదే. మిగతా వన్నీ దీప

ప్రకాశాలైతే  సూర్య ప్రకాశం లాంటిదది. అంచేత మీరు బాహ్యమని చెప్పండి. ఆంతరమని చెప్పండి. ఏ అర్థం మీరు చెప్పినా అవన్నీ ఆ పరమార్థంలో చేరిపోవలసిందే. ఇలాటి అద్వైత దృష్టితో చేసిన వ్యాఖ్యానమే అసలు వ్యాఖ్యాన మనిపించుకొంటుంది. అలా వ్యాఖ్యానం చేసిన వాడే నిజమైన వ్యాఖ్యాత కూడా.

నా అదృష్టం కొద్దీ అలాటి వ్యాఖ్యాతల వంశంలోనే జన్మించాను నేను. ఇప్పటికి నలభయి యాభయి ఏండ్ల నుంచీ అద్వైత  సిద్ధాంతాన్నే నమ్ముకొని ఆ దృష్టితోనే  బ్రతుకు సాగిస్తున్నాను. ఏది చూచినా ఆ దృష్టితోనే చూస్తున్నాను. ఇటు భౌతిక  జగత్తును చూచినా  అదే దృష్టి. అటు వాఙ్మయ జగత్తును  చూచినా అదే దృష్టి. అలాటి అద్వైత దృష్టి నేమర కుండానే ఉపనిషత్తుల దగ్గరి నుంచీ భారత  భాగవత  రామాయణాది గ్రంథాల వరకూ  అన్నింటినీ సమన్వయిస్తూ  వచ్చాను. తదను గుణం గానే అనేక గ్రంథాలు రచించి ప్రకటించాను కూడా. అవి చదివిన వారికందరికీ ఇది అనుభవ సిద్ధమే. ఇది ఎంతో మాకు విజ్ఞానదాయకంగా  ప్రయోజన కారిగా ఉంది లాగే ఉండాలి ఏ వ్యాఖ్యానమైనా అని ఎంతగానో ప్రశంసిస్తూ వచ్చారు కూడా.

అంచేత సార్వజనీనమైనదీ మార్గమని చెప్పి ప్రస్తుత మీ గ్రంథం కూడా నేనా అద్వైత దృష్టితోనే చూచి గంభీరమైన ఆ భావాలనన్నింటినీ

యథాశక్తిగా బయటపెట్టదలచాను. సంధ్యా గాయత్రి అంటేనే అది బ్రహ్మ విద్య. మరి అధ్యాత్మ దృష్టితో గాక ఏ దృష్టితో చూడాలి దాన్ని. ఎక్కడ బట్టినా ఉన్న సత్యమదే అయినప్పుడది గాక ఏది చూపాలి లోకానికి. అదే ఉన్నప్పుడిక చూపటం దేనికంటారా. ఉన్నా మరుగుపడి ఉంటున్నది కాబట్టి బయటపెట్టటమే మనం చేస్తున్న పని. ఇది నేను చాలాకాలం క్రిందటనే ప్రవచనం చేశాను అక్కడక్కడా. కాని రికార్డు సరిగా కాలేదది. ఇటీవల కొందరు స్వదేశవాసులూ విదేశ వాసులూ అది గ్రంథరూపంగా వస్తే బాగుంటుందని కోరిక వెలిబుచ్చారు. అంచేత వారి కోరిక మేర కా కాసెట్టులలోని విషయం కొందరు శిష్యురాంద్రు కొంత వ్రాసి ఇస్తే మరికొంత భావన చేసి ప్రస్తుత మీ రూపంగా జిజ్ఞాసువులైన పాఠకుల కంద జేస్తున్నాను. ఇది మీకు తృప్తి నిస్తే నాకూ తృప్తే.

**ఇతి**

**బుధ జన విధేయః**

**శ్రీనివాస నామధేయః**

# సంధ్యా వందనము

## పూర్వార్థము

గాయత్రీ వ్యాహృతి స్సంధ్యా అని అమ్మవారిని కీర్తించాడు హయగ్రీవ మహర్షి. అంచేత సంధ్య ఎవరో గాదు. గాయత్రే. ఆ గాయత్రి కూడా ఎవరో గాదు. లలితా దేవే. అంటే పరమాత్మ తాలూకు మహాశక్తే. ఆ శక్తి కాల స్వరూపిణి. కాలమంటే కదిలేది. కనుకనే అమ్మవారికి కాళీ అని పేరు వచ్చింది. మహాశక్తి గనుక మహాకాలి అని అన్నారు. అచలమైన తత్త్వం నుంచి చలించి వచ్చిందా మహాశక్తి. పరమాత్మ అచల స్వరూపుడు. సర్వవ్యాపకమైన తత్త్వమెలా చలిస్తుంది. పరిపూర్ణమూ పరిశుద్ధమైన జ్ఞానమది. అలాంటి జ్ఞాన స్వరూపం నుంచి క్రియారూపంగా బయలుదేరిందా శక్తి. అది అచలమైతే ఇది చలం. చలించి పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ అని నాలుగు దశలలో క్రిందికి దిగి వచ్చింది. వచ్చి అదే చివరకు వైఖరీ రూపమైన ఈ ప్రపంచంగా కనిపిస్తున్నది. కనుక మనం చూచే ఈ చరాచర ప్రపంచమేదో గాదు. నిరంతర భ్రమణ శీలమైన ఆ మహాశక్తే.

ఇలాటి కాలస్వరూపిణి అయిన మహాశక్తిని మనమావాహన చేసుకొని దాన్ని నిత్యమూ ధ్యానిస్తూ పోతే మరలా ఇది మనల నా మూలతత్త్వం దగ్గరికి చేర్చగలదు. ఏది ఎక్కడి నుంచి వస్తుందో అదే మరలా మన బుద్ధి నా స్థానం చేర్చటాని కాలంబనం. కనుకనే మనం సంధ్యను వందనం చేయాలి. సమ్యగ్ధ్యానమే సంధ్య అనే మాట కర్థం. చక్కగా ధ్యానం చేస్తే అది సంధ్య. సంధిలో వచ్చేది గనుక సంధ్య అని కూడా పేర్కొన్నారు. సర్వకాల సర్వావస్థలలోనూ ధ్యానం చేయవలసిందే. కారణమేమంటే సర్వ కాలాలూ సర్వావస్థలూ కూడా ఆ మహాశక్తే వ్యాపించి ఉంది. అంచేత ఎప్పుడూ ఏ దశ అని ప్రశ్నే లేదు. ఏ కాలంలో చేసినా అది మనకు ఫలితమిస్తుంది. ఈ కాలమనేది భూత భవిష్య ద్వర్త మాన రూపంగా విభజించి వ్యవహరిస్తున్నామే. ఇది ఆ దేవత బాహ్య రూపం. దాని ఉపాధి. ఈ ఉపాధి రూపంగా ఏది అభివ్యక్తమవుతున్నదో అది దేవత. కాబట్టి ఆ కాలాధి దేవత నీ కాలం ద్వారా మనమందుకోవాలి. అదే ఆరాధన. ఉపాసన. వందనం. సంధ్యావందనం.

కాలం ద్వారా పట్టుకోవాలంటే ఏమిటర్థం. మనమందరమూ పుట్టిందీ బ్రతుకుతున్నదీ చివరకు కన్ను మూసేదీ కాలంలోనే. కాలాన్ని దాటిపోలేము. కాలాధీనులం మనం. కాలరూపిణి అయిన ఆశక్తి క్షేత్రంలోనే మన జీవితమంతా సాగిపోతున్నది. అదే మన శరీరంగా ఇంద్రియాలుగా

ప్రాణంగా మనస్సుగా ఇలా భాసిస్తున్నది. మనమే సాధన చేయాలన్నా మనస్సుతోనే. ఈ మనస్సు కూడా చలిస్తుంటుంది. అమ్మవారు చలించే గదా అసలు మన దగ్గరకు వచ్చింది. ఆవిడ మనోరూపంగా మనస్విని మనోమయి అయి మనలో చేరింది. మనలో ఉన్న దావిడే గనుక మనోవృత్తి ద్వారా ఆవిడ స్వరూపాన్ని పట్టుకోటం చాలా సులభం కూడా. సులభా అనే పేరు కూడా ఉందమ్మ వారికి. మరి దుర్లభా అనే నామం కూడా ఉంది గదా అంటే తదాకారంగానే భావన చేస్తే సులభ. తద్భిన్న రూపంగా భావిస్తే దుర్లభ అని అర్థం చేసుకోవాలి మనం.

ప్రస్తుతం తదాకారమైన మనోవృత్తితో ధ్యానం చేయట మెలాగో నిరూపిస్తున్నదీ సంధ్యావందన మనే ప్రక్రియ. ఇందులో మూడు భాగాలున్నాయి. మొదటి దా దేవత నా వాహన చేయటం. రెండవది దాని నుపాసన చేయటం. మూడవది దాని నుద్వాసన చేయటం. అయితే ఉద్వాసన చేస్తే ఆ దేవత మన దగ్గర లేకుండా పోతుంది గదా. ఆ శక్తి నెప్పుడూ సాధకుడు తన దగ్గర ఉంచుకోవాలి గాని దూరం చేసుకోట మేమిటని ప్రశ్న. ఉద్వాసన అనేది తాత్కాలికమే. మరలా మనకు ప్రత్యక్ష మవుతుంది. నిత్యమూ ప్రత్యక్ష మయి ఉండాలి గాని మరలా ప్రత్యక్షం కావట మేమిటని అడగవచ్చు.

ఉద్వాసన అనేది పైకి శబ్దరూపంగా చేస్తున్నాము మనం. అంతేగాని నిశ్శబ్ద రూపంగా ఆ దేవతా ప్రభావం మనసులో ఉంటూనే ఉంటుంది.

సంస్కార రూపంగా ఉన్న దాన్నే రెండవ రోజు శబ్ద రూపంగా ఆవాహన చేస్తామన్న మాట. అంచేత అవ్యక్తంగా ఉన్న శక్తిని అప్పుడప్పుడు వ్యక్తం చేసుకొని దర్శించటమే మనం చేసే వందనం. చేసినా చేయక పోయినా అవ్యక్త రూపంగా నీ దగ్గరే నీ మనసులోనే ఉందది. మనోమయి గదా లేకుండా ఎలా పోతుంది. ఇదీ ఇందులో ఉండే అంతరార్థం.

కాబట్టి సర్వకాలాల్లో నని కాకపోయినా కనీసం మూడు కాలాల్లో నైనా చేయవలసిన బాధ్యత ఉంది మానవుడికి. ఆ మూడు కాలాలకూ మూడు సంధులని పేరు. సంధి అంటే రెండింటి కలయిక. ఏమిటా రెండూ. పగలూ రాత్రీ. రాత్రి పోయి పగలు వచ్చే సంధి ప్రాతస్సంధి. పగలు పోయి రాత్రి వచ్చే సంధి సాయం సంధి. అలాగే పూర్వాహ్ణం పోయి అపరాహ్ణం వచ్చే సంధి మాధ్యాహ్నిక సంధి. ఈ మూడు సంధులలో ఆ దేవత అభివ్యక్త అవుతుంది గనుక సంధ్య అని పేరు వచ్చిందా దేవతకు. అలాగే ఈ త్రిసంధులలో చక్కగా ధ్యానం చేస్తే మనం కోరిన ఫలాన్ని అందజేస్తుంది గనుక కూడా సంధ్య అని పేరు వచ్చింది. సమ్యగ్ధ్యానం చేస్తే సంధ్య. లేక సంధిలో ప్రకటమైతే సంధ్య. ఏ అర్థం చెప్పుకొన్నా సరిపోతుంది.

సంధి అనే దాని కెందు కింత ప్రాధాన్య మిచ్చారంటే అసలు సంధి అంటే ప్రాతః కాలం సాయంకాలమని కూడా కాదు. అది కేవలం

బాహ్యార్ధమే. అంతరార్థం వేరే ఉన్నది. మనసులో ఒక వృత్తి పోయి మరొక వృత్తి ఏర్పడే మధ్యకాలం సంధి. అది ఒక్క క్షణమైనా ఉంటుందో లేదో. ఆ క్షణంలో ఆ వృత్తీ లేదు. ఈ వృత్తీ లేదు. రెండూ నివృత్తి అయిపోయి ఒక ఖాళీ ఏర్పడుతుంది మనసులో. అప్పుడున్నది సాక్షిరూపమైన మన చైతన్యం తప్ప మరొక భావమేదీ మిగలదు. ఇలా ఆ శుద్ధ చైతన్యాధి దేవత ఈ చిత్త వృత్తుల రాకపోకల మధ్య కాలంలోనే ప్రకటమవుతుంది గనుక దీని నొక బాహ్యమైన సంకేతంగా భావించి సేవిస్తుంటాం. ఇదీ విషయం. ఇలాటి భావన అనండి. ధ్యాన మనండి. మనం దానినెలా చేయాలో వర్ణిస్తున్నది మంత్రం మనకిప్పుడు.

**అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతోపి వా**

**యః స్మరే త్పుండరీక్షమ్ స బాహ్యాభ్యంతర శ్శుచిః**

సః – ఆ మానవుడే శుచిః – పరిశుద్ధు డనిపించుకొంటాడు. ఎక్కడ. బాహ్య ఆభ్యంతరః – లోపలా వెలపలా కూడా వాడు పరిశుద్ధుడే. సందేహం లేదు. స్నానం చేస్తేనా. కాదు. స్నానం చేస్తే కలిగే పవిత్రతా చేయకపోతే కలిగే అపవిత్రతా కాదది. అపవిత్రః – వాడు స్నానం చేయకున్నా శుచీ శుభ్రతా లేకున్నా పవిత్రుడే. లేదా పవిత్రః – స్నానం చేసి నేను పవిత్రుడనయ్యానని భావించినా పవిత్రుడే. కేవలం స్నానపానాలు కావు కావలసింది. అది బాహ్యమైన క్రియ. ఆ మాటకు వస్తే సర్వావస్థాం

గతోపివా – ఏ దశలోనేనా ఉండనివ్వండి వాడు. అవి జాగ్రత్స్వప్న సుషుప్తులే కావచ్చు. శయనాసన భోజన భాజనాదులే కావచ్చు. కూచున్నా నిలుచున్నా నడుస్తున్నా మాటాడుతున్నా ఎప్పుడైనా సరే. మాకు వాడి శారీరకమైన దశ కాదు ముఖ్యం. మరేమిటి. మానసికమైన స్థితి.

ఏమిటా మానసికం. అంటే చెబుతున్నాడు. యః స్మరేత్. ఎవడైతే మనసులో ఎప్పుడూ స్మరిస్తుంటాడో. స్మరించట మంటే తదేక ధ్యానంతో ఉండటం. అదే ఆలోచన. ఎవరిని గురించి ఆలోచన. పుండరీ కాక్షం. మీరేమి వైష్ణవులా పుండరీ కాక్ష మంటున్నారు. త్రియంబక మనవచ్చు గదా. ఈయనకు రెండయితే ఆయనకు మూడున్నాయి అక్షులు. అలాంటి వాణ్ణి స్మరిస్తే ఇంకా మంచిది గదా అంటే అది గాదిక్కడ అర్థం. పుండరీక మంటే తెల్ల తామర. తెల్లని తామర పువ్వులాగా వికసించి సర్వత్రా విస్తరించినట్టు కనిపించేది ఈ అనంతమైన ఆకాశం. దానిలాగా సర్వవ్యాపకమయి దాన్ని సాక్షిగా గమనించే అక్షి అంటే జ్ఞానమని అర్థం. అప్పటికి జడమైన ఆకాశానికి కూడా సాక్షి అయిన ఏ అఖండ జ్ఞానమున్నదో అలాటి పరమాత్మే ఇక్కడ పుండరీకాక్ష అనే శబ్దాని కర్థం. సర్వసాక్షి గనుక అక్షి అయినా అది ఎప్పుడూ ముకుళించే స్వభావం లేని అక్షి. అలాటి పరమాత్మ చింతనతో నిరంతరమూ నీ మనసు నిండి ఉంటే చాలు. నీవు పవిత్రుడవే. భావంలో బాహ్యంలో కూడా పవిత్రుడవే నంటున్నది మంత్రం.

త్రికరణాలలోనూ ప్రధానమైనది మానవుడి మనస్సు. దాన్నిబట్టి ఉంటుంది. మాట. దాన్నిబట్టే ఉంటుంది బాహ్యమైన చేష్ట. మనస్సులో ఏ ఆలోచన ఉంటే దాని ప్రభావమే వాక్కు మీదా కాయం మీదా పడుతుంది. పనికిమాలిన ఆలోచన అయితే మనసు అశుద్ధ మవటమే గాక దాని ననుసరించి ఇవీ అశుద్ధమయి పోతాయి. అలాకాక అందులో గొప్ప భావాలుదయిస్తే చిత్త శుద్ధే గాక వాక్శుద్ధీ కాయశుద్ధీ కూడా ఏర్పడుతుంది. అన్నిటికన్నా గొప్ప భావన పరమాత్మ భావన. అదే భావనతో ఉన్న మనస్సిక పరిశుద్ధం కావటంలో ఆశ్చర్య మేముంది. అది పరిశుద్ధమయితే వాక్కాయాలనే మిగతా రెండూ అప్రయత్నంగా పరిశుద్ధమవుతాయి. కనుక శరీరాన్ని స్నానపానాలతో శుభ్రం చేసుకొన్నామని గాదు మనం సంతోషించవలసింది. మనస్సు భగవచ్చింతనతో పరిశుద్ధమైతే చాలు. వీటికీ శుద్ధి ఏర్పడుతుంది. దానికి ప్రయత్నిస్తే ఇది కూడా లభిస్తుంది గాని దీనికోసమే ప్రయత్నిస్తే మాత్ర మది రాదు. ఇదీ ఇక్కడ ఉన్న కీలకం.

ఏతావతా మనసులో నిత్యమూ పరమాత్మ స్మరణ చేస్తూ బ్రతకటమే మానవుడి కర్తవ్యమదే వాడికి నిత్య నైమిత్తికాది సకల కర్మలలోనూ పవిత్రత నాపాదిస్తుందని చెప్పినట్టయింది. కాని మానవుడి జీవితం మీద ఎన్నో ప్రతిబంధక శక్తులు పని చేస్తుంటాయి. అవి ఈ స్మరణను నిరాఘటంగా

సాగనివ్వవు. శ్రేయాంసి బహు విఘ్నాని అన్నారు పెద్దలు. ఎప్పటికప్పుడివి మన మార్గాని కడ్డు తగులుతుంటాయి. ఏమిటా శక్తులెన్ని అని అడిగితే ఇరవయి నాలుగని పరిగణించారు పెద్దలు. వాటినే చతుర్వింశతి తత్త్వా లంటారు.  భగవద్గీతే చాటి చెబుతున్న దొక పక్క. మహాభూతాన్య హంకారో బుద్ధి రవ్యక్త మేవచ. ఇంద్రియాణి దశైకంచ  పంచ చేంద్రియ గోచరాః – అన్నీ కలుపుకొని చూస్తే ఇరవయి నాలుగవుతాయి. ఏకంచ అనటంలో ఆ ఏకమేదో గాదు మనస్సు. అప్పటి కెక్కడి నుంచి ఎక్కడికీ పరిగణన. బాహ్యమైన ఆకాశం దగ్గరి నుంచి ఆంతరమైన  హృదయాకాశం వరకూ. Matter and Mind  అనేవి ఇవే.

ఇప్పుడీ చతుర్వింశతి తత్త్వాలలో మొత్తం సృష్టి అంతా కలిసి వచ్చింది. అండ పిండ బ్రహ్మాండాత్మకమైన  దీన్నే మనం ప్రపంచమని పేరు పెట్టి పిలుస్తున్నాము. ఈ ప్రాపంచికమైన ఆలోచన లేవైతే ఉన్నాయో అవే  మన పాలిటికి  అసుర సంపద. ఇలాటి అసుర భావాలన్నీ వచ్చి మనసులో చేరి తాండవం చేస్తుంటే పరమాత్మ తాలూకు స్మరణ కిక అవకాశ మేముంటుంది. నిత్యమూ పరమాత్మ భావనతో సత్కర్మ లాచరించాలంటే మనం వీటి ధాటికి తట్టుకొని నిలవ గలగాలి గదా. ఎలాగా అని ప్రశ్న.

దీనికి సమాధానమే కేశవ నామాలు. ఇరవయి  నాలుగు నామాలివి. ఇవి ఇరవయి నాలుగూ ఆ ఇరవయి నాలుగు అసుర భావాలకూ జవాబు

చెబుతాయి. పరమాత్మ నామాలు గదా ఇవి. వీటిని జపిస్తూ పోతే ప్రాపంచికమైన భావాలను దూరంగా పారదోలుతాయి. ఇందులో ఉన్న ఆంతర్య మేమంటే నామమంటే పరమాత్మకు సంబంధించిన చిత్తవృత్తి Idea . ఆలోచనే నామం. బాహ్యంగా మనకు కేశవాది నామాలుగా Word కనపడుతున్నాయవి. అందులో ఒక్కొక్క నామం మన ముచ్చరిస్తుంటే పరమాత్మ తాలూకు ఒక్కొక్క ఆలోచనను కలిగిస్తుంటుందది. నామం శబ్దమైతే ఆ ఆలోచన అర్థం. ఈ శబ్దాన్ని ఉచ్చరిస్తున్నప్పుడా ఆలోచన మన మనసుకు రావాలి. అంటే పరమాత్మ ఆ రూపంగా మనసులో ప్రవేశించాలన్న మాట.

అదే ఆచమనం. ఆచమన మంటే నీరు లోపలికి తీసుకోటం. ఈ నీరు పరమాత్మ కొక ఉపాధి Medium. దీని ద్వారా పరమాత్మే మన లోపలికి వస్తున్నదని భావన చేయాలి మనం. ఓం కేశవాయ స్వాహా - ఓం నారాయణాయ స్వాహా - ఓం మాధవాయ స్వాహా - ఇవి విష్ణు నామాలే అనుకో నక్కర లేదు. ముందు చెప్పినట్టు శివకేశవులకు భేదం లేదు. శివాయ విష్ణు రూపాయ - అని చివరలో అదే చెప్పబోతాడు మహర్షి. అయితే వీటి కర్థమేమిటి. క అఈశ - అనే మూడూ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురికీ సంకేతాలు. అదే కేశవ అయింది. అలాగే నారములంటే పంచభూతాలు. వాటి కయన మంటే అధిష్ఠానం లేదా

ఆధారం నారాయణ. అలాగే మా అంటే నామరూపాత్మకంగా విస్తరించిన పరమాత్మ విభూతి. దానికి ధవ అధిపతి మాధవ. పరమాత్మ స్వరూపమే. ఇలా కేశవాది నామాలు ప్రతి ఒక్కటీ త్రిమూర్తులను గాక వాటికి మూలమైన అమూర్తమైన పరతత్త్వాన్నే మనకు చెబుతున్నది.

అయితే మరి మూడు నామాలే చెప్పి ఆచమనం చేస్తున్నామే. మిగతా నామాల మాటేమిటి. మూడే చాలు. మిగతా ఇరవయి ఒక్క నామాలకూ అది ఉపలక్షణం Indicative. కారణమంటే మనకున్నవి మూడే కరణాలు. అవి మనో వాక్కాయాలు. అవి శుద్ధి కావాలి మొదట ఏ కర్మ నాచరించటానికైనా. అవి మూడూ శుద్ధి అయితే వాటి ద్వారా చేసే కర్మలన్నీ శుద్ధి అయినట్టే. అందుకే మిగతా నామాలు మామూలుగా ఉచ్చరించినా మొదటి మూడు నామా లుచ్చరిస్తున్నప్పుడే ఆచమనం చేస్తుంటాము. చేస్తే అది స్వాహా అయి పోతుంటుంది. అంటే లోపల ఆహుతి అయిపోతుంది. చేరిపోతుంది. జలం శరీరంలో చేరిపోయినా తద్వారా పరమాత్మ భావం మన మనసులో చేరిపోతున్నదని భావన.

ఈ నామాలలో మొట్టమొదటిది కేశవ అని గదా చెప్పాము. అది త్రిమూర్తులకు సంకేతమని గదా పేర్కొన్నాము. పోతే త్రిమూర్తులు త్రిగుణాలకు సంకేతం. త్రిగుణాత్మకమైనది ఈశ్వర ప్రకృతి. అది ఆయనతో అవినాభూతంగా ఉన్న మాయా శక్తే. అదే నామరూపాత్మకంగా ప్రసరించి

ఈ చరాచర సృష్టి ఏర్పడింది. నిర్గుణం స్వరూపమైతే సగుణమైన ఈ సృష్టి దాని మాయా విలాసం. ఇదే ఇప్పుడు మనకు ప్రతిబంధకమయి కూచున్నది. కనుక దీనిని మరలా పారమేశ్వరమైన శక్తిగా దాన్ని మరలా పరమాత్మ స్వరూపంగా భావన చేయాలి మనం. అందుకోసం పరమాత్మ నామాలు స్మరిస్తూ పోవాలి. అదే కేశవాయ స్వాహా మొదలుకొని శ్రీకృష్ణాయ నమః ఉచ్చరించే వరకూ మనం చేస్తున్న పని. అవిద్యాకామ కర్మలనే అన్ని పాపాలనూ హరించే వాడు హరి. హరించి మన బుద్ధులను నాటి బంధం నుంచి బయటికి లాగే వాడు కృష్ణ. కర్షతీతి కృష్ణః – కర్షణ చేయటమంటే లాగటమనే శబ్దార్థం. అది అపకర్షణ అయినా కావచ్చు. ఉత్కర్షణ అయినా కావచ్చు. ముందు వీటి నుంచి అపకర్షణ చేసి తరువాత అసలైన తత్త్వం వైపు ఉత్కర్షణ చేయాలి. రెండింటికీ సమర్థమైన దాయన శ్రీ. శ్రీ అంటే ఆయన నాశ్రయించిన మాయా శక్తి. పరమాత్మ వశంలోనే ఉంది కాబట్టి అది – మన మాయనను స్మరిస్తూ పోతే ప్రతిలోమంగా అది మనలనీ ప్రతిబంధకాల నుంచి తప్పించి అనులోమంగా జీవిత గమ్యాన్ని మనకు ప్రసాదించ గలదని తాత్పర్యం.

ఇప్పుడా బలంతో మనమిలా భావించాలి. ఏమని.

**ఉత్తిష్ఠంతు భూత పిశాచాః – ఏతే భూమి భారకాః**

**ఏతేషా మవిరోధేన – బ్రహ్మ కర్మ సమారభే –**

భూత పిశాచాః అంటే పంచభూతాలే మనపాలిటికి పిశాచాలు. ఇవి మనదారి కడ్డు తగులు తున్నాయి. భూత భౌతిక పదార్థాలే గదా నామ రూపక్రియలన్నీ. వీటి ఆలోచనలే గదా నిత్యమూ మన మనస్సులో చేరిపోయి సంసారంలో పడదోశాయి మనలను. ఇవన్నీ ఉత్తిష్ఠంతు. నామోచ్చారణతో ఉచ్చాట నమయి పోవాలి. ఎందుకని. భూమి భారకాః – ఇవన్నీ భూమికి భారం. భూమికి భారమైనా కాకున్నా మానవుడి మనో భూమికి భారం కాగూడదు. మన మనస్సనే క్షేత్రంలో చేరిపోయా యివన్నీ. కనుక వీటితో బరువెక్కి పోయింది మనస్సు. అదే బంధం. అది ముక్త మవ్వాలిప్పుడు. తేలిక పడాలి. నామోచ్చారణతో వాటి బరువు తొలగిపోతే తేలిక పడుతుంది. పడితే ఏతేషా మవిరోధేన ఇక వాటితో పేచీ లేదు మనకు. పరమాత్మ భావనలోనే లీనమయి పోతాయవి కూడా. కనుక బ్రహ్మ కర్మ సమారభే. బ్రహ్మ కర్మను మనమిక నిరాఘాటంగా సాగించవచ్చు.

బ్రహ్మ కర్మ అంటే బ్రహ్మ ప్రాప్తి కోసం చేసే కర్మ. స్వర్గ ప్రాప్తి కోసం చేసేది కాదు. అది మరలా సంసారంలో పడదోసేదే. బ్రహ్మ సాయుజ్యానికి పనికిరాదు. బ్రహ్మ సాయుజ్యమే జీవిత సమస్యకు పరిష్కారం. అంచేత బ్రాహ్మణుడనైన నేను బ్రహ్మతత్త్వాన్ని చేర్చే కర్మనే చేస్తూ పోవాలెప్పుడూ. అది దృష్టిలో పెట్టుకొని చేస్తున్నా నీ సంధ్యా వందన కర్మ కూడా ఇప్పుడని సంకల్పించి చేయాలి. ఎలాగ.

**ఓం భూః ఓభువః ఓం సువః ఓం మహః**

**ఓం జనః ఓం తపః ఓం సత్యం**

**ఓం తత్సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి**

**ధియో యోనః ప్రచోదయాత్**

**ఓ మాపో జ్యోతీర సోఽ_ మృతగ్ం బ్రహ్మ భూర్భువ స్సువ రోమ్**

ఓంకారంతో ప్రారంభమయి మరలా ఓంకారంతో సమాప్తమవుతున్న దొక మహా మంత్రం. సోహం అనే దాని వికారమే ఓం. నేనా పరమాత్మనే ఆ పరమాత్మ ఏదో గాదు నా స్వరూపమే నని అర్థం. అంటే పరోక్షంగానూ నేనే. అపరోక్షంగానూ నేనే. నాకు భిన్నంగా మరేదీ లేదనే గొప్ప అద్వైత భావమిది. ఇది మంత్ర రూపంగా దర్శించాడొక మహర్షి. ఆయన పేరు విశ్వామిత్రుడు. విశ్వానికంతా మిత్రుడు. ఆయన దర్శించి మనకు బోధించినదే ఈ గాయత్రీ మంత్రం. ఇదే సంధ్య అని కూడా చెప్పాము దీన్ని వందనం చేయటమే చేసి మన స్వరూపంగా అనుభవానికి తెచ్చుకోటమే సంధ్యావందన ప్రక్రియ కంతా సారాంశం. ఇది తాత్పర్యమైతే దీని చుట్టూ అల్లినదంతా ఇక క్రియా కలాపమే. అది ఈ మంత్రానికి ముందూ దీని తరువాతా మనకు కనిపిస్తూనే ఉన్నది. అదంతా శరీరమైతే ఈ మంత్రమే దాని కంతటికీ ప్రాణమనుకోండి.

ఏమిటింతకూ ఈ మంత్రాని కర్థం. మన నా త్ర్రాయతే ఇతి మంత్రః – మననం చేసే కొద్దీ మనలను కాపాడేదేదో అదీ మంత్ర మంటే. మంత్రాణా మర్థ స్తిరోహితో భవతి అని పెద్దల మాట. మంత్రం పైకి కనిపిస్తున్నా మంత్రార్థమలా కనిపించదు. అందులో గుప్తమయి ఉంటుంది. మననం వల్లనే అది ప్రకట మవుతుంది. అది కూడా అధి భౌతిక మాధ్యాత్మిక మాధి దైవికమని మూడు భూమికలలో భావన చేయవలసి ఉంటుంది మనం. అసలాధి దైవికమైన స్థాయి నుంచే దిగి వచ్చిందది మనదాకా. మనదాకా దిగి వచ్చేటపుడది గాయత్రి. గాయతి త్రాయతే ఇతి గాయత్రీ. గానం చేస్తూ వచ్చిందది. వచ్చి మనం దాన్ని అర్థం చేసుకొంటే త్రాయతే కాపాడుతుందట. గాతారం త్రాయతే గాయంతం త్రాయతే. ఎవడా మంత్రాన్ని గానం చేస్తుంటే వాణ్ణి కాపాడుతుంది గనుక గాయత్రి అయిందన్నారు అభిజ్ఞులైన పెద్దలు. గానం చేస్తూ వచ్చింది గనుకనే మరలా మనం గానం చేస్తే కాపాడుతుంది.

ఆ రావటమే అవరోహణ. కాపాడటమే ఆరోహణ. మంత్రం ద్వారా మంత్రాధి దేవత పరమాత్మ శక్తి మనదాకా ప్రసరించట మవరోహణ అయితే దీన్ని పట్టుకొని మరలా మన బుద్ధి అంతకంతకు ఊర్ధ్వముఖంగా ప్రసరించటమే ఆరోహణ. ఇక్కడ మన ముచ్చరించేటపు డారోహణ రూపంగా నడుస్తుంది మంత్రం. కాని అందులో దాని అవరోహణ

గుప్తమయి ఉందని భావించాలి. **ఓం భూః ఓం భువః ఓం సువః** అని ఉచ్చరిస్తున్నామంటే ఇది ఆరోహణ. అంటే మనమున్న ఈ భూలోకం మీది నుంచి పైపైకి వెళ్లిపోతుంటుంది మన బుద్ధి. కాని ఈ ఆరోహణ అంతకు ముందు జరిగిన అవరోహణను సూచిస్తుంది. ఎలాగంటే **ఓం సత్యం ఓం తపః ఓం జనః ఓం మహః ఓం సువః ఓం భువః ఓం భూః** అని ఇవి సప్త వ్యాహృతులు. వ్యాహృతి అంటే ఉచ్చారణ. ఏడు మాట లుచ్చరించా మిప్పుడు. ఇవి ఏడూ ఏడు లోకాలకు ప్రతీకలు Symbols. సత్యమనే భూమిక నుంచి భూమి అనే భూమిక దాకా ఏడు భూమికలు దాటి క్రిందికి దిగి వచ్చిందా చైతన్య ధార గాయత్రీ రూపంగా. ఇది అవరోహణ క్రమం. ఇది ఇప్పుడు గుప్తమయి ఉందీ ఆరోహణ క్రమంలో. మనమున్న దిప్పుడు భూతలం కాబట్టి ఇక్కడి నుంచి మరలా మనం భూః భువః సువః అనుకొంటూ వెనక్కు ప్రయాణం చేయాలన్న మాట.

ఈ లోకాలన్నీ అక్కడెక్కడో యధార్థంగా ఉన్నాయని అక్కడికి వెళ్లి మనం చేరుతామని కూడా కాదు. అంతరార్థ మేమంటే సత్యమనేది పరమాత్మ. సత్యం జ్ఞాన మనంతమని ఉపనిష ద్వాక్యం. ఏది ఎప్పుడూ ఉంటుందో అది సత్యం. అలా ఉన్నది బ్రహ్మమే. దానికోసమే మన ఈ కర్మానుష్ఠానమంతా. బ్రహ్మా కర్మ సమారభే అని మొదటనే చెప్పాము గదా. కాబట్టి బ్రహ్మమే సత్యం. అది ఉన్నట్టుండి తపః తపస్సు చేసింది.

అంటే ఆలోచించింది. సంకల్పించిందని అర్థం. పరమాత్మ నుంచి ఒక ఇచ్ఛా శక్తి బయలు దేరిందదే ఆయన తపస్సు. అప్పటికి కూటస్థమైన తత్త్వ మొక మెట్టు క్రిందికి దిగింది. అంటే ఆయన మహాశక్తి అవరోహణ చెందుతున్నది. అది జనః అఖండమైన జ్ఞానంలోనే జన్మించిందది. అదే ఆకాశం. ఈ ఆకాశంలోనే మరొకటి విశాలంగా వ్యాపించిందది మహః వాయుమండలం. దానినుంచి సువః తేజస్తత్త్వం తయారయింది. అందులో నుంచి వచ్చింది భువః జలతత్త్వం. దానివల్ల ఆవిర్భవించింది భూః - పృథివీ తత్త్వం. ఇదీ సృష్టీ క్రమం – అవరోహణాత్మకంగా సాగుతూ వచ్చింది.

అయితే మనమీ సృష్టి క్రమం పట్టుకొంటే సుఖం లేదు. ఇది సంసారంలో పడదోస్తుంది. కనుక ఇందులో నుంచి బయటపడాలంటే దీన్ని మనం లయక్రమంలో భావన చేయాలి. అంటే ఆరోహణ మార్గంలో వెళ్లిపోవాలి. అందుకే మంత్ర మారోహణాత్మకంగా నడుస్తుంటుంది. **ఓం భూః ఓం భువః ఓం సువః** అని గదా ఉచ్చరిస్తుంటాము. ఇది ఆరోహణ మార్గం. అంటే అమ్మవారు మనల నంత కంతకు పై అంతస్తుకు తీసుకువెళ్లుతున్నట్టు భావన. ఆ శక్తి క్రిందికి దిగి వచ్చి గదా మనలను పైకి కొనిపోవలసింది. క్రిందికి దిగి వచ్చి భూః పృథివీ తత్త్వంగా మారిపోయింది. ఇదే ఆవిడ వైఖరీ రూపం. వైఖరి అంటే అది భౌతికమైన స్థాయి. అదే ఇప్పుడు మనకు కనిపించే ఈ సూర్యమండలం.

ఓం తత్సవితు ర్వరేణ్యం భర్గః – తత్తంటే అది. ఎక్కడో పరోక్షంగా ఉన్న ఆ పరమాత్మ తత్త్వం సవితగా మనకు భాసిస్తున్నది. ప్రసవించేదీ లేదా ప్రసరించేదేదో అది సవిత. సూర్యమండల మని అర్థం. సూర్యుడే అందజేస్తున్నాడు మనబోటి ప్రాణి కోటికి. ఏమిటది. భర్గః – తేజస్సు. ఒక్క తేజస్సే కాదు. జలం కూడా. జలమే కాదు. అన్నం కూడా. సవితృ మండల మంటే ఏదో గాదది. భౌతికమైన మండలంగా కనిపిస్తున్నా పరమాత్మ చైతన్య శక్తి కుపాధి అది. శక్తే తద్రూపంగా భాసిస్తూ మనకు వెలుగునిస్తున్నది. ఆ వెలుగే అందకుంటే మన జీవితాలు ఖాళీ. వెలుగు మాత్రమే గాక జలాన్ని కూడా ప్రసాదిస్తుంది. సూర్యుడి తేజస్సు లేకపోతే జలం లేదు. ఆ జలం భూమిపైన వర్షిస్తుండటం వల్లనే భూమి సారవంతమై పంట చేతికి వస్తున్నది. అన్నం పెడుతున్నది. కనుక పృథ్వి కూడా అదే. తేజో బన్నాత్మకమీ సృష్టి అంతా. ఈ తేజోబన్నాలు మూడూ సవితృ మండల ప్రసాదమే. అది తద్వారా మనకు లభించే పరమాత్మ ప్రసాదమే. అదే దేవస్య. సవితృ మండల రూపంగా ప్రకాశిస్తున్నదసలు. దాని భర్గ. తేజస్సునే ధీమహి పట్టుకొని నిత్యమూ ధ్యానం చేయాలి మనం. ధీమహి అంటే ధ్యానమని కూడా కాదు. నిదధీ మహి. సాధకుడు ఆ దివ్య తేజస్సు మనసులో నింపుకోవాలని కూడా సెలవిచ్చారు సాయనాచార్యులు.

అది మనసులో ప్రవేశించటం మూలాన్నే జీవుడికి తైజసుడని పేరు వచ్చిందసలు. మనసులో ఆ తేజస్సున్నదని ఏమిటి దాఖలా. మనస్సుకు ప్రతి ఒక్కటీ భాసిస్తున్నది. స్ఫురిస్తున్నది. ఏదో ఒక ప్రకాశం లోపల లేకపోతే మనకేదీ స్ఫురించదు. గోచరించదు. అంచేత భర్గో దేవస్య ధీమహి. స్ఫురణ రూపంగా మనలో నిత్యమూ తిష్ఠ వేసుకొని కూచున్న ఆ చైతన్య దీప్తినే సౌరమండల దీప్తిగా మనసులో ప్రవేశించినట్టు భావించి ధ్యానిస్తూ పోవాలి మనం. సవిత అంటే సూర్యుడు. దేవ అంటే ఎప్పుడూ ప్రకాశించే స్వభావ మాయనది. ఆ ప్రకాశమే భర్గః - వరేణ్యమైనదా ప్రకాశం. శ్రేష్ఠమైనది. శ్రేష్ఠ మనే గాక వరణీయమే వరేణ్యమని కూడా అర్థం చెప్పవచ్చు. వరణీయమంటే కోరదగినది. మనమేది కోరుతాం. ఏది ఉత్తమమైనదో అదే. అన్నిటి కన్నా ఉత్తమోత్తమం సౌర తేజస్సు. అదే మనకు వెలుగునిస్తున్నది. జలమిస్తున్నది. అన్నం పెడుతున్నది. కనుక వరణీయమే అది. ఇలా ప్రశస్తమైనది గనుకనే ధియో యో నః ప్రచోదయాత్. అది లోపల ప్రవేశించిందో లేదో నః మన యొక్క ధియః పనికిమాలిన ఆలోచనల నన్నింటినీ ప్రచోదయాత్ కొట్టి పారేస్తుంది. అంతేగాదు. మంచి మార్గంలో మన బుద్ధులను ప్రచోదయాత్ నడుపుతుంది. నడపాలని కోరుకోవాలి కూడా మనం.

ఇది గాయత్త్రికి బాహార్థం. చెప్పాము గదా ఆధి భౌతిక మాధ్యాత్మిక మాధిదైవికం మూడు స్థాయిలున్నాయని. అందులో భౌతికంగా

సూర్యుడంటే మనపైన  ఆకాశంలో కనిపించే సూర్యమండలమే. ఆ ప్రకాశమే మనకు తేజోబన్నాలను ప్రసాదించి మన జీవిత యాత్ర నడుపుతున్నది. జగద్బాంధవుడు జగచ్చక్షువూ అయిన ఆ సౌర తేజస్సుకే మనమంతా ఋణపడి  ఉన్నాము కాబట్టి దానినే ధ్యానించి దాని వెలుగులో సత్కర్మలన్నీ ఆచరించి జీవితం సార్ధకం చేసుకోవాలి. ఇతి భౌతికమైతే ఆధ్యాత్మికమైన స్థాయి మరొకటున్నది. అక్కడ  సూర్యుడంటే మండలం కాదు. మానవుడి బుద్ధి. మన బుద్ధే సూర్యుడు. అందులో నుంచి  ప్రసరించే కిరణాలు మన ఆలోచనలు. కాని అవన్నీ వరేణ్యం కావు.  వరణీయమంత కన్నా కావు.  చాలావర కసుర భావాలే ఏర్పడుతుంటాయి మనసులో. అందులో దైవ సంపదకు చెందిన సాత్త్విక భావాలేవో అవే అలవరుచుకోవాలి మనం. అదే వరణీయం. అలాటి సాత్త్విక భావంతో మనసు నిండిపోతే ఆసురమైన భావాలే వున్నాయో వాటినీ  దైవ సంపదే ధియో యోనః ప్రచోద యాత్. బయటికి త్రోసి  పారేయగలదు. అలా భావన చేయాలి సాధకుడు. చీకటి పొరలను వెలుతురు  త్రోసి వేసినట్టు అసద్భావాలను సద్భావన  త్రోసి వేస్తున్నట్టు భావించటమే ఆధ్యాత్మికమైన అర్థం.

పోతే ఇవి రెండూ గాక మరొక మూడవ భూమిక ఉన్నదది ఆధి దైవికం. అందులో సవిత అంటే  సూర్యుడూ కాదు. బుద్ధీ కాదు. వాటి రెండింటికీ అతీతమై రెండింటినీ వ్యాపించిన ఆత్మ తత్త్వం. తత్తనే మాట కదీ  అసలైన  అర్థం. అదే సవిత – ప్రసవిస్తుంటుంది. ఏమిటి నామరూప

క్రియాత్మకంగా పరచుకొని కనిపించే ఈ చరా చర పదార్థాలన్నింటినీ. దేవస్య అలా ప్రసవించే దివ్యమైన శక్తి ఉంది దానికి సహజంగానే. అదే ధియోనః మన బుద్ధులలో ప్రవేశించి వీటిని కూడా ప్రచోదయాత్. ముందుకు నడుపుతున్నది. అయితే సదసచ్ఛ్వాహ మర్జున అని ఆయనగారే చెప్పినట్టు అవి మంచి ఆలోచనలైనా కావచ్చు. చెడ్డవైనా కావచ్చు. వివేచన లేకపోతే అసద్భావాలే చోటు చేసుకొంటాయి. ప్రాపంచికమైన వృత్తులన్నీ అలాంటివే. విక్షేపానికే దారి తీసి సంసారాభి ముఖంగా నడుపుతాయవి. అలా కాక పారమార్థికంగా పయనించాలంటే పరమాత్మ సంబంధి అయిన ఆలోచనే పెట్టుకోవాలి మనం. అదే వరణ్యం భర్గః కోరదగినది. దానికే బ్రహ్మాకార వృత్తి అని పేరు. జీవ జగదీశ్వర భేదం చూడక మూడూ కలిసి కేవలం సచ్చిద్రూపమైన ఆత్మ తత్త్వమేనని చూచే చూపది. అసతో మా సద్గమయ అన్నట్టు అదే ఈ ప్రాపంచిక భావాలన్నింటినీ త్రోసి పుచ్చి పరమాత్మ వైపు ప్రచోదయాత్ నడుపుతూ పోతుంది మానవుడి బుద్ధిని. జీవిత గమ్యమైన కైవల్యమేదో అది చివరకు అందజేస్తుంది. సందేహం లేదు. ఇది ఆధి దైవికంగా ఈ మంత్రానికి మనం చెప్పుకోవలసిన అంతరార్థం. ఇదే అసలైన మంత్రార్థమని నిర్ణయించటాని కెంతో దూరం పోనక్కర లేదు. పరమాత్మా స్వరూపం సాయుజ్యే వినియోగః అని గాయత్రి అంటే ఏమిటో దాని ప్రయోజన మేమిటో వాచ్యం గానే చెప్పాడు మహర్షి.

పరమాత్మే దాని స్వరూపమట. జీవ బ్రహ్మైక్యమే దాని ప్రయోజనమట. ఇంతకన్నా ఏమి కావాలి మనకు ప్రమాణం. ఏ మంత్రానికీ చెప్పలేదివి రెండూ. ఒక్క గాయత్రికే చెప్పారు. కనుకనే న గాయత్ర్యాః పరో మంత్రో నమాతుః పర దైవతమని వాక్రుచ్చారు పెద్దలు.

ఇదుగో గాయత్రీ ముఖమూ గాయత్రీ గర్భమే గాక గాయత్రి శిరస్సు కూడా ఇప్పుడీ పరమార్థాన్నే మనకు వెల్లడిస్తున్నది. గాయత్రి మంత్రమైతే దానికి పూర్వ రంగం భూర్భువ స్సువరాది వ్యాహృతులు. అది దాని ముఖం – పోతే తత్సవితు ర్వరేణ్యమని పేర్కొన్నది దాని గర్భం. ఇక మూడవది దాని శిరస్సు. అదే ఇప్పుడు చెప్పబోతున్నాడు మహర్షి. ఏమిటది. ఓ మాపో జ్యోతీ రసో మృతం బ్రహ్మ – భూర్భువస్సువ రోమ్. ఇది మంత్ర జపం ద్వారా సాధకుడైన వాడు ఆ బ్రహ్మైక్యమనే ఫలాన్ని సాధించే మార్గమేదో దాన్ని సూచిస్తుంది. ఆపః అంటే పంచభూతాలు. అంటే పాంచభౌతికమైన తత్త్వమే మన శరీరంగా మారి కనిపిస్తున్నది గనుక ఈ శరీరమే ఆపస్. పోతే ఇందులో ఉన్న జ్యోతి మనస్సు. అదే మనలో స్ఫురించే పదార్థం. అందులో నిశ్చయాత్మకమైన బుద్ధితత్త్వ మేదుందో అదే రసః దాని సారం. ఈ బుద్ధి కతీతమైన సమష్టి బుద్ధి Cosmic mind ఏదో అది అమృతం. అమృత మంటే మారని తత్త్వం. మన వ్యష్టి బుద్ధులు మారినట్టు విశ్వబుద్ధి మారిపోదు గనుక దాన్ని అమృతమన్నారు. మాయాశక్తి

అని అర్థం. దానికి కూడా అతీతమైన తత్త్వమొకటి ఉన్నది. అవ్యక్తాత్పురుషః పరః అన్నారు. ఏదో గాదది. పరిపూర్ణమైన బ్రహ్మ చైతన్యం.

చూచారా. మరలా పైకి తీసుకెళ్లుతున్నది గాయత్రి మనలను. మనసు దగ్గరి నుంచి నీవు ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేస్తూ పోతే నిన్ను ఆ బ్రహ్మ తత్త్వాన్నే చేరుస్తానని మనకు హామీ ఇస్తున్నది. ఆ హామీయే భూర్భువస్సువరోమని మళ్లీ పలకటం. ఈ మూడు వ్యాహృతులూ ఇంతకు ముందూ వచ్చాయి. ఇప్పుడూ వస్తున్నాయి. అప్పుడవ రోహణ క్రమంలో చెప్పాము వీటి కర్థం. ఇప్పుడారోహణ క్రమంలో చెప్పుకోవలసి ఉంది. ఎందుకంటే అది ఆ దివ్య చైతన్యం సంసారాభి ముఖంగా క్రిందికి చేసిన ప్రయాణమైతే ఇప్పుడిది సాయుజ్యాభి ముఖంగా సాధకుడు పైకి చేయవలసినది. ఎలాగ. భూర్భువస్సువః అంటే తేజోబన్న తత్త్వాలని పేర్కొన్నాము. భూః అంటే అన్నమిక్కడ. అన్నమెందుకు భుజిస్తున్నాం. భువః మనస్సు పని చేయటానికి ఆలోచనలు రావటానికి. ఆలోచనల వరకైతే అది ప్రాపంచికంగా వెళ్లిపోవచ్చు. కాబట్టి సువః తేజోరూపమైన వృత్తి ఏదో దాన్ని పట్టుకో. వరేణ్యం భర్గః అది బ్రహ్మాకారమైన వృత్తి. అది క్రమంగా నీ మనస్సును మహర్జన స్తపస్సులనే మూడు భూమికలనూ దాటించి చివరకు సత్య స్వరూపమైన పరమాత్మతో నీకు సాయుజ్యాన్ని ప్రసాదిస్తుంది. ఓం కారంతో ప్రారంభమయి గాయత్రి ఇప్పుడోంకారంతో

సమాప్తమయింది. శబ్దాతీతమైన బ్రహ్మతత్త్వం శబ్ద రూపంగా దిగి వచ్చి మరలా శబ్దాతీతమైన తన స్వరూపానుభవాన్ని శబ్దం ద్వారా మనకు ప్రసాదిస్తున్నదని దీని తాత్పర్యం. ఇంత దూరం దీన్ని భావన చేస్తూ ధ్యానం చేయాలి గాయత్రీ మంత్రాధి దేవతను సాధకుడైన వాడు.

ధ్యానం చేయమన్నారు మంచిదే. అసలు ఏ ధ్యానమైనా ఇలాగే చేయాలని ఒక వేదమంత్రం కూడా చెబుతున్నది మనకు. దానికీ దీనికీ చాలా గొప్ప పోలిక కూడా ఉన్నది. అసలదే ఇదీ ఇదే అదీ అని చెప్పినా చెప్పవచ్చు. అదేమిటంటే -

**అగ్నిర్మే వాచి శ్రితః**

**వాగ్ హృదయే**

**హృదయం మయి**

**అహ మమృతే**

**అమృతం బ్రహ్మణి**

అగ్ని అనేది పంచభూతాలకూ భౌతికమైన పదార్థాలకూ సంకేతం - అలాగే వాక్కనేది ఇంద్రియాలన్నిటికీ ఉపలక్షణం Representative పాంచ భౌతికమైన విషయ ప్రపంచమంతా మన ఇంద్రియ వ్యాపారాలలో చేరిపోయినట్టు భావన చేయాలి. ఈ ఇంద్రియ వ్యాపారాలన్నీ హృదయే - మనో వ్యాపారంగా మారాలి. హృదయం మయి. అది మరలా

అహంకారంలో చేరిపోవాలి. ఆ అహంకారం అమృతే. పారమేశ్వరమైన మాయాశక్తిలో చేరిపోవాలి. అది చివరకు బ్రహ్మణి. బ్రహ్మాకారంగా నిలిచిపోవాలని భావన. అమృతం బ్రహ్మ అనే రెండు మాటలూ గమనించండి. ఇవి ఇంతకు ముందు చెప్పిన అమృతం బ్రహ్మ అనే రెండింటికీ సరిపోతున్నాయి.

బ్రహ్మ మంటే పరమాత్మ. అమృత మంటే తదీయమైన మాయాశక్తి అని గదా పేర్కొన్నాము. బ్రహ్మం లాగానే ఆయన శక్తి కూడా అమృతమే. మృతం కానిది. అంటే ఎప్పటికీ నిలిచి ఉండేదని అర్థం - ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ అని గదా గీతా వాక్యం. అయితే ఒక సూక్ష్మముంది ఇందులో. అవరోహణ క్రమంలో అది అవిద్యారూపిణి అయి మనలనీ సంసార కూపంలోకి నెట్టి పారేస్తుంది. కాబట్టి ప్రపంచాకార వృత్తి రూపంగా అది అమృతం. అదే మరలా మనం సాధకులమై ఆరోహణ క్రమంలో ముందుకు సాగిపోయే కొద్దీ విద్యారూపిణి అయిన మనకా బ్రహ్మ సాయుజ్యాన్నే ప్రసాదిస్తుంది. కాబట్టి అప్పుడూ అమృతమే అది. అవిద్యా వంతులైన మానవులెప్పుడూ ఉంటారు గనుక వారి పట్ల అమృతమే - మనుష్యాణాం సహస్రేషు అన్నట్టు ఎవడో ఒకడైనా సాధకుడుంటాడు గనుక వాడి పట్ల కూడా అమృతమే. వారి కవిద్యా రూపంగా వీడికి విద్యా రూపంగా నని అర్థం చేసుకోవాలి మనం. ఇంతకూ బ్రహ్మమెలా అమృతమో బ్రహ్మాకార

వృత్తి కూడా అమృతమే. వేద్యమూ అమృతమే. విద్యా అమృతమే. ఎప్పటికీ మార్పు లేదు దానికి. కూటస్థం.

పోతే ఇలాంటి కూటస్థమైన బ్రహ్మ తత్త్వాన్ని అందుకోవాలంటే సామాన్యం కాదు. దానికెంతో చిత్తశుద్ధి ఉండాలి. చిత్తమే గదా సాధన మటు ధర్మానికి గానీ ఇటు మోక్షానికి గానీ. అందుకే మన ఏవ మనుష్యాణా మనే మాట వచ్చింది. బ్రహ్మం శుద్ధమైనప్పుడు దాని నందుకొనే మనస్సూ శుద్ధి కావలసిందే గదా. పోతే చిత్తశుద్ధి సత్త్వ శుద్ధిని బట్టి ఏర్పడుతుంది. అంటే రజస్తమో గుణాలను దూరం చేసుకోవాలది. తమస్సు ఆవరణానికీ రజస్సు విక్షేపానికీ దారి తీస్తాయి. అప్పుడు సాధకుడికి నిర్మలత్వమూ ఏకాగ్రతా దెబ్బతింటాయి. అది గమ్యం చేరటానికి ప్రతిబంధకం. కనుక మనసు శుద్ధమూ ఏకాగ్రమూ కావాలంటే దానికి దేశకాల పాత్రలు పరిశుద్ధంగా మారిపోవాలి. మనమెప్పుడే పనిచేసినా ఎక్కడో ఒకచోట ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక రూపంలో ఉండి ఆ పని చేస్తుంటాము. ఎక్కడో ఒకచోట అంటే అది దేశం. ఎప్పుడో ఒకప్పుడంటే కాలం. ఏదో ఒక రూపమంటే పాత్ర. దేశకాల పాత్రలనేవి నియామకాలు ప్రతి పనికీ. అవి ఎప్పుడే గాని పరిశుద్ధంగా ఉండాలా దేశకాల పాత్రలనేవి. అందుకే ముందు సంకల్పం చెప్పుకొంటాము మనం. వికల్పం లేకపోవటమే సంకల్పం. వికల్పమంటే మనసు చెదిరి పోవటం. అలా చెదురు మదురుగా

పోయేవన్నీ ఒకచోట సమకూర్చుకొంటే దానికి సంకల్పమని పేరు. అలా చెప్పుకోటంలో దేశకాల పాత్రలు మూడూ ఒకే ఒక గమ్యాని కభిముఖంగా ప్రసరించాలని తాత్పర్యం. ఏమిటా సంకల్పమంటే చెబుతున్నారు.

**పంచా శత్కోటి విస్తీర్ణ మహీ మండలే - లక్షయోజన**

**విస్తీర్ణ జంబూ ద్వీపే - భరత వర్షే - భరత ఖండే - మేరో**

**ర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఆగ్నేయ ప్రదేశే - కృష్ణా గోదా**

**వర్యో ర్మధ్యదేశే స్వగృహే - సమస్త దేవతా బ్రాహ్మణ**

**హరిహర సన్నిధౌ -**

ఇంతవరకూ ఇది దేశ సంకీర్తనం. దీని ద్వారా తాను కూచున్న ప్రదేశాన్ని పరిశుద్ధంగా భావిస్తున్నాడు సాధకుడు. యాభయి కోట్ల యోజనాల విస్తార ముందట ఈ భూమండలమంతా. ఇందులో లక్ష యోజనాలున్నదీ జంబూ ద్వీపం. సప్త ద్వీపాలలో ఇది ఒకటి. ఇప్పటి ఆసియా ఖండమిదే. ఇందులో కిం పురుషాది వర్షాలలో ఒకటి భరత వర్షం. అందులోనూ భరత ఖండం. మేరు పర్వతానికి దక్షిణంగా ఉందిది. శ్రీశైలాని కాగ్నేయం. పోతే కృష్ణా గోదావరీ నదుల మధ్యలో ఉంది మన నగరం. అందులో మన గృహం. ఇక్కడ మనముంటున్నాము. మనమంటే కేవలం మన బంధు మిత్రాదులే గాదు. సమస్త దేవతలూ – వారిని నిత్యమూ సేవించే బ్రహ్మ జ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణులూ – వీరి కధీశ్వరులైన హరిహరాది

దేవాది దేవులూ అందరూ సన్నిధి చేసి ఉన్నారు. అంటే ఏమని అర్థం. మనమున్న గృహం ఎంతో విశాలమైన భూమండలంలో ఒకానొక ప్రదేశంలో ఉన్నట్టు అక్కడ సమస్త దేవతా మూర్తులూ మనచుట్టూ ఉన్నట్టు భావన చేయాలి మనం. దానితో దేశం పవిత్రమవుతుంది.

పోతే ఇక కాలం. కాల సంకీర్తనం చేస్తున్నాడిప్పుడు.

**శ్రీ మహా విష్ణో రాజ్ఞయా ప్రవర్త మానస్య ఆద్య బ్రహ్మణో**

**ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే - వైవస్వత మన్వంతరే కలి**

**యుగే - ప్రథమ పాదే అస్మిన్ వర్తమాన వ్యావహారిక**

**చాంద్రమానేన - సంవత్సరే - అయనే - ఋతౌ - మాసే - పక్షే -**

**తిథౌ - వాసరే - నక్షత్రే యోగే - కరణే - ఏవం గుణ విశిష్టే**

**శుభే అభ్యుదయ ముహూర్తే -**

ఇది కాల సంకీర్తనం. ఇందులో ఒకటి రెండు మెళకువలు గమనించాలి అనుష్ఠాతలు. సంవత్సర అయన ఋతు మాస పక్ష తిథి నక్షత్ర యోగ కరణాలు సామాన్యంగా పేర్కొన్నాము మేము. అది చెప్పుకొనేటపడు అవి ఏయే సంవత్సరాయనాదులో విశేష రూపంగా పేర్కొంటూ పోవాలి. సర్వజి న్నామ సంవత్సరే ఉత్తరాయణే ఇలాగా చెబుతూ పోవాలి. పోతే మరొక హెచ్చరిక ఏమంటే ఏవం గుణ విశిష్టే అనే సందర్భంలో రెండు ఒప్పు. ఒకటి తప్పు. ఏవంగుణ విశిష్టే – ఏవం

విధ విశేషణ విశిష్టే - ఇవి రెండూ ఒప్పు. అలాకాక ఏవంగుణ విశేషణ విశిష్టే అన్నాడంటే అది తప్పు. ఎందుకంటే గుణమన్నా విశేషణ మన్నా రెండింటికీ ఒకటే అర్థం.

పోతే ఇక దీని అర్థం చెబుతున్నా. వినండి. మొట్టమొదట పరమాత్మ ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తున్నదీ కాల చక్రం. ఆయన జ్ఞానస్వరూపుడైతే ఇది క్రియా రూపిణి. అందులో సమష్టి ప్రాణంగా జ్ఞానంగా ఆవిర్భవించాడు బ్రహ్మదేవుడు. ఆది కర్తా సభూతనా మన్నారు. సృష్టి కంతటికీ ఆద్యుడాయన. హిరణ్య గర్భుడని కూడా అంటారాయనను. హిరణ్యం గర్భంలో ఉన్నవాడు. హిరణ్యమంటే చైతన్య ప్రకాశం. పోతే మనుష్యమానం గాక దేవమానం గాక బ్రహ్మమాన మని ఒకటున్నది. దాని ప్రకారం లెక్క గడితే ఆయనగారి ఆయుర్దాయం వంద సంవత్సరాలు. అందులో మొదటి 50 పూర్వపరార్థ మంటారు. అది గడచిపోయిందిప్పటికే. అదే బ్రహ్మ కల్పం. పద్మ కల్పం. కాగా మిగతా 50 ద్వితీయ పరార్థం. ఇది వరాహ కల్పం. శ్వేత వర్ణంతో ఉంటుంది. ఇదే నడుస్తున్నదిప్పు డాయనకు. మనువులలో వైవ స్వతుడనే రెండవ మనువు తాలూకు అంతరమిది Period.

ఆ మన్వంతరంలో కూడా యుగాలు. వాటిలో ఆఖరిది కలియుగం. అందులో ప్రథమ పాదం. ప్రథమమంటే నాలుగు పాదాలుండి అందులో

మొదటిదని చాలామంది అభిప్రాయం. కాని అది పొరబాటేమో అనిపిస్తుంది నాకు. పాదాలనేవి యుగాలకు కాదు. ధర్మానికి. ధర్మమనే దానినొక ధేనువుతో పోల్చారు. గోవుకు నాలుగు పాదాలున్నట్టే ధర్మానికీ నాలుగున్నాయి పాదాలు. అవేవో గావు. సత్య త పో దయా దానాలు. నాలుగు పాదాలతో నడిస్తే అది కృత యుగం. అందులో సత్యమనేది ఒకటి తక్కువై మూడింటితో నడిస్తే అది త్రేతా యుగం. త్రేతా అంటే అసలు మూడనే అర్థం. సత్యమూ తపస్సూ రెండూ కొరత పడితే ద్వాపర. ద్వా అంటే రెండనే అర్థం. దయా దానం రెండే ఉంటాయప్పుడు. అందులో కూడా దయ పోయి దానం మిగిలితే అది కలి. కలి అంటే కలహమని అర్థం. అన్నీ పోయి ఒక్కటే మిగిలితే కలహం కాక మరేముంది. అందుకే ప్రస్తుత మన్ని దేశాలూ పరస్పర కలహంతో కొట్టుకు చస్తున్నారు. సర్వ నాశన మవుతున్నారు. అదీ పోతే ఇక యుగాంతమే సందేహం లేదు. కాలమానాన్ని బట్టి చూచినా సరిపోతుంది ఈ విషయం. కనుక ప్రధమ పాదమంటే ఏకపాద మనే నా అభిప్రాయం.

పోతే ఇందులో వర్తమాన అంటే నడుస్తున్నది చాంద్రమానం. సౌర మానం చాంద్ర మానమని రెండున్నాయి. మానమంటే కొలత. సూర్యుణ్ణి బట్టి ఒకటి చంద్రుణ్ణి బట్టి ఒకటి. మనకు మామూలుగా చంద్రుణ్ణి బట్టి జరుగుతుంటుంది వ్యవహారం. దానిలో సంవత్సరం అయనం ఋతువు

మాసం పక్షం తిథి వారం అహస్సు ముహూర్తం నక్షత్ర యోగ కరణాలతో సహా పరిగణిస్తే కాలమక్కడికి ఆఖరు. ఇదంతా చెప్పుకొంటూ పోతే అది కాల సంకీర్తనం క్రిందికి వస్తుంది.

దేశ కాలాలు రెండూ అయిన తరువాత ఇక పాత్ర. వాటి లాగే ఇది కూడా శుద్ధి కావలసి ఉంది. పాత్ర అంటే ఏదో కాదు. మనమే. మనమే శుద్ధి అయితే పాత్రుల మవుతాము ఏ అనుష్ఠానానికైనా. అంటే యోగ్యత సంపాదిస్తామన్న మాట. ఏమిటది ఎలాగో చెబుతున్నారు. శ్రీమతః – శ్రీ అంటే ఐశ్వర్యం పారమేశ్వరమైన ఏ ఐశ్వర్యముందో అదే నాలో ఉందని భావించాలి. భారద్వాజ సగోత్రస్య – భరద్వాజాది మహర్షుల గోత్రంలో గదా జన్మించాము. మన పూర్వికులైన ఆ మహర్షుల నామం స్మరిస్తే వారి తపః ప్రభావం మనమీద పనిచేస్తుందని భావన. శ్రీనివాస శర్మాభిధానస్య – ఫలానా పేరు గలవాడనని ధర్మపత్నీ సమేతస్య – నా ధర్మమే నా పత్ని కూడా పాటించాలి కాబట్టి నేను ధర్మ మార్గం తప్ప గూడదని భావన. తప్పితే ధర్మకార్యాని కర్తృత లేదు. పోతే ఇంత చెప్పుకొన్న నాలో వ్యక్తిగతంగా కల్మషముంటే సరిపోదు. ఎన్నో పాపకార్యాలు చేసి ఉండవచ్చు నేను. తన్నిమిత్తంగా ఎంతో మాలిన్యం పేరుకొని ఉండవచ్చు. అది ప్రక్షాళితం కానంత వరకూ ప్రయోజనం లేదు. చేసే ధర్మకార్యం ఫలితమివ్వదు. కనుక మమో పాత్త నేను పోగు చేసుకొన్న దురిత – పాపకర్మలన్నీ క్షయ

ద్వారా – నశించి పోవాలంటే ప్రాత స్సంధ్యాంగ – ఈ ప్రాతర్మాధ్యాహ్ని కాది సంధ్యామ్ – దేవ తను ఉపాసిష్యే – ఉపాసన లేదా ధ్యానం చేస్తున్నా ననుకోవాలి. అది కూడా ఏదో కావాలని ఫలకామ నతో కాదు. పరమేశ్వర ప్రీత్యర్థం. సర్వ వ్యాపకమైన ఆ పరమాత్మ స్వరూపాన్నే దీని ద్వారా స్మరిస్తూ దాని ప్రీతి కోసమే ఇదంతా ననే నిష్కామ బుద్ధితో ఆచరించాలి. అలాగైతేనే పాత్ర కూడా శుద్ధి చెందుతుంది.

ఇక్కడికి దేశకాల పాత్రలు మూడింటికీ పరిశుద్ధి ఏర్పడింది. ఏర్పడిందంటే అవి వస్తుతః ఎప్పుడూ పరిశుద్ధమే – నిత్య శుద్ధం గదా పరమాత్మ. అదే గదా సమస్త దేశకాల వస్తువులనూ వ్యాపించిన తత్త్వం– కాబట్టి నీవను కొన్నా అనుకోక పోయినా వాటి పాటికవి పరమాత్మ స్వరూపమే కాబట్టి నిత్యమూ పరిశుద్ధమే. కాని త్రిగుణాల కధీనమై జీవిస్తున్న మన కలాటి చూపు లేదు కాబట్టి వస్తు సిద్ధమైనా అది మనకు బుద్ధి సిద్ధం కావటం లేదు. దాన్ని బుద్ధి సిద్ధం చేసుకోటానికే ప్రస్తుత మీ దేశకాలాది పవిత్రతా భావన లేదా సంకల్పం. ఇందులో ఇమిడి ఉన్న రహస్య మేమంటే వ్యష్టి ఎప్పుడూ వ్యష్టి మేరకే చూపు పెట్టుకొంటే తరించ లేదు. సమష్టి దృష్టితో బ్రతకాలెప్పుడూ. సమష్టి దృష్టి వ్యష్టి నంత కంతకూ సమష్టి స్థాయికి తీసుకెళ్లుతుంది. దానివల్ల పరిశుద్ధీ పరిపూర్ణతా ఏర్పడుతుంది మనస్సుకు. అది వాక్కు మీదా శరీరం మీద కూడా పని చేసి త్రికరణ

శుద్ధిగా సాగుతుంది మానవ జీవితం. కనుకనే పంచాశత్కోటి విస్తీర్ణమైన మహీ మండలం దగ్గరి నుంచి స్వగృహే అని మనం నివసించే గృహం వరకూ దేశ సంకీర్తనం చేయటం. అలాగే ఆద్య బ్రహ్మ కాలమానం దగ్గరి నుంచి మనమున్న ముహూర్తం వరకూ కాలాన్ని స్మరించటం. అలాగే ఈశ్వర శక్తి దగ్గరి నుంచీ వంశ ఋషుల దగ్గరి నుంచీ మన వరకూ పాత్ర సంకీర్తన చేయటం. ఇలా సమష్టి భావనతో వ్యష్టి వరకూ ప్రయాణం చేయట మెందుకంటే ఈ వ్యష్టి జీవితాన్ని ఆ సమష్టి తత్త్వం స్థాయి కెదిగించి దానితో ముడిపెట్టి పరిపూర్ణత నాపాదించటమే దీని ఆంతర్యం.

అయితే ఇక్కడ ఉపాసిష్యే అంటున్నాడు కాబట్టి ఇది ఉపాసనే గాని జ్ఞానం కాదు. జ్ఞానమైతే ఆ దేవత నీకన్యంగా కనపడదు. అప్పుడిక ఉపాధి ద్వారా దాన్ని పట్టుకొనే పని లేదు. ఇది ధ్యానం కాబట్టి జ్ఞాన మబ్బే వరకూ ఉపాధి ఉండి తీరుతుంది. నా శరీరమొక ఉపాధి నేను ధ్యానించే దేవతా మూర్తి ఒక ఉపాధి. ఇవి రెండూ ఉపాధు లయినప్పుడు ఆ దేవతా రూపాన్ని ధ్యానించి దాన్ని నీ మనస్సు అందు కోవాలంటే దాని నందించేది కూడా ఒక ఉపాధి అయి ఉండాలి గదా. అదేదో గాదు. ఈ భూత పంచకమే. అందులో కూడా వాయ్వాకాశాలు రెండూ అమూర్తాలు కాబట్టి మనసుకు రావు. నిలవవు. పృధివి స్థూలంగా మూర్తమై కనబడుతున్నా నానా రూపాలుగా కలుషితమయి ఉంది. పోతే ఇక మిగిలినవి రెండే.

ఒకటి తేజస్సు. మరొకటి జలం. ఇవి రెండూ వాయ్వాకాశాలలాగా అమూర్తం కావు. పృధివిలాగా కలుషితం కావు. చాలా పలచగా సున్నితంగా మృదువుగా కనిపిస్తాయి. అందుకే అగ్నికి పావకమనీ జలానికి తీర్థమనే పేరు వచ్చింది. రెండూ తాము పవిత్రమై మనలను పవిత్రం చేయగలవు. కనుకనే నిత్య నైమిత్తి కాదికమైన ఏ కర్మానుష్ఠానానికైనా ఇవి రెండే ఉపయోగ పడుతుంటాయి. జలంతోనూ అగ్నితోనే ఏ కర్మ అయినా. జలాన్ని మనం మన మీద ప్రోక్షణ చేసుకొంటే మనం పరిశుద్ధులమై పోతాము. అలాగే ఆ ఉపాధి Medium ద్వారా అభివ్యక్తమైన దేవత కూడా అలాగే మనకు కనిపిస్తుంది. అలాటి భావనతో మనమిప్పుడు జలంతో మనలను మార్జనం చేసుకోవాలి. మార్జన మంటే కడుగు కోటమని కల్మషాన్ని పోగొట్టు కోట మనీ అర్థం. అదే ఈ మంత్రం చెబుతున్నది మనకిప్పుడు.

**ఆపోహిష్ఠా మయో భువః - తాన ఊర్జే దధా తన -**

**మ హేరణాయ చక్షసే - యోవశ్శివత మోరసః -**

**తస్య భాజయ తేహ నః - ఉశతీ రివ మాతరః -**

**తస్మా అరం గమామవో - యస్య క్షయాయ జిన్వథ -**

**ఆపో జనయ థాచనః -**

ఏమిటీ మంత్రాని కర్థం. ఓ జలాధి దేవతలారా అని సంబోధన. అంటే జలమనే ఉపాధిలో అంతర్యామి రూపంగా ఉన్న ఏ పరాశక్తి

ఉందో దాని విశేషాలను సంబోధిస్తున్నాడు సాధకుడు. అమ్మా మీరే జల రూపంగా అవతరించి కనిపిస్తున్నారు. దేవతే భూతమయి కనిపిస్తుంటుంది. దేవత శక్తి – భూతం దాని బాహ్యమైన రూపం. ఈ రూపంలోనే మీరున్నారు. ఉండి మయోభువః – మాకు సుఖాన్ని ప్రసాదించండి. మిమ్ము మామీద ప్రోక్షణ చేసుకొంటున్నాము. చల్లుకొంటున్నాము. దీని ద్వారా మామీది కావాహన చేసుకొంటున్నాము. తా ఆపః – ఆ జలాధి దేవతలైన మీరు నః – మాకు ఊర్జే – ఆహారాన్నీ తద్వారా బలాన్నీ అనుగ్రహించండి. జలం వల్లనే పంటలు పండి మనకాహారం లభిస్తుంది. దానివల్ల శరీర మనోదార్ఢ్య మేర్పడు తున్నదని భావం.

ఈ దేహబలం గాని మనోబలం గాని దేనికి. ఏమిటి దాని ప్రయోజనం. కేవలం బ్రతకటానికేనా. బ్రతకటానికి తిండి తిండి కోసమే బ్రతకటమైతే – ఇక్కడి కిక్కడే సమసిపోతుంది మన జీవితం. జీవిత పరమార్థమందు కొనే అవకాశం లేదు. అంచేత దాన్ని పేర్కొంటున్నా రిప్పుడు మహర్షులు. మహేరణాయ చక్షసే. ఈ మార్జన మెందుకంటే మహత్తరమైన రమణీయమైన దర్శనం కోసమట. అన్నిటి కన్నా గొప్పది బ్రహ్మతత్త్వం. దానినే దర్శించి జన్మసార్థకం చేసుకోవా లెప్పటికైనా. అందుకే ఈ ఆహారమూ ఈ శరీర పోషణా మనకు. శరీర మాద్యంఖలు

ధర్మ సాధనమని గదా మాట. యో వశ్శివతమో రసః - తస్యభాజయత ఇహనః - కాబట్టి మీలో ఏశాశ్వతమైన మంగళప్రదమైన సారభూతమైన తత్త్వమున్నదో - అంటే జలంలో అంతర్లీనమై ఉన్న ఏ మహాశక్తి ఉన్నదో దానికి మమ్ము పాత్రులను చేయండి దయ ఉంచి, దాన్ని దర్శించే యోగ్యత మాకందివ్వండి.

ఎలా సాధ్యమది. మీకు మామీద ఎంతో వాత్సల్యముంటే గాని ఆ పని చేయలేరు. ఒకరికి మేలు చేయాలంటే వాడి మీద వల్ల మాలిన అభిమాన ముండాలి. అది కన్న తల్లి కంటే ఎక్కువగా ఎవరికీ ఉండదు లోకంలో. ఉశ తీరివ మాతరః - అభిమానించే తల్లులని అర్థం. జలమే తల్లి మానవులకు. ద్రవరూపమైన రేతః కణం నుంచే గదా జన్మించాము మనమంతా. మనలో ఉన్నది కూడా 90 వంతులు జలమే. కనుక ఆ జలదేవతలే మన తల్లులు. మాతృస్థానమదే నిజానికి. కనుక తల్లి తనయుడి బాగోగుల నెలా చూస్తుందో అలాగే చూడండి మా బాగోగులు మీరు. తస్మా అరం గ మామ వః - అలా చూచారంటే మేము వెంటనే మా మూలస్థానానికి మరలా వెళ్లటం సాధ్యమవుతుంది. ఎంత కాలమయిందో దానికి దూరమయి వచ్చి ఇందులో పడ్డాము. యస్య క్షయాయ జిన్వథ. దాని కోసమే గదా మీరు తిరిగీ మమ్ము చేర్చాలని కోరుతున్నారు. మీకు

ప్రీతి పాత్రమైన స్థానం కూడా అదే గదా. మేమేమిటి. మీరు కూడా మొదట అక్కడి నుంచే గదా వచ్చారు. కనుక మీకూ మాకూ అదే గమ్యం గనుక త్వరగా చేర్చండి మీరా గమ్యాన్ని మమ్మ. ఆపో జనయధా చనః - మాకు దాన్ని ప్రసాదించండి ఓ జల దేవతలారా.

ఇలాటి గొప్ప భావంతో ప్రోక్షణ చేసుకోవాలి జలం. అంతేగాని ఏదో యాంత్రికంగా చేస్తూ పోవటం కాదు. మనోభావనే ప్రధానం దేనికైనా. బాహ్యమైన క్రియ కాదు. క్రియ దాని కనుగుణంగా సాగితేనే ఫలితమిస్తుంది. యదేవ విద్యయా కరోతి తద్వీర్యవత్తరం భవతి అని గదా శాస్త్రం చాటుతున్నది. పోతే ఇలాంటి సంకల్పం పెట్టుకొని ఇక వందనం చేస్తున్నాడు సాధకుడు. అలా చేసే ముందు పవిత్రతను భావించాలి. ఒక గొప్ప భావం మనలోనికి ఆవాహన కావాలంటే మన పాత్ర బాగా శుద్ధమయి ఉండాలి. పాత్ర అంటే శరీరమే కాదు. వాక్కు కాదు. అసలైన పాత్ర మనస్సు. అది శుద్ధి చెందితే దానితో పాటు అన్నీ చెందినట్టే. ఈ శుద్ధి మూడు సంధ్యలలోనూ సాగుతూ పోతుంది. అందులో ప్రాత స్సంధ్యలో చెప్పుకొనే మంత్రమిది.

**సూర్యశ్చ మా మన్యుశ్చ మన్యుపతయశ్చ మన్యు**

**కృతేభ్యః పాపేభ్యో రక్షంతామ్ - యద్రాత్రియా**

**పాప మకార్షమ్ - మనసా వాచా హస్తాభ్యామ్ - పద్భ్యా -**

**ముదరేణ - శిశ్నా - రాత్రి స్తదవలుంపతు - యత్కించ**

**దురితం మయి - ఇద మహం మా మమృత యోనౌ సూర్యే**

**జ్యోతిషి జుహోమి స్వాహా -**

సూర్యశ్చ మన్యుశ్చ మన్యుపతయశ్చ– ముగ్గురు. ఇందులో సూర్యుడు ప్రత్యక్ష దైవతం. మనం చేసే కర్మలన్నిటికీ సాక్షి – జగత్తు కంతా చక్షుస్సు. కనిపెట్టి చూచే నేత్రం. పరమాత్మ తేజో రూపంగా అక్కడ అవతరించాడు. పోతే మన్యుశ్చ. మన్యువంటే కోపమని మన్యుపతి అంటే కోపానికధి దేవత అని అర్థం చెప్పవచ్చు. అది బాహ్యార్ధం. అంతరార్థ మేమంటే మన్యు శబ్దానికి మంత్రమని కూడా అర్థముంది. మూడర్థాలున్నాయి మన్యువనే మాటకు. మూడేమిటి. నాలుగున్నాయి ఆ మాటకు వస్తే. మన్యు అంటే కోపమని యజ్ఞమని మంత్రమని ఆలోచన అని కూడా అర్థాలే. శతమన్యు అంటే ఏమిటి. నూఱు యజ్ఞాలు చేశాడు కాబట్టి ఇంద్రుడికి శతమన్యు అని పేరు వచ్చింది. అభిమన్యు అంటే అభిమానించే వాడు – శరీరమే నేనని భావించేవాడు. భావన అని అర్థమక్కడ.

మన్యు అంటే ఇక్కడ మంత్రమని అర్థం. మను అంటే కూడా మంత్రమే. అప్పటికి మన్యు అంటే ఇక్కడ గాయత్రీ మంత్రం. సూర్యుడు

గాయత్త్రికి మూలస్థానం. ఆ తేజస్సదే. తత్సవితుర్వరేణ్యం భర్గః అంటే అర్థమదే గదా. కనుక సూర్యశ్చ అనటంలో ముందు సవితను స్మరించాడు. తరువాత సావిత్రిని స్మరిస్తున్నాడు మన్యశ్చ అని. సవిత నుంచి వచ్చిందే సావిత్రి. సావిత్రి గాయత్రే. ఇంతకూ మన్య అంటే గాయత్రీ మంత్రం. పోతే సూర్యుడయింది. సూర్యతేజస్సయిన గాయత్త్రి అయింది. పోతే మన్యపతయశ్చ. ఆ గాయత్రీ మంత్రాన్ని దర్శించిన మహర్షులు. మన్యపతులు. విశ్వామిత్రాదులు. పాతీతి పతిః – మంత్ర రహస్యాన్ని కాపాడే వారని భావం. అప్పటికే మయింది. ఈ మూడు మాటల్లో మంత్రంలో ఉండే మొదటి మూడు మాటలకూ అర్థం కలిసి వచ్చింది. సవితుః అనేది సూర్యుడికీ మన్యవనేది వరేణ్యం భర్గః అనే సూర్యతేజస్సుకూ – ధీమహి అనేది దాన్ని తమ దివ్య దృష్టితో దర్శించారని చెప్పే మహర్షుల బుద్ధి బలానికీ మూడింటికీ మూడూ సరిపోతున్నాయా లేదా.

కాగా ఇప్పుడు వీరందరినీ మనం స్మరించటం దేనికి. ఏమి చేయాలి వీరు మనకు. మన్య కృతేభ్యః పాపేభ్యః రక్షంతాం – నా పాపాల లోనుంచి నన్ను బయట పడేయాలని ప్రార్థన. ఎన్నో చేసి ఉంటాము పనికి రాని పనులు. ఎందుకు చేశా మవన్నీ. మన్యకృతేభ్యః – మన్యవంటే ఇక్కడ కోపమని అర్థం. రాగద్వేషాలనే ద్వంద్వాలు నాచేత ఎన్నెన్నో పాపకార్యాలు చేయించి ఉండవచ్చు. దానివల్ల ఎంతైనా మాలిన్యం నా

మనస్సులో పేరుకొని ఉండవచ్చు. అది అడ్డు తగులు తున్నంత వరకూ పరిశుద్ధికి నోచుకోలేను. ఏమిటీ కాలుష్య మెక్కడి నుంచి వచ్చింది. యద్రాత్రియా పాప మకార్షమ్. నేను రాత్రి కాలంలో చేసిన పాప మంటున్నాడు. ఇది ప్రాతః కాల సంధ్య గదా. అంచేత రాత్రి చేసిన పాపం. దేనితో చేశామా పాపం. మనసా వాచా హస్తాభ్యాం మనసుతో కావచ్చు. మాటతో కావచ్చు. చేతులతో కావచ్చు. పద్భ్యాం - కాళ్లతో కావచ్చు. ఉదరేణ శిశ్నా - ఆఖరుకు ఉదరంతో శిశినంతో దేనితోనైనా కావచ్చు. మొత్తం మీద మనకున్న అన్ని ఇంద్రియాలలో దేనితో చేసినా చేయవచ్చు పాపం. ఎప్పటికప్పుడు దాని ప్రభావం మనమీద పడకుండా మన దారి కడ్డు రాకుండా కడిగేసుకొంటుండాలి. త్రికరణ శుద్ధి ఏర్పడుతుందప్పుడు. అప్పుడే చేసే కర్మ పరిశుద్ధ మవుతుంది.

మరి వాటిని శుద్ధి చేయవలసిందెవరు. రాత్రి స్తదవ లుంపతు. ఏ రాత్రి చేశామో ఆ రాత్రే దాన్ని పోగొట్టాలని అర్థం. రాత్రంటే రాత్రి కాలమని గాదు. దానికా సామర్థ్యం లేదది జడం. పోతే రాత్రి కాలాన్ని అభిమానించే దేవత ఏదుందో అది శక్తి రూపిణి కాబట్టి దానికే ఉంది సామర్థ్యం పోగొట్టటానికి. రాత్రి అనే ఉపాధి ద్వారా పనిచేసే ఆ దివ్య శక్తి ఏదుందో అది పోగొట్టు గాక అని అర్థం. అంతే కాదు. యత్కించ దురితం మయి. ఏ కొంచెం నాలో పాప కర్మ మిగిలి ఉన్నా సరే. అది

కూడా నిశ్శేషమయి పోవాలట. ఎలాగా. ఇద మహం - ఇదుగో నేను మాం నన్ను. జుహోమి హోమం చేస్తాను. ఆహుతి చేస్తాను. నేను నన్ను ఆహుతి చేయటమేమిటి. చైతన్య రూపుడవైన నేను కర్తృరూపమైన నా అహంకారాన్ని అని అర్థం. అహంకారమే కర్త. ఆత్మ కాదు. కర్త గనుకనే అన్ని పాపాలూ అహంకారమే చేయిస్తున్నది. అంచేత దాన్ని ఆహుతి చేస్తే చాలు. తన్నిమిత్తంగా ఏర్పడే వన్నీ ఆహుతి అయిపోతాయి. ఎలా పోతుందది. జుహోమి అగ్నిలో హోమం చేస్తే పోతుంది. ఏమిటా అగ్ని హోత్రం. ఎలా చేయాలి హోమం. అమృత యోనౌ సూర్యే జ్యోతిషి. సూర్యుడనే జ్యోతిలో తేజస్సులో చేయాలి. అదే హోమకుండం. ఎలాంటి దది. అమృత యోనౌ. అమృతం నుంచి ఉద్భవించింది. మృతం కానిది అమృతం. ఎప్పటికీ నిలిచి ఉండేది. ఏదది. భగవన్మాయా శక్తి. ఇంతకు ముందే వివరించా మీ విషయం అమృతం బ్రహ్మణి అనేచోట. అవ్యక్తమహ దహంకారాలని వరస. అవ్యక్తమన్నా అమృత మన్నా మాయా శక్తే. అది సమష్టి రూపమైన మహత్తుగా వ్యష్టి రూపమైన అహంకారంగా మారింది. ఈ అహమే అన్ని దుష్కృత్యాలకూ మూలం కాబట్టి లయ క్రమంలో దీన్ని మహత్తు లోనూ దాన్ని మరలా అవ్యక్తమైన శక్తిలోనూ లయం చేసుకొంటూ పోవాలి. అంటే అలా భావిస్తూ పోవాలి. అప్పుడా పాపం క్షాళితమై దాని ఫలితం మనల నంటదు. స్వాహా. సు ఆహా - బాగా ఆహుతై పోవాలని

అర్థం. అగ్ని దేవుడి భార్య పేరు స్వాహా దేవి. అంతా అగ్నిలో ఆహుతి చేస్తాము గనుక అది ఆయన కధీనమయి ఉంది గనుక ఆయన భార్యగా భావించారు పెద్దలు. అది ఒక సంకేతం.

ఇంతవరకూ ఇది పూర్వాహ్ణ సంధ్యా మంత్రమైతే ఇప్పుడు మాధ్యాహ్నిక మంత్రం చెబుతున్నారు.

**ఆపః పునంతు పృథివీం - పృథివీ పూతా పునాతు మామ్ -**

**పునంతు బ్రహ్మణ స్పతి - ర్బ్రహ్మా పూతా పునాతు మామ్ -**

**య దుచ్ఛిష్ట మభోజ్యం - యద్వా దుశ్చరితం మమ -**

**సర్వం పునంతు మామాపో ౭ సతాంచ ప్రతిగ్రహగ్ం - స్వాహా**

మనం చల్లే జలం మనమీదనే గాదు. మనం కూచున్న మన చుట్టూ ఉన్న పృథివి మీద కూడా పడుతుంటాయి జలకణాలు. కనుక పృథివి కూడా శుద్ధి అవుతుంటుంది. పృథివి తాను శుద్ధి అయి పృథివీ వికారమైన నా శరీరాన్ని మనస్సునూ కూడా పరిశుద్ధి చేయుగాక - ఆపః పునంతు పృథి వీం - పృథివీ పూతా పునాతు మా మ్మంటే అర్థమిదీ. అలాగే పునంతు బ్రహ్మణ స్పతిః - నాకు బ్రహ్మోపదేశం చేసిన ఏ సద్గురు వున్నాడో ఆయన కూడా నన్ను పవిత్రుణ్ణి చేయుగాక. తాను బొట్టు పెట్టుకొని మరొకరికి బొట్టు పెట్టినట్టు ఒకరి నొకరు పవిత్రులను చేసుకొంటే ద్విగుణీకృత మవుతుంది పారిశుధ్యం. అదే అంతర్బహి శ్శౌచం. లోపలా వెలపలా శుచిత్వమే. అప్పుడే పరిపూర్ణమైన శౌచం మానవుడికి.

యదుచ్ఛిష్ట మభోజ్యం - మధ్యాహ్న మంత్రం గదా ఇది. ఆపాటికి భోజనం చేసి ఉండవచ్చు. ప్రాతఃకాలంలో భోజనం లేదు. సాయంకాలంలో మధ్యాహ్న భోజన మెలాగూ జీర్ణమయి ఉంటుంది. ఆ రెండు సంధ్యలలో లోపల ఏ పదార్థమూ ఉండదు. మాధ్యాహ్నిక సంధ్యలో ఏదో కొంత ఆహారం శరీరంలో ఉంటుంది. అందులో యదుచ్ఛిష్టం అభోజ్యం. ఏది భుజించ గూడదో అదీ - అలాగే ఏది పనికిరానిదో అదీ భుజించి ఉంటే. యద్వా దుశ్చరితం మమ - ఏవైనా చెడ్డ పనులు చేసి ఉంటే. సర్వం పునంతు మా మాపః - అదంతా ఈ ప్రోక్షణ చేసుకొంటున్న జలం నన్నూ దాన్నీ పరిశుద్ధం చేయుగాక. అసతాం చ ప్రతి గ్రహగ్ం స్వాహా. అలాగే అపాత్రులూ అయోగ్యులైన వారి వద్ద ఏదైనా స్వీకరించి ఉండవచ్చు నేను. ఎక్కడైనా దానం పట్టి ఉండవచ్చు. దానం పట్టేటపు డిచ్చే వాడు పాత్రుడై ఉండాలి. అది పుచ్చుకొనే వాడూ పాత్రుడయి ఉండాలి. అలా కాక అసత్ప్రతి గ్రహం చేసి ఉన్నట్టయితే దానివల్ల సంక్రమించిన మాలిన్యం కూడా తొలగి పోవుగాక. ఇక్కడ అసత్ప్రతి గ్రహమంటే అయోగ్యుల వల్ల దానం పుచ్చుకోటమే గాక అసద్గుణాలను గట్టిగా పట్టుకొని కూచోటమని కూడా అర్థం చెప్పుకోవచ్చు. మొత్తం మీద ఏదైనా హేయమే. ఉపాదేయం కాదు. హేయమైన అసుర గుణాల నన్నింటినీ తొలగించుకొని దైవ గుణాలను భావిస్తూ వాటినే మనసులోకి చేర్చుకోవాలని స్వాహా అనే మాట కర్థం.

పోతే ఇక సాయం సంధ్యా మంత్రం. ఇది ప్రాతస్సంధ్యా మంత్రం లాంటిదే. అదీ ఇదీ చాలావరకూ ఒకటే. కొంచెమే తేడా. అక్కడ సూర్యశ్చ అనే దాని బదులిక్కడ అగ్నిశ్చ అని పేర్కొంటే చాలు. ఎందుకంటే పగలంతా సూర్యుడు ప్రకాశిస్తుంటాడు. రాత్రి కాలం కనపడడు. ఉంటాడు గాని మరుగు పడి ఉంటాడు. అప్పుడు మనకు కనపడే సూర్యుడు అగ్ని. దినాంతే నిహితం తేజ స్సవిత్రేవ హు తాశనః అని మాట. సాయం కాలం సూర్యుడు తన తేజస్సు నగ్నిలో నిక్షిప్తం చేసి తాను అస్తమిస్తాడు. నా వంతయింది ఇక నీవే ఈ లోకానికి వెలుగు నివ్వమన్నట్టు. అవే మనం వెలిగించే దీపాలు. విద్యుద్దీపాలు వగైరా. అవన్నీ అగ్ని రూపాలే. అది సౌర ప్రకాశ రూపాంతరమే.

**అగ్నిశ్చ మా మన్యుశ్చ మన్యుపతయశ్చ - మన్యుకృతేభ్యః**

**పాపేభ్యో రక్షంతామ్ - యదహ్నా పాపమకార్షమ్**

**అహస్తదవలుంపతు -**

మనో వాగాదులైన ఇంద్రియాలతో అక్కడ రాత్రి కాలం చేసిన పాపకర్మలైతే ఇక్కడ అహః కాలంలో చేసినవి. అక్కడ రాత్ర్యధి దేవత వాటిని పోగొట్టాలని భావిస్తే ఇక్కడ అహరభిమాని దేవత పోగొట్టాలని భావన.

**సత్యే జ్యోతిషి జుహోమి స్వాహా.**

చివర కక్కడ సూర్యుని తేజస్సులో వాటి నాహుతి చేయటమైతే ఇక్కడ సత్యమైన తేజస్సులో. సత్యమైన జ్యోతిస్సేమిటి. ఆ మాటకు వస్తే అగ్ని ఏమిటి. సూర్యుడేమిటి. జలమేమిటి. పృధివి ఏమిటి. అన్నీ సత్యమే. ఎందుకంటే పరమాత్మ తాలూకు ఉపాధులివన్నీ. పరమాత్మ సత్యమైనప్పు డాయన ఉపాధులూ సత్యమే. సత్యమైన పరతత్త్వమే ఇలా ఇన్ని రూపాలలో మనకు భాసిస్తున్నది. కనుక భౌతికమైన ఈ సత్యం ద్వారానే అభౌతికమైన ఆ సత్యాన్ని అందుకోవాలి మనం. కేవలం భౌతికంగా భావిస్తే అడ్డు తగులుతాయివి మనకు. వీటినే అభౌతికంగా భావిస్తే సహాయపడుతాయి. ఇదీ ఇందులో దాగి ఉన్న సత్యం.

ఇవన్నీ చెప్పుకొన్న తరువాత మూడు సంధ్యలలోనూ మరలా దర్భలతో మార్జనం చేసుకొని ఈ క్రింది మంత్రం పఠించ వలసి ఉంటుంది.

**దధి క్రావ్ణో అకారిషమ్ - జిష్ణో రశ్వస్య వాజినః -**

**సురభినో ముఖాకరత్ - ప్రణ ఆయూగ్ంషి తారిషత్ -**

ఆపోహిష్ఠాః అనే మంత్ర మింతకు ముందు చెప్పుకొన్నాము. దాని కర్థం కూడా చెప్పుకొన్నాము. పోతే దానికి ముందొక నాలుగు వాక్యాలు చేరి మరలా ఆ మంత్రమే ఆవృత్తి అవుతున్నది. కాబట్టి వీటికి మాత్ర మర్థం చెబితే చాలు. దధి క్రావ్ణః - దధి అంటే పెరుగు. ఆహారానికి ఉపలక్షణమీ మాట. క్రావా అంటే దాని వల్ల కలిగే బలం. క్రావ్ణః అలాటి

బలవంతుడూ జిష్ణోః జయశాలి అయినవాడూ అశ్వస్య వాజినః సర్వత్రా వ్యాపించే వేగవంతుడూ అయిన ఆ పరమాత్మకు నేను వందనం చేస్తే సురభినో ముఖాకరత్ – అది మా ముఖాలను సువాసనా భరితం చేయు గాక. వాక్శుద్ధి కలిగించు గాక. ముఖంతో ఏది ఉచ్చరించినా అది పవిత్రంగా పరిశుద్ధంగా ఉండాలని భావం. అంతే కాదు. ప్రణ ఆయూగ్ంషి తారిషత్. నః మా యొక్క ఆయూంషి – ఆయుస్సులను ప్రతారిషత్ – పొడిగించాలి కూడా. అంటే దీర్ఘ కాలం జీవించాలని కోరిక. శరీర మాద్యంఖలు ధర్మ సాధన మన్నారు. శరీరమనే ఉపాధి బ్రతికి ఉంటేనే ఏ సత్కర్మ అయినా చేయగలం. సత్కర్మ ఆచరిస్తే గాని సత్ఫలిత మాసించ లేము. అందుకోసమే నూరేండ్లూ బ్రతకాలని కోరుకోవాలి మానవుడు. ఇది తరువాత రాబోతుంది జీవేమ శరదశ్శతమని. అక్కడ ఇంకా విపులంగా చెప్పుకోవచ్చు.

ఇంతకూ ఆదధి క్రావా ఆ జిష్ణు ఆ అశ్వ వాజి ఎవరని ప్రశ్న. ఎవరో కాదు. అహమన్న మహ మన్నాద అన్నట్టు ఈ చరాచర ప్రపంచాన్నంతా ఆహారంగా తీసుకొని అనేజదేకం మనసో జ వీయః అన్నట్టు మనసు కంటే వేగంగా భూన భోంతరాలన్నీ వ్యాపించిన ఏ అఖండ జ్ఞాన శక్తి ఉన్నదో అది. ఆ పరమాత్మ తత్త్వం. అదే సుగంధిం పుష్టి వర్ధనం. మా మనోవాక్కాయాలను సురభిళం చేయాలని దానినే ధ్యానిస్తున్నాము. దానికీ జలమనేది ఒక ఆలంబనం మాకు. దీని ద్వారా దానినందు కోవాలని మా

ఆకాంక్ష అంటారు మహర్షులు. అలాటి ఆకాంక్షే సాధకులమైన మనకూ ఉండాలి. మనకా ఆకాంక్ష రేకెత్తించటానికే పర్జన్య రూపం ధరించి సాక్షాత్తూ ఆ పరమాత్మ జలరూపంగా దివి నుంచి భువి దాకా అవతరిస్తున్నాడు. ఎలాగంటే వర్ణిస్తున్నదీ మంత్రం.

**హిరణ్యవర్ణా శ్శుచయః పావకా - యాసుజాతః కశ్యపో - యా స్వింద్రః అగ్నిమ్ యాగర్భం దధిరే - విరూపాస్తా న ఆపః శగ్ం స్యోనా భవంతు - యాసాగ్ం రాజా వరుణోయాతి మధ్యే సత్యానృతే అవపశ్యన్ జనానాం - మధు శ్చ్యుత శ్శుచయో యాః పావకా స్తాన ఆపశ్శగ్ం స్యోనా భవంతు - యాసాం దేవా దివి కృణ్వంతి భక్షం - యా అంతరిక్షే బహుథా భవంతి - యాః పృథివీం పయ సోందంతి - శుక్రాస్తాన ఆపశ్శగ్ంస్యోనా భవంతు - శివేన మా చక్షుషా పశ్యతాపః శివయాతను వోప స్పృశత త్వచం మే - సర్వాగ్ం అగ్నీగ్ం - రప్సుషదో - హువే వో - మయివర్చో బలమోజో నిధత్త - ద్రుపదా దివముంచతు - ద్రుపదా దివో న్ముముచానః - స్విన్నః స్నాత్వీ మలాదివ పూతం పవిత్రేణే వాజ్యం - ఆపశ్శుంధంతు మైనసః -**

ఇదీ మంత్రం. ఆపోహి – ఓ జలాధి దేవతలారా – అని సంబోధన. హిరణ్యవర్ణాః – శుచయః – పావకాః – బంగారం లాంటి తేజస్సు మీది.

తేజస్సు నుంచే జన్మించారు మీరు. తేజో బన్నాత్మకం గదా సృష్టి. శుచయః అందుకే పరిశుద్ధులు మీరు. పావకాః – మీరే గాక మిమ్మాశ్రయించిన మమ్ములను కూడా పవిత్రులను చేయగలరు. పాపక శబ్దం చూచారా అగ్నికే గాక జలానికి కూడా వర్తిస్తున్నది. అగ్ని జలమూ ఇవి రెండే పావనమైనవి పావనం చేసేవి అని ఇంతకు ముందే పేర్కొన్నాము. దానికి తగినట్టే ఉన్నదీ ప్రయోగం. యాసు జాతః – ఏ జలాల్లో నుంచి జన్మించాడో. ఎవడు. కశ్యపః – కశ్యపుడనే ప్రజాపతి. ఎలా అర్థం చేసుకోవాలిది. కశ్యప అంటే పశ్యక. వర్ణ వ్యత్యయ మేర్పడి కశ్యప అయింది. అన్నిటినీ చూచేవాడని అర్థం. అటు సూర్యుడు చూస్తున్నాడు. ఇటు మానవుడి బుద్ధీ చూస్తున్నది. సూర్యుడంటే బుద్ధికి సంకేతం. ఆధిదైవిక మొకటి ఆధ్యాత్మిక మొకటి. ఇవి రెండూ పంచభూతాల కలయిక వల్ల ఏర్పడ్డ పాధులే. యాసుజాతః అంటే అదీ అర్థం.

పోతే యాస్వింద్రః – ఇదం ద్ర – ఇది చూసేదేదో అది ఇదంద్ర. ఇదం ద్రే ఇంద్ర. ఇది అంటే శరీరం. దీన్ని చూడటమంటే ఈ శరీరాన్ని అంటి పెట్టుకొని ఉన్న జీవుడు. వాడు సమష్టి రూపుడైనా కావచ్చు. వ్యష్టి రూపుడైనా కావచ్చు. వీడూ పాంచభౌతికమైన ఉపాధితో కలిసి ఏకమైన వాడే. అగ్నిం యా గర్భం దధిరే. అగ్ని అంటే ప్రాణం. దాన్ని గర్భంలో ధరించి ఉన్నాయి. ఏమిటి. ఆపః – జలం. ఒక్క జలమనే కాదు.

పంచభూతాలకు జలమొక ఉపలక్షణం Representative. ఆపః అని అందుకే అన్నారు. వ్యాపించే వని అర్థమసలు. అప్పటికేమయింది. మనసూ ప్రాణమూ జీవుడూ మూడు వచ్చాయిప్పుడు. ఇందులో జీవుడు ప్రధానుడు. వాడికి మనః ప్రాణాలు రెండూ ఉపాధులు. ఇవి రెండూ దగ్గర పెట్టుకొన్న జీవుడనైన నేను కూడా మీలో నుంచే వచ్చానండీ అని మొరపెడుతున్నాడు సాధకుడు. విరూపాః – మీరే వివిధ రూపాలలో అంటే తేజోబన్న రూపాలుగా ప్రసరిస్తున్నారు. కాబట్టి తాన ఆపః శగ్ం స్యోనా భవంతు – అలాంటి వ్యాపన శీలురైన మీరు మాకు నిత్యమూ సుఖాన్ని వర్షించండి. ప్రసాదించండి. మాకు సుఖపరమైన దేదో దాన్ని చూపండి. మీలో నుంచే గదా మేము వచ్చాము మీరే మాకు ఆలంబనం.

యాసాగ్ం రాజా వరుణః జలానికధి దేవత వరుణుడు. వరుణ అంటే అసలు వర్షించే స్వభావమున్న వాడని అక్షరార్థం. తేజస్సు కధి పతి సూర్యుడైతే జలానికి వరుణుడైతే పృధ్వికి అగ్ని. వీరు ముగ్గురి చుట్టే తిరుగుతుంటుంది సంధ్యా వందన మంత్ర మెప్పుడూ కూడా. వసు రుద్రాదిత్యులు వీరే. వసువు పృధ్వికి – రుద్రుడంత రిక్షానికి – ఆదిత్యుడు ఆకాశానికి. ఛాందోగ్యం వీటినే తేజోబన్నాలని వర్ణించింది. ఇవి మూడూ మనకు కనిపించే ప్రత్యక్ష దైవతాలు. మధ్యే యాతి వరుణః అందుకే మధ్యలో అంటే అంతరిక్షంలో వెళ్లిపోతున్నాడట వరుణుడు. ఏమి చేస్తూ

వెళ్లుతున్నాడు. సత్యానృతే అవ పశ్యన్ జనానాం. మానవులు వారు వారు చేసే మంచి చెడ్డలను గమనిస్తూ. మనమిచ్చే జలాన్ని ఆహారాన్ని ఉపయోగించుకొని ఈ ప్రాణులు సత్కర్మలాచరిస్తున్నారా లేక దుష్కర్మలు చేస్తున్నారా అని సమీక్షణమిది. మధుశ్చ్యుత శ్శుచయః పావకాః - మధురమైన పదార్థాలన్నిటినీ మనకు ప్రసాదించేది జలమేనని భావం.

అంతేకాదు. యా సాందేవా దివి కృణ్వంతి భక్షం. దేవతలందరూ కూడా ఈ జలాలనే భక్ష్య పదార్థాలుగా చేసుకొని జీవిస్తున్నారు. ఎక్కడ దివి. ఆకాశంలో. కృణ్వంతి చేసుకొంటున్నారు. దేవత లమృతం తాగి బ్రతుకుతారనే మాటకిదే అర్థం. అమృత మేదో గాదు జలమే. అది భూమిని స్పృశించనంత వరకూ అమృతం. భూమి మీద పడితే మృతం. త్రిపాద స్యామృత మని పురుష సూక్తం చెప్పిందంటే ఇదే భావం. అలాటి అమృతాన్ని దేవతలు సేవిస్తున్నారంటే అర్థం ఆధి దైవికమైన శక్తులతి సూక్ష్మమైన ఆ పాంచ భౌతికమైన తత్త్వాలనే ఆశ్రయించి నిలిచి ఉన్నాయని. శక్తి ఎప్పుడూ భూతాన్ని ఆశ్రయిస్తుంది. లేకుంటే వ్యక్తమయి కనపడదు. భూతమెప్పుడూ శక్తి నాశ్రయిస్తుంది. లేకుంటే దాని కస్తిత్వమే లేదు. కాబట్టి దానికిది భక్ష్యం. దీనికది భక్ష్యం. అంటే ఆధార మాశ్రయమని భావం. యా అంతరిక్షే బహుధా భవంతి. అంతరిక్షంలో ఏవి నానారూపాలు ధరిస్తున్నాయో. ద్యులోకంలో అసలు కనపడవవి.

అంతరిక్షానికి దిగి వచ్చే సరికి మేఘ మండల రూపంగా తయారవుతాయి. అప్పుడు కనపడుతుంది కొంత. యాః పృథివీం పయ సోందంతి - భూలోకం దగ్గరికి వచ్చాయంటే వర్షధారలుగా మారి భూమిని తడుపుతూ పోతాయి. శుక్రాః శుభ్రమైన ఆపః ఆ జలమే మాకు ఆహారాన్ని ప్రసాదించి సుఖప్రద మగుగాక.

అంతే కాదు. శివేన మా చక్షుషా పశ్యత ఆపః - ఓ జల దేవత లారా మమ్మ మీరు శుభకరమైన దృష్టితో చూడండి. శివయా తనువా ఉపస్పృశత త్వచం మే - శుభమైన మీ శరీరంతో మా శరీరరాలను స్పృశించండి. అంటే మా చూపు మా స్పర్శ - ఇంద్రియాలన్నీ మీ వల్ల శివమయమై పోవాలి. ఎప్పుడూ బ్రతికి ఉండాలి. పనిచేస్తుండాలి. శివకరమైన మీతో సంసర్గముంటే గాని ఇవి శివమయం కాలేవు. ఇక్కడ దేవతలు మన ఇంద్రియాలే. ఆధ్యాత్మికంగా ఇంద్రియాలైతే ఆధి దైవికంగా దేవతలు. దేవతలక్కడ సూక్ష్మమైన జలాన్నే అమృత మని ఆశ్రయిస్తే మానవులిక్కడ స్థూలమైన ఆ జలాన్నే అన్నపానాదుల రూపంగా సేవించి అమృతమైన శక్తి రూపంగా అది మారితే దాన్ని ఆశ్రయించి బ్రతుకుతున్నారు. సర్వాగ్ం అగ్నీగ్ం రప్సు షదః - జలంలోనే ఉంటాయగ్నులన్నీ. విద్యుచ్ఛక్తి అదే గదా. బడబాగ్ని సాగరంలో ఉన్నదంటే కూడా అదే. అగ్నిలో నుంచి జలం వస్తే మళ్లీ జలంలో నుంచి అగ్ని. పంచీకరణ న్యాయాన్ని బట్టి

ఒకదానిలో మరొకటి గుప్తంగా ఉంటూనే ఉంటాయి. అప్సుషదః అంటే నీళ్లలోనే ఉన్నవని అర్ధం. హువేవః – అదంతా మీకు అప్పజెబుతాము మేము. ఎందుకని. మాకు కావలసిన దగ్ని కాదు. జలం కాదు. భౌతికమైన వాటి రూపాలు కాదు మాకు కావలసినది. మరేమిటి. మయి వర్చో బల మోజో నిధత్త. వాటివల్ల కలిగే ఫలమేదో అది మాకు ప్రసాదించండి. ఏమిటా ఫలమంటే చెబుతున్నాడు. వర్చః అంటే ముఖంలో కొట్ట వచ్చినట్టు కనిపించే వర్ణం. కళ. బలం. బలమంటే శారీరకమైన సామర్థ్యం. ఓజః ఓజస్సంటే శరీరం లోపల ఉన్న సారం. మయి నిధత్త. వీటన్నిటినీ మాలో ప్రవేశపెట్టండి.

ఎందుకు. దాని ప్రయోజనమేమిటి. చెబుతున్నాడు. ద్రుపదా దివ ముంచతు. ద్రుపద మంటే బండ కొయ్య. పూర్వం బండ కొయ్య వేసే వారట అల్లరి పిల్లలను. అలాగే బండ కొయ్య వేసింది ప్రకృతి మనల నందరినీ. అదే ఈ సంసారం. ముంచతు. దీనిలో నుంచి మమ్ము తప్పించు. తప్పించుకొనే స్తోమత ఇవ్వండి మాకు దేవతలారా. ఉన్ముముచానః తప్పించుకొని బయటపడితే సాధన మార్గంలో ముందుకు సాగిపోగలం. స్విన్నః స్నాత్వీ మలాదివ. బాగా చెమట పట్టిన వాడు స్నానం చేసి శరీర మాలిన్యాన్ని పోగొట్టు కొన్నట్టు. పూతం పవిత్రేణేవ ఆజ్యం. దర్భ పుల్ల ముంచితే ఆజ్యం పవిత్ర మయినట్టు మేము పరిశుద్ధులం కావాలి మొదట.

ఆపశ్శుంధంతుమా ఏనసః – ఎలా అవుతాము శుద్ధి. ఏనస్సంటే పాపం. పాపకర్మ మాలిన్యం నుంచి అబ్దే వతలు మీరు మమ్ము శుద్ధి చేస్తే అవుతామని భావన. మానసికంగా వాచికంగా కాయికంగా త్రికరణ శుద్ధిగా కావాలి అది. అలాటి పవిత్రతను  భావన చేయాలి సాధకుడు.

ఇలా భావన చేసి మరలా కేశవ నామాలు జపించి  మూడు మార్లు మరలా ఆచమనం చేసి పరిశుద్ధుడయిన తరువాత గాయత్రి నుపాసన చేస్తూ అర్ఘ్యాన్ని సమర్పిస్తున్నాడు సాధకుడు. చేతులు శుద్ధి చేసుకొని అర్పించేది అర్ఘ్యం. పాదాలు శుద్ధి చేసుకొంటే అది పాద్యం. రెండూ జలంతోనే శుద్ధి కావాలి. జలంతో చేతులు కడుగుకొని ఆపోశనం చేయాలి. ఆపః అంటే జలం. అశన మంటే త్రాగటం. ఇదీ ఆపోశన మంటే. ఇదే అవపోసర మయింది లోక వ్యవహారంలో. సంక్రాంతి సంకురాత్రి అయినట్టు. అక్షత లక్షింతలయినట్టు. ఇది అర్ఘ్య ప్రదానానికి ముందు చేసే పూర్వాపోశనం. తరువాత చేస్తే ఉత్తరాపోశనం. అర్ఘ్య ప్రదాన సంకల్పం చెబుతున్నాడిప్పుడు.

**పూర్వక్తైవం గుణ విశిష్టే శుభే ముహూర్తే – మమోపాత్త**

**దురిత క్షయ ద్వారా శ్రీపరమేశ్వర ముద్దిశ్య శ్రీపరమేశ్వర ప్రీత్యర్థ**

మని పేర్కొనటమే సంకల్పం చెప్పుకోటం. అలా చెప్పుకొని మూడు సంధ్యలలో ఏ సంధ్య అయితే దాన్ని స్మరిస్తూ అర్ఘ్య ప్రధానం కరిష్యే అని సమర్పించాలి సూర్య భగవానుడి కర్ఘ్యం. అలా సమర్పించేటపుడు

మూడుసార్లు ఓం భూర్భువ స్సువః అని గాయత్రీ మంత్రాన్ని జపించి చేతిలో పోసుకున్న జలాన్ని సూర్యమండలం వైపు చూపి పాత్రలో విడిచి పెట్టాలి. ఇందులో సంధ్యాకాల మతిక్రమిస్తే ముఖ్య కాలా తిక్రమణ దోష పరిహారార్థమని కూడా ఒక మాట అనాలి నోట. మధ్యాహ్న సంధ్యా వందనంలో అయితే మరొక మంత్రం కూడా ఉంది. అది ముందు చెప్పుకొని తరువాత గాయత్రిని జపించవలసి ఉంటుంది. అదేమిటంటే.

**హగ్ంస శ్శుచిష ద్వసు రంత రిక్షస - ద్ధోతా వేదిష - దతిథి**

**ర్దురోణ సత్ - నృష ద్వరస దృతస ద్వ్యోమస - దబ్జా గోజా**

**ఋతజా అద్రిజా ఋతం బృహత్ -**

ఇక్కడ సూర్యుడని పేరే గాని తద్ద్వారా పరమాత్మ స్వరూపాన్నే ధ్యానం చేస్తున్నాడు సాధకుడు. పరమాత్మకీ మండల మొక ఉపాధి. సూర్య ప్రకాశమనే నెపంతో భూమ్యాకాశాలన్నీ వ్యాపించి ఉన్నది నిజాని కా పరమాత్మ చైతన్య ప్రకాశమే. హగ్ంసః హంతీతి హంసః - సర్వత్రా వ్యాపించేది సూర్యుడా. కాదు. పరమాత్మ అనే సూర్యుడు. అది శుచిషద్ - శుద్ధమైన ఆకాశంలో ఉంది. వసు - భూమి మీదా ఉంది. అంతరిక్ష సద్ - రెండింటి నడుమా అంతరిక్షంలో ఉంది. హోతా వేదిషద్ - అగ్నిరూపంగా యజ్ఞ వేదికలో ఉంది. అందులో హోమం చేసే హోత కూడా అదే. అతి థి ర్దురోణసద్. దురోణమంటే ద్రోణం. అంటే గృహం.

గృహంలో అతిథిగా వచ్చి కూచున్నదీ అదే. అంటే గార్హ పత్యాగ్ని అని భావం. నృషద్ నరులం దరిలో ఉన్న జఠరాగ్ని వైశ్వానరాగ్ని కూడా అదే. అహం వైశ్వానరో భూత్వా అని గదా గీతా వాక్యం. వరసద్. వరమంటే ప్రశస్తమైనది. ప్రశస్తమైన పదార్థాలన్నిటిలో ఉన్నదదే. ఋత సత్ - ఋతమంటే సత్యం. అస్తిత్వంతో కూడిన పదార్థాలన్నీ సత్యమే. వాటన్నిటిలో సత్తా రూపంగా ఉన్నదదే. వ్యోమసత్ - ఆకాశంలో ఉన్నదదే. అబ్జా - జలంలో ఉన్నదదే - గోజా - భూమిలో ఉన్నదీ అదే. ఋతజా. ఋతంలో నుంచి జన్మించిందీ అదే. అద్రిజా. పర్వతాలలో ఉన్నదీ అదే. ఇంతెందుకు. ఋతం బృహత్.

ఆ పరమ సత్యమే దైతే ఉన్నదో అదే ఇన్ని రూపాలలో మనకు ప్రత్యక్షమవుతున్నది. అది ఉంటే సత్యం. కనపడితే ఋతం. ఋ అనే ధాతువుకు దర్శనమని అర్థం. ఋషి అంటే దర్శించేవాడు. అప్పటి కున్నదీ అదే కనిపిస్తున్నదీ అదే. ఆ చైతన్య ప్రకాశమే. ఉంటే అది నిర్గుణం. కనిపిస్తే సగుణం. అంటే భౌతికంగా అభౌతికంగా వ్యక్తంగా అవ్యక్తంగా ఉన్న దొకే ఒక చైతన్య ప్రకాశమదే ఈ తేజో బన్నాత్మకమైన చరా చర ప్రపంచమని దాని సర్వతో వ్యాప్తమైన స్వరూపాన్ని భావన చేస్తూ పోవాలి మనం.

**ఉద్యంత మస్తం యంత మాదిత్యం -**

**అభిధ్యాయన్ కుర్వన్ బ్రాహ్మణో**

**విద్వాన్ సకలం భద్ర మశ్నుతే - అసా నాదిత్యో బ్రహ్మేతి**

**బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి య ఏవం వేద -**

ఎలా భావన చేయాలో ఆ సూక్ష్మాన్ని కూడా వివరిస్తున్నాడు ఫలశ్రుతి వ్యాజంతో మహర్షి ఉదయిస్తున్న అస్తమిస్తున్న ఆదిత్య మండలాన్ని మనసులో ధ్యానం చేస్తూ బాహ్యంగా కూడా ఆచరిస్తూ బ్రహ్మ తత్త్వాన్ని తెలుసుకొన్న జ్ఞానశీలుడు సమస్తమైన శుభాలూ జీవితంలో పొందగలడు. జీవితాంతంలో బ్రహ్మ సాయుజ్యాన్నే చెందగలడు. అది కూడా ఏదో క్రొత్తగా పొందుతాడని కాదు. బ్రహ్మ మనేది మనం ధ్యానిస్తే తయారయ్యేది కాదు. లేదా మనమంతకు ముందు అది కాకుండా క్రొత్తగా అయ్యేదీ కాదు. మొదటి నుంచీ ఉన్నది. ఎప్పుడూ ఉంటుంది. అదే సత్యమంటే. అది తనపాటి కెక్కడో ఉంటుందని కూడా కాదు. మన స్వరూపం కూడా అదే. అయితే గుర్తింపు లేక దెబ్బ తిన్నాము అది ఇప్పుడు గుర్తించా మంత మాత్రమే. ఈ గుర్తించటమే పొందటమనే మాట కర్థం. అదే చెబుతున్నాడు మహర్షి. బ్రహ్మైవసన్ బ్రహ్మ స్వరూపుడయ్యే ఈ జ్ఞాని బ్రహ్మాప్యేతి - బ్రహ్మంతో ఏకమవుతున్నాడు. అయితే యఏవం వేద. బ్రహ్మమే అయినా అది వస్తు తంత్రమే గాని బుద్ధి తంత్రం కాదు. ఎవడలా తన బుద్ధితో గ్రహిస్తాడో వాడే బ్రహ్మ మవుతాడని భావం. జ్ఞానం లేకుంటే అనుభవం లేదెప్పుడే గానీ. అసా వాదిత్యో బ్రహ్మ. మరి అలాంటప్పుడీ సూర్యోపస్థాన

మేమిటి. ఎవడీ ఆదిత్యుడు. ఎవడో కాదు. దానికొక ఉపాధి. పరోక్షంగా ఉన్నదని భావించే బ్రహ్మమే అపరోక్షంగా ఆదిత్య రూపంతో దర్శనమిస్తున్నది మనకు. అంచేత దీన్ని కేవలమొక భౌతికమైన మండలంగా చూడక తద్రూపంగా ఉన్నదక్కడ సచ్చిద్రూపమైన పరమాత్మే అని దర్శించాలి సాధకుడు. ఇదీ తాత్పర్యం.

పోతే ఇక గాయత్రి నావాహన చేయాలి మనం. గాయత్రీ అంటే పరమాత్మ శక్తేనని పేర్కొన్నాము. అది పరమాత్మ లాగా సర్వవ్యాపకమైనా అజ్ఞానవశాత్తూ మనకు దూరంగా భావిస్తున్నాము. కాబట్టి మనమీది కావహించుకోవాలి. అప్పుడది శబ్ద రూపంగా దిగి వస్తుంది. గానం చేస్తూ అవతరిస్తుంది కాబట్టి గాయత్రి అన్నారు దాన్ని. మరలా దాన్ని శబ్ద రూపంగా జపిస్తూ పోతే జాపకుణ్ణి భోగా పవర్గా లిచ్చి రక్షిస్తుంది. కాబట్టి కూడా గాయత్రీ అన్నారు. ఏమిటీ గాయత్రి అంటే. శాబ్దికంగా చెబితే ఓం కారమే అది. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ. ఓమ్మనేది ఏకాక్షరం. అది సాక్షాత్తూ బ్రహ్మమే. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్నని గీతా వాక్యం. శబ్ద రూపంగా ఓమ్మని జపిస్తున్నావంటే అర్థరూపంగా బ్రహ్మమే నీ మనస్సులో ఉండాలి. శబ్దమొక వ్యాహృతి మాత్రమే. అంటే ముఖతః ఉచ్చరించటమే. దాని అర్థం పరమాత్మ. తజ్జప స్తదర్ధ భావనమని అందుకే అన్నాడు పతంజలి. అంటే వచసా జపం. మనసా ధ్యానం. అగ్ని ర్దేవతా.

దీనికి దేవత అగ్ని. అగ్ని అంటే ఆ దివ్యమైన తేజస్సే. బ్రహ్మ ఇత్యార్షమ్. ఋషికి సంబంధించినది ఆర్షం. అది బ్రహ్మమే. అంటే అర్ధం. బ్రహ్మమే తన్ను తాను దర్శిస్తున్నాడు. అలాగే దాన్ని తన స్వరూపంగానే దర్శిస్తున్నాడు విశ్వామిత్రుడి లాంటి ఒక మహర్షి. బ్రహ్మం దర్శించినట్టే బ్రహ్మమై ఎవడు దర్శిస్తాడో ఇద్దరూ ఒకటే. ఇద్దరికీ భేదం లేదు గనుక బ్రహ్మానికి బ్రహ్మమే ఋషి. గాయత్రం ఛందః - దేవత అయింది. ఋషి అయింది. ఇక ఛందస్సు. అది ఏదో గాదు గాయత్రే. ఏమిటర్థం. గాయత్రీ అనేది ఒక దేవత అని గాదు. సప్త చ్ఛందస్సులలో అది ఒక ఛందస్సు. అనుష్టుప్ త్రిష్టుప్ జగతీ - ఇలాంటివి ఏడున్నాయి ఛందస్సులు. ఛాదనం చేసే దేదో అది ఛందస్సు. లోపలి మంత్రార్ధ మన ధికారుల కెవరికీ తెలియకుండా కప్పిపుచ్చే అక్షర విన్యాసమే ఛందస్సంటే. మంత్రార్థం మంత్రాధి దేవత పరాశక్తే. దానికొక ఆచ్ఛాదన ఈ ఛందస్సు. దీన్నే శ్లోకమని వృత్తమని పద్యమని కూడా పేర్కొనవచ్చు. ఈ శబ్ద రూపమైన గాయత్రీ ఛందస్సుకు అర్థరూపమైన శక్తికీ అభేదాన్ని కల్పించి గాయత్రి అంటే పరమాత్మ శక్తి అన్నారు పెద్దలు. అంత మాత్రమే.

**పరమాత్మా స్వరూపం - సాయుజ్యే వినియోగః -**

పోతే దీని స్వరూపమేమిటని అడిగితే అది పరమాత్మేనట. శబ్ద రూపంగా వ్యక్తమవుతున్నది శక్తి అయితే శక్తిరూపంగా వ్యాపిస్తున్నదా

పరమాత్మే గదా. కాబట్టి పరమాత్మే దీని స్వరూపం. సాయుజ్యే వినియోగః – మరి దీనికి వినియోగ Utility మెక్కడ అని ప్రశ్న. అది పరమాత్మ సాయుజ్యమే మరేదీ గాదు.

ఏ మంత్రానికైనా దేవత ఋషి ఛందస్సు స్వరూపమూ వినయోగమూ – ఇవన్నీ ఉండి తీరాలి. మంత్రానికి వన్నీ అంగాలు. ఈ అంగాలతో కూడిన అంగి ఆ మంత్రం. మననాత్త్రాయతే ఇతి మంత్రః – అది పైకి శబ్ద రూపంగా ఉచ్చరించటం వ్యాహృతి అయితే అర్థరూపంగా భావన చేస్తూ పోతే అది ధ్యానం. కాగా అన్నిటి కన్నా గొప్ప అర్థమేదుందో అది పరమార్థమన్నారు. అది కేవలం పరమాత్మే. అలాటి పరమార్థాన్నే బోధిస్తున్నదీ గాయత్రీ మంత్రం. దీని ప్రయోజనం కూడా ఐహికమైన అర్థకామాలు కాదు. ఆముష్మికమైన ధర్మమూ కాదు. కేవలం మోక్ష పురుషార్థమే. కనుక మిగతా మంత్రాలన్నిటి కన్నా చాలా గొప్ప మంత్ర మీ గాయత్రి ఒక్కటే. నగాయత్ర్యాః పరోమంత్రః అని దీనికే పట్టాభిషేకం చేశారు ధర్మశాస్త్రజ్ఞులందరూ. అంతే కాదు. జప్యే దన్యన్నవా జప్యే న్మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే. ఇంకొక మంత్రం జపించినా జపించక పోయినా మునిగి పోయిందేమీ లేదు. మైత్రః మిత్రుడంటే సవిత సూర్యుడు. సూర్యుడికి సంబంధించిన ఈ గాయత్రిని జపిస్తేనే వాడు బ్రాహ్మణుడవుతాడు. అని స్పష్టంగా చాటించారు కూడా పెద్దలు.

ఇలాటి గాయత్రీ దేవత నా వాహన చేస్తున్నా దుపాసకుడు. ఎలాగని.

**ఓ మాయాతు వరదా దేవి - అక్షరం బ్రహ్మ సమ్మితమ్ -**

**గాయత్త్రీం ఛందసాం మాతేదం బ్రహ్మ జుషస్వమే - యదహ్న**

**త్కురుతే పాపం తదహ్నాత్ ప్రతి ముచ్యతే యద్రాత్రియా త్కురుతే**

**పాపం - తద్రా త్రియా త్ప్రతి ముచ్యతే - సర్వవర్ణే మహాదేవి -**

**సంధ్యా విద్యే సరస్వతి - ఓజోసి సహోసి బలమసి భ్రాజోసి**

**దేహానాం ధావ నామాసి - విశ్వమసి విశ్వాయుః - సర్వమసి**

**సర్వాయుః - అభిభూః - ఓం గాయత్త్రీ మావాహయామి**

**సావిత్త్రీ మావాహయామి - సరస్వతీ మావాహయామి -**

**ఛందర్షీ నావాహయామి -**

**సరస్వతీ మావాహయామి - గాయత్ర్యా గాయత్త్రీ -**

**ఛందః - విశ్వామిత్ర ఋషిః - సవితా దేవతా - అగ్నిర్ముఖమ్ -**

**బ్రహ్మశిరో - విష్ణు ర్హృదయగ్ం - రుద్ర శ్శిఖా - పృథివీ యోనిః -**

**ప్రాణా పాన వ్యానో దాన సమానా - సప్రాణా - శ్వేత వర్ణా -**

**సాంఖ్యాయ నసగోత్రా గాయత్త్రీ చతుర్విగ్ంశ త్యక్షరా - త్రిపదా**

**షట్కుక్షిః - పంచశీర్షా - ఉపనయనే వినియోగః -**

అమ్మా గాయత్రీ దేవతా రా మా ఇంటికిరా. మా ఇంటికంటే మా మనసులోకి. వరదా – నీవు మాకు వరాలన్నీ ప్రసాదించే మహాశక్తివి. వరాలేవో గావు. భోగాప వర్గాలే మనం కోరే వరాలు. అక్షరం బ్రహ్మ

సమ్మితం. బ్రహ్మతత్త్వంతో కూడిన అక్షరానివి నీవు. నీకూ బ్రహ్మానికీ భేదం లేదు. నీవూ అక్షరమే. అదీ అక్షరమే. క్షరం కాని దేదో అది అక్షరం. అలాటి అక్షరమైన తత్త్వాన్ని అందించే తదాకారమైన వృత్తివి కాబట్టి నీవూ అక్షరమే. తాదర్థ్యా త్తద్వ్యపదేశః అన్నారు. ఆయుర్వైఘృతం. నెయ్యి ఆయుస్సేనంటే ఆయుర్వర్ధకమని అర్థం. గాయత్రి బ్రహ్మమేనంటే బ్రహ్మతత్త్వాన్ని అనుభవానికి తెచ్చేదని భావం. గాయత్రీ ఛందసాంమా తేదం బ్రహ్మజుషస్వమే. ఛందస్సులంటే వేదాలు. వేదాలకు తల్లి గాయత్రి. ఓంకారమే గదా గాయత్రి - ఓంకారంలో నుంచే వేదాలున్న జన్మించాయి. శబ్ద వికారం వేదమంటే. అది శబ్ద సామాన్యమైన ఓంకార వివర్తమే. కనుక గాయత్రి వాటికి మాతృస్థానం. అందుకే ఛందస్సారా అని నామం అమ్మ వారికి. ఇదం బ్రహ్మ ఇదుగో నేను కూడా ఈ బ్రహ్మ కర్మ చేస్తున్నాను. ఈ కర్మ ద్వారా బ్రహ్మ సాయుజ్యమే కోరుతున్నాను. జుషస్వమే. ఇందులో వచ్చి కూచో తల్లీ. మంచిదే కాని నీ మనస్సు శుద్ధి అయితే గదా అంటావేమో.

**యదహ్నాత్కురుతే పాపం - తదహ్నాత్ప్రతి ముచ్యతే.**

**యద్రాత్రియా త్కురుతే పాపం తద్రాత్రియాత్ప్రతి ముచ్యతే.**

పగటి వేళ నేనే యే దుష్కార్యాలు చేసినా వాటి కాలుష్యం పగటి తోనే తీరిపోతుంది. రాత్రి వేళ ఏవేవి చేస్తే వాటి కల్మషం రాత్రితోనే తీరిపోతుంది. నేను బ్రహ్మ భావనతో ఈ కర్మ చేస్తున్నాను కాబట్టి. అది

ఎప్పటికప్పుడీ పాప పంకాన్ని క్షాళితం చేస్తూ పోతుంది. సర్వవర్ణే మహాదేవి సంధ్యా విద్యే సరస్వతి – నీవు అకారాది క్షకారంతంగా అన్ని వర్ణాలు వ్యాపించి ఉన్నావు. శబ్ద రూపిణివి. భాషారూపా అని అమ్మవారి పేరు. శబ్దమే అర్థాన్ని చెబుతుంది. పరమార్థాన్ని మాకు బోధించేది నీవే. ఆయన దేవుడైతే నీవు దేవివి. ప్రకాశ రూపిణివని అర్థం. సంధ్యవు నీవే విద్యవూ నీవే. విమర్శరూపిణీ విద్యా అన్నా రమ్మ వారిని. విద్య వల్లనే వేద్యమనేది అనుభవానికి వస్తుంది. ఎలా వస్తుందది. సరస్వతి. విద్య సరస్వతి. సరస్వతి అంటే ప్రాకుతూ పైకి పోయేదని అర్థం. క్రింద బడిపోయిన మన మనస్సును క్రమంగా పైకి తీసుకెళ్లేదే విద్య. గాయత్రి సృష్టికి సావిత్రి స్థితికి సరస్వతి లయానికి సంకేతాలు. ఒక్కటే శక్తి దిగి వచ్చే టప్పుడు గాయత్రి అయింది. కాపాడేటప్పుడు సావిత్రి అయింది. సవిత తేజస్సే గదా సావిత్రి అంటే. అది సవిత ఉన్నంత వరకూ స్థితే గదా. అదే అస్తమించేటప్పుడందులోనే లయమయి పోతుంది కాబట్టి సరస్వతి. ఇలా మూడు కాలాల్లో మూడు రూపాలుగా ఉన్నదొకే శక్తి అని భావన చేయాలి. చేస్తే ఓజోసి – నీవే నాకు ఓజస్సు – సహోసి – సహించే శక్తివి. బలమసి – శారీరకమైన పాటవమూ – భ్రాజో సి – నా ముఖ వర్చస్సువు కూడా నీవే. దేవానాం ధామ నామాసి దేవతలంటే మన ఇంద్రియాలు. ఇంద్రియాలన్నింటికీ నీవే ధామం. అంటే స్థానం. నామమంటే వాటి వ్యవహారమూ అన్నీ నీవే.

విశ్వమసి విశ్వాయుః సర్వమసి సర్వాయుః – అంతేగాక మొత్తం విశ్వమంతా నీవే వ్యాపించి ఉన్నావు. నీవే విశ్వాని కాయుస్సు. అంటే దాని బ్రతుకంతా నీవే. విశ్వ అంటే జీవుడని చెప్పినా సరిపోతుంది. జీవులమైన మా జీవిత మంతా నీవే. అలాగే ఈ కనిపించే సర్వ ప్రపంచమూ దాని స్థితి గతులూ నీవే. అభిభూః – దేనినైనా త్రోసి పుచ్చే సామర్థ్యమూ నీవే. ఓ గాయత్రీ.

ఓం గాయత్రీ మావాహయామి – కనుక ఓ గాయత్రీ నిన్నే ఆవాహన చేస్తున్నాను. ఆవాహన మంటే సాధకుడు తన మీదికి తెచ్చుకోటం. అప్పుడా శక్తి ప్రభావం మనకు సంక్రమిస్తుంది. సావిత్రీ మావాహయామి – సరస్వతీ మావాహయామి. గాయత్రినే గాక సావిత్రీ సరస్వతులను కూడా ఆహ్వానిస్తున్నాను. దీనివల్ల సృష్టి స్థితి లయాలు లేదా జాగ్రత్స్వప్న సుషుప్తులు మూడు కాలాల్లో దాని ప్రభావం మాకు సంక్రమించాలని భావన. ఛందర్షీ నావాహయామి – ఈ గాయత్రీ ఛందస్సును దర్శించిన విశ్వామిత్రాదుల ప్రభావం కూడా మామీద పనిచేయాలి. శ్రియ మావాహయామి. అదంతా మాపాలిటికి సంపదే. ఐశ్వర్యమే.

గాయత్ర్యా గాయత్రీ ఛందః – ఈ గాయత్రికి ఛందస్సు గాయత్రే. అంటే గాయత్రీ శక్తిని అభివ్యక్తం చేసేది గాయత్రీ శ్లోకం. విశ్వామిత్ర ఋషిః – విశ్వామిత్రుడే మొదట దీన్ని దర్శించిన ఋషి. సవితా దేవతా. ఈ ఛందస్సు కధి దేవత – సవిత. సూర్య భగవానుడు. అంటే సూర్య మండలం ద్వారా వ్యక్తమైన పరమాత్మ. అది పరమాత్మ సోపాధికమైన

రూపం. అగ్ని ర్ముఖం. బాహ్యంగానైతే అన్ని ద్రవ్యాలనూ హోమం చేసేది అగ్నిలోనే గనుక అదే ముఖం గమ్యాన్ని చేరటానికి. ద్వారమని అర్థం. ఆభ్యంతరంగా మనముఖంలో ఉండే ఉష్ణ గుణమే అగ్ని. ఆహవనీయమది. భోజ్య పదార్థాలన్నీ అందులోనే గదా ఆహుతి అవుతున్నాయి. కనుక అగ్ని ముఖమే వాస్తవానికి.

ఇలా అంటున్నప్పుడు మన మంగ వ్యాసం చేసుకొంటుండాలి. బ్రహ్మ శిరో విష్ణు ర్హృదయగ్ం - రుద్రశ్శిఖా - ముఖమూ శిరస్సూ హృదయమూ. బ్రహ్మ విష్ణు మహేశ్వరులుండే స్థానాలివి మూడూ. అనగా జాగ్రత్స్వప్న సుషుప్తులను కోండి. జాగ్రత్కాలం ముఖంలో అందులోనూ దక్షిణాక్షిలో - స్వప్న కాలం శిరస్సులో. సుషుప్తి కాలం హృదయంలో చేరుతాడీ జీవుడు. పృధ్వీ యోనిః - పృధివి మూలస్థానం. ప్రాణాపాన వ్యానో దాన సమానా స ప్రాణా - పంచ శాఖాత్మకంగా ప్రసరించే ప్రాణవాయులే ప్రాణం గాయత్రికి. పృధివి శరీరమైతే ఇది ఆ శక్తికి ప్రాణం. ఇందులో ఆంతర్యమేమంటే అంగన్యాస మెప్పుడు చేశామో అప్పుడీ శరీరమంతా గాయత్రి అయిపోవాలి. మాంసపిండం మంత్ర పిండంగా మారిపోవాలి. ఇది ఇక మన శరీరం కాదు. గాయత్రీ శరీరం. మర్త్యం దివ్యమై పోతుంది. ఈ అవయవాలన్నీ మనవి కావు. ఆ దేవతవే. ఈ శిఖ రుద్రుడు. ఈ యోని పృధ్వీ. ప్రాణాలు ఆ శక్తి ప్రసారం. మన వర్ణ మావిడ

వర్ణమే. మన నలుపూ తెలుపూ అంతా కలిసి శ్వేత వర్ణా. తెల్లని తెలుపుగా మారుతుందా విడకు. శ్వేత వర్ణమంటే శుద్ధ సత్త్వమని అర్థం. సాంఖ్యాయన సగోత్రా సాంఖ్యాయన మహర్షి గోత్రంలో జన్మించిందట. సాంఖ్యమంటే జ్ఞానం. దాని కయనం నిలయమైనది సాంఖ్యాయనం. అదే ఆవిడ గోత్రం. అంటే అఖండమైన బ్రహ్మజ్ఞానం. చతుర్వింశ త్యక్షరా. ఇరవయి నాలుగక్షరాలు గాయత్రీ ఛందస్సుకు. తత్సవితుర్వరేణ్యం - 8. భర్గో దేవస్య ధీమహి - 8 ధియోయోనః ప్రచోదయాత్ - 8. వెరసి 24 అక్షరాలు. ఇది ఏవో గావు. మహాభూతాల దగ్గరి నుంచి శబ్ద స్పర్శాది పంచతన్మాత్రల వరకూ వ్యాపించి ఉన్న 24 తత్త్వాలే. వాటికి సంకేతమే ఈ అక్షరాలు. త్రిపదా - మూడెనిమిదులూ కలిసి ఇంతకూ మూడు పాదాలే. త్రిపదా అంటున్నాడు. నాలుగవ పాదమేమయినట్టు. పద్యానికి నాలుగు పాదాలుండాలి గదా. ఉంది నాలుగవ పాదం. గుప్తంగా ఉంది. దాన్నే గుప్త గాయత్రి అంటారు. సన్న్యాసులకు పనికి వచ్చేదది. ఏదో గాదు. పరోరజసి సావదోమ్. రజో గుణాని కతీతమైన దశలో ఉన్నదా శక్తి. సా అవతు - అది మనలను రక్షించాలని అర్థం. ఆ ఎనిమిదీ కలిస్తే 32 అక్షరాలు నాలుగు పాదాలూ సరిపోతాయి గాయత్రీ ఛందస్సుకు.

ఏమిటి దంతా. ఛందో రూపంగా కనిపించేది పరా దేవతే నని గదా ముందు నుంచీ చెబుతూ వచ్చాము. ఆ పరాశక్తే మనదాకా దిగి వచ్చి

త్రిపద అయి అనుభవానికి వస్తున్నది. పదమంటే స్థానం అవస్థ. జాగ్రత్స్వప్న సుషుప్తులనే మూడవస్థలే అవి. అవి ధియః అనేక వృత్తులను సృష్టిస్తుంటాయి మనస్సుకు. లేదా ప్రచోదయాత్. త్రోసి పుచ్చి తాత్కాలికంగా లయమవుతాయి సుషుప్తిలో. ఇది ప్రతిలోమమే గాని అనులోమం కాదు. ప్రతిలోమం ఉదయాస్తమయాలు చెందుతూ ఎప్పటికీ మనకు బయటపడే మార్గం చూపదు. అది రజోగుణం. అంటే చలన మున్నంత వరకూ ఆసించలేము. దాన్ని మనస్సు నుంచి నస్యసిస్తే గాని సుఖం లేదు. అదే అసలైన ప్రచోదన. దానికి కావలసింది అనులోమమైన బ్రహ్మాకార వృత్తి ఒక్కటే. భర్గో దేవస్య అదే. దాన్ని ధీమహి. నిరంతరం మనసులో నిలుపుకుంటే అదే మనల నెప్పటికైనా తరింపజేస్తుందని భావం. అప్పుడీ త్రిపద – అంటే అవస్థాత్రయాన్ని దాటి తురీయమైన పదం – సమాధి దశను పొందగలడీ మానవుడు. గృహస్థా శ్రమంలో అది సాధ్యం కాదు గనుక అది సన్న్యాసుల కేనని గుప్తం చేశారా పాదాన్ని గాయత్రిలో. సన్న్యాస మంటే భౌతికమే కానక్కర లేదు. మానసికమే అసలైన సన్న్యాసం.

షట్కుక్షిః పంచశీర్షా – ఉపనయనే వినియోగః అని వర్ణించటంలో అంతర్గతమయి ఉందీ రహస్యమంతా. 6 కుక్షులూ 5 శిరస్సులూ ఉన్నాయట గాయత్రికి. ఇది గాయత్రీ ఛందస్సుకా. దేవతకా. ఛందస్సుకైతే చెల్లనే చెల్లదు. ఛందోరూపంగా భావించే దేవతకైతేనే చెల్లుతుంది. మిగతా

వృత్తులన్నీ ప్రచోదనం చేసి బ్రహ్మాకార వృత్తినే ధ్యానించినప్పుడు మన మవస్థాత్రయాన్ని దాటిపోతాము. అదే సన్న్యాసం. అప్పుడు తురీయా వస్థలో ఉంటుంది మనస్సు. ఉన్నప్పుడా దివ్యశక్తి ఎలా కనిపిస్తుంది మనకు. వాగ్భూత పృధ్వీ శరీర హృదయ ప్రాణాలనే ఆరు స్థానాలనూ వ్యాపించి కనిపిస్తుంది. అంటే మన పిండాండమూ బ్రహ్మాండమూ అంతా అదే. అలాగే పంచశీర్షా. అయిదు శిరస్సులంటే పృధి వ్యప్తేజో వాయ్వా కాశాలనే పంచ భూతాలూ అదే. విశ్వతో ముఖంగా మన కభిన్నంగానే దర్శన మిస్తుంది. కనుకనే ఉపనయనే వినియోగః - ఉపనయన మంటే బ్రహ్మచారిని గురువు దగ్గరికి తీసుకు వెళ్లటం. ఎందుకు. ఆయన ద్వారా వీడు బ్రహ్మోప దేశం పొందటానికి. గాయత్రీ మంత్రోపదేశమే బ్రహ్మోపదేశం. ఉపనయన కాలంలో పురోహితుడు దాన్నే మన కుపదేశిస్తుంటాడు. అంటే అర్థం. బ్రహ్మతత్త్వాన్ని చేరటానికి మార్గం చూపుతున్నాడు. అదీ అసలైన ఉపనయనం. గురువు దగ్గర చేర్చట మొక ఉపనయనమైతే ఆయన మంత్రోపదేశం ద్వారా జీవిత గమ్యాన్నే చేర్చట మొక ఉపనయనం. మొదటిది బాహ్యం. రెండవది ఆంతర్యం. అదే ఈ గాయత్రికి వినియోగం. ఉపనయనంలోనే దానికి వినయోగం. అంటే అదీ దీని ప్రయోజన మని తాత్పర్యం.

ఏతావతా గాయత్రీ మంత్రాధి దేవతను సాంగోపాంగంగా మనమీది కావాహన చేసుకొంటూ వచ్చాము. దాని యావదర్థాన్నీ కూడా మనసా

ఆకళింతకు తెచ్చుకొన్నాము. కాని తదవిస్మరణార్ధ మన్నారు శంకర భగవత్పాదులు. మరచి పోకుండా దాన్ని నిత్యమూ జపిస్తూ మనసా దాని అర్థాన్ని స్మరిస్తూ పోవాలి. న్యాయమైతే సర్వకాల సర్వావస్థలలోనూ అదే ధ్యాస ఉండాలి మనస్సులో. కాని అలా చేయటం ప్రాపంచిక వ్యవహారాలలో తగులుకొన్న ఈ మానవుడి బుద్ధికి సాధ్యం కాదు. కాబట్టి కనీసం త్రిసంధ్యలలోనైనా దాన్ని స్మరించటం వీడి బాధ్యత. అప్పుడు కూడా యధాశక్తిగా అష్టోత్తర శతం గాని సహస్రంగాని జపం చేయటమని వార్యమని ప్రస్తుతం గాయత్రీ మంత్ర జపాన్ని విధిస్తున్నది శాస్త్రం. అది కూడా ఊరక నోటితో ఉచ్ఛరించటం వరకే గాదు. మనసా దాని అధి దేవతను ధ్యానిస్తూ బాహ్యంగా అంగన్యాస కరన్యాసాలు పాటిస్తూ ఆచరించాలి. న్యాసమంటే ఉంచటం. కరన్యాసమంటే చేతుల మీద ఉంచటం. అంటే ఆ మహాశక్తి మన వేళ్లమీద వచ్చి కూచున్నట్టు భావించటం. అలా భావిస్తే మనరెండు చేతులూ పవిత్రమవుతాయి. ఏదైనా చేతులతోనే గదా ఆచరిస్తాము. అది పవిత్రమైతే వాటితో చేసే కర్మా పవిత్ర మవుతుంది. అలాగే అంగన్యాసమంటే మొత్తం శరీరం మీద తెచ్చి పెట్టటం. అప్పుడు ఆపాదమస్తక మీ శరీరం కూడా పావన మవుతుంది. ఉపాధి ఎప్పుడు శక్తి చేత పవిత్రమూ శక్తిమంతమూ అయిందో దానితో నిర్వర్తించే కర్మ కూడా కోరిన ఫలాన్ని అందివ్వటానికి సమర్ధమవుతుందని తాత్పర్యం.

## - కరన్యాసం -

**ఓం తత్స వితుః బ్రహ్మాత్మనే అంగుష్ఠాభ్యాం నమః**

**వరేణ్యం విష్ణ్వాత్మనే తర్జనీ భ్యాం నమః**

**భర్గో దేవస్య రుద్రాత్మనే మధ్యమాభ్యాం నమః**

**ధీమహి సత్యాత్మనే అనామికాభ్యాం నమః**

**ధియో యోనః జ్ఞానాత్మనే కనిష్ఠి కాభ్యాం నమః**

**ప్రచోదయాత్ సర్వాత్మనే కరతల కరపృష్ఠాభ్యాం నమః**

## అంగన్యాసం

**ఓం తత్సవితుః బ్రహ్మాత్మనే హృదయాయ నమః**

**వరేణ్యం విష్ణ్వాత్మనే శిరసే స్వాహా**

**భర్గో దేవస్య రుద్రాత్మనే శిఖాయై వౌషట్**

**ధీమహి సత్యాత్మనే కవచాయ హుం**

**ధియో యోనః జ్ఞానాత్మనే నేత్ర త్రయాయ వౌషట్**

**ప్రచోదయాత్ సర్వాత్మనే అస్త్రాయ ఫట్**

**భూర్భువ స్సువ రోమితి దిగ్బంధః**

కరన్యాసార్ధం చెప్పుకొందాము ముందు. గాయత్రీ మంత్రాన్ని 6 భాగాలు చేసి అందులో ఒక్కొక్క భాగాన్ని ఉచ్చరిస్తూ సాధకు డొక్కొక హస్త ప్రదేశాన్ని స్పృశిస్తూ అక్కడ వచ్చి కూచున్న ఆ దివ్యశక్తినే వివిధ రూపాలలో

భావించి దానికి నమస్కరించాలి. అంటే దానికి తన ఉపాధిని స్వాధీనం చేయాలి. అది ఎలాగో చెబుతున్నారు వినండి. ఓం తత్సవితుః అంటున్నప్పుడా దేవత బ్రహ్మాకారంగా మన చేతిలోని అంగుష్ఠం మీదికి వచ్చినట్టు భావించాలి. ఓం వరేణ్యం అంటున్నప్పుడది విష్ణ్వాకారంగా తర్జని అంటే చూపుడు వేళ్ల మీద ఉన్నట్టు భావించాలి. ఓం భర్గో దేవస్య అన్నప్పుడది రుద్రాకారంగా మధ్యమమైన వేళ్ల మీద ఉన్నట్టు భావించాలి. ధీమహి సత్యాత్మనే అన్నప్పుడది అనామిక అంటే నాలుగవ వేళ్లమీద ఉన్నట్టు భావించాలి. ధియో యోనః - ధియో యోనః అన్నప్పుడు జ్ఞానాత్మకంగా అది చిటికెన వేళ్లమీద ఉన్నట్టు దర్శించాలి. ప్రచోదయాత్త న్నప్పుడది సర్వాకారాంగా కరతలం మీద కర పృష్ఠం మీద అంటే వెల్లకిల బోర్ల త్రిప్పి అక్కడ కూచున్నట్టు చూడాలి. ఏమయిందప్పటికి. 5 వేళ్లను చేతి ముందు వెనుకలనూ త్రిమూర్తులుగా సత్యంగా జ్ఞానంగా సర్వంగా అవతరించిన ఒకే ఒక పరాశక్తి రూపాలుగా భావిస్తూ పోవాలని అర్థం.

అలాగే ఇప్పుడు డంగన్యాసానికి కూడా అర్థం గ్రహించాలి మనం. ఇక్కడ మొదటి రెండు వరసలూ ఒకటే. అంటే మంత్ర భాగమూ దేవతా రూపమూ ఒక్కటే. తేడా లేదు. కాని కరస్థానాలకు బదులు శరీర స్థానాలను గ్రహించాలి మనం. ఎలాగంటే సవితుః అన్నప్పుడు హృదయ ప్రదేశమూ వరేణ్యమంటే శిరస్సూ భర్గో దేవస్య అంటే శిఖ - ధీమహి

అన్నప్పుడు కవచమూ ధియెూ యెూనః అంటే నేత్ర త్రయమూ ప్రచోదయాత్తంటే అస్త్రమూ - భూర్భువ స్సువ రంటే దిగ్బంధమూ గ్రహించవలసి ఉంటుంది. అయితే ఇందులో హృదయమూ శిరస్సూ శిఖా అర్థమవుతున్నాయి గాని మిగతా నాలుగూ అంత స్పష్టంగా తెలియటం లేదు. ఏమిటి వాటి కర్థం. కవచమంటే మన అవయవాల నన్నిటినీ కమ్ము కొని కనిపించే త్వగింద్రియ మనుకోవచ్చు. కవచం లాగా ఈ చర్మ మేగదా శరీరానికి దెబ్బ తగలకుండా కాపాడుతున్నది. మరి నేత్రత్రయ మేమిటి. రెండే గదా మనకున్నవి కండ్లు. మూడెక్కడివి. జ్ఞానాత్మనే అంటున్నాము కాబట్టి మూడవది జ్ఞాననేత్ర మనుకోవచ్చు. కాగా ఇక అస్త్ర మేమిటి బంధమేమిటవి ప్రశ్న. సర్వాత్మనే అని గదా అన్నారు. సర్వమూ నేనే అనుకొంటే అదే ఒక అస్త్రమై విజాతీయమైన భావాలన్నిటినీ పటా పంచెలు చేస్తుంది అదే ఫట్ అనే మాట కర్థం. ధ్వన్యను కరణ శబ్దమది. మరి భూర్భువస్సు రోమ్మని నలువైపులా చూచామంటే ఆశక్తి ప్రభావంతో ఏ దిక్కునుంచీ ఏ విఘ్నమూ మనకు సోకకుండా వాటిని బంధించినట్టవు తుంది. అదే దిగ్బంధం. స్వాహా అన్నప్పుడన్ని శక్తులూ మన లోపలికి రావాలని భావం. వషట్ హుమ్ వౌషట్ ఫట్టన్నప్పుడు ప్రతీప శక్తులన్నీ మనలోనుంచి ఉచ్చాటన మయి పోవాలని భావం. అలా భావిస్తూ పోతే ఆ మహాశక్తి జ్ఞాన నేత్రాన్ని మనకు ప్రసాదించి అజ్ఞాన తిమిరం మన దరి జేరకుండా ఒక బ్రహ్మాస్త్రంగా మారి దిగ్బంధం చేసి అభేద్యమైన కవచమై మనలను కాపాడుతుందని ఇంత గొప్ప అంతరార్థ ముంది ఇందులో.

# ఉత్తరార్థము

ఇక్కడికి పూర్వార్ధ మయింది మన ప్రయాణంలో. ఇక ఉత్తరార్ధంలో ప్రవేశిస్తున్నాము. ఏమని చెప్పామింతకు ముందు. గాయత్రీ జపం యధాశక్తిగా 108 మార్లో 1000 మార్లో చేయటం మంచిదని చెప్పాము. అది మౌనంగా చేయాలి మనం. ఆ తరువాత దిగ్విమోకం చేయాలి. అంతకు ముందు చేసిన దిగ్బంధాన్ని సడలించాలని అర్థం. దిగ్బంధమంటే చూపుడు వేళ్లు రెండూ మెలిక వేయటం. దిగ్వి మోకమంటే మెలిక సడలించటం. ఇవి రెండూ కేవలం సంకేతాలు. ధ్యానం చేసేటపుడు మన ఇంద్రియాలూ మనస్సూ అటూ ఇటూ ప్రసరించి బహిర్ముఖం కాకుండా పోవటానికి సంకేతం దిగ్బంధమైతే అవి అంతర్ముఖమై పరమాత్మ వైపు మళ్లటానికి సంకేతం దిగ్విమోకం - అప్పుడు అన్ని దిక్కులలో పరమాత్మే మనకు గోచరిస్తాడు.

ఇది అయిన తరువాత ఆ పరాదేవతా స్వరూపాన్ని మనసా ఎలా భావించాలో ధ్యాన శ్లోకం మనకు బయట పెడుతుంది. అది వాచా ఉచ్చరిస్తున్నా మనసా దాని అర్థాన్ని భావన చేస్తూ పోవాలి. నిర్గుణమైన తత్త్వాన్ని సగుణ భూమికకు తెచ్చి దాన్ని మనోనేత్రంతో దర్శించాలి. ఎలాగ.

**ముక్తా విద్రుమ హేమ నీల ధవళ చ్ఛాయై ర్ముఖై స్త్రీక్షణై**

**ర్యుక్తా మిందుని బద్ధ రత్న మకుటాం తత్త్వార్థ వర్ణాత్మికామ్**

**గాయత్రీం వరదా భయాంకుశ కశాః శుభ్రం కపాలం గదామ్**

**శంఖం చక్ర మథార విందయుగళం హస్తై ర్వహంతీం భజే -**

ఆ గాయత్రీ దేవతను నేను భజిస్తాను. ఎలాటి గాయత్రీ అంటే యుక్తాం. వీటన్నిటితో కూడు కొని ఉన్న దామూర్తి. ఏమిటివి. ముక్తా విద్రుమ హేమ నీల ధవళ చ్ఛాయై ర్ముఖైః - అయిదున్నాయా విడకు ముఖాలు. ఆ ముఖాలొకటి ముత్యం. ఒకటి పగడం. ఒకటి బంగారం. మరొకటి నీలం. నల్లరాయి. ఇంకొకటి ధవళం - తెల్లరాయి. అంటే వజ్రం. ఈ అయిదు రంగుల్లో ఉన్నాయి. ఈ అయిదూ పృధి వ్యాది పంచభూతాలకు సంకేతాలు. పంచభూతాలే పంచముఖాలు గాయత్రికి. ముఖమంటే ద్వారం. ఈ పంచ భూతాల ద్వారా ఆ పరాశక్తి వైఖరీ రూపంగా మనకు ప్రకటమై కనిపిస్తున్నది. కాబట్టి వీటి నామె ముఖాలుగా భావించి వర్ణించారు పెద్దలు. త్రీక్షణైః మూడు నేత్రాలా విడకు. ఇదీ సంకేతమే. మనోబుద్ధ్యహం కారాలే నేత్రాలు. కాగా బాహ్యంగా కనిపించే అయిదు భూతాలూ ఆభ్యంతరంగా వాటిని కనే మూడు దృష్టులూ - అయిదూ మూడూ కలిసి ఎనిమిది. వాటినే అష్టమూర్తులన్నారు. అమ్మవారి కష్టమూర్తి అవి ఒక నామం. అష్టమూర్తి రజా జైత్రీ. ఆ మాటకు వస్తే

గాయత్రీ దక్షిణామూర్తిః అని కూడా ఉన్నాయా విడ నామాలు. దక్షిణామూర్తి అయ్యాగారే గాదు. అమ్మవారు కూడా. శివశక్తులకు భేదం లేదు గదా.

ఇలా అష్టమూర్తులతో సాక్షాత్కరిస్తున్నదా దేవత. అంతే కాదు. ఇందు నిబద్ధ రత్న మకుటాం. ఒక రత్న కిరీటం కూడా ఉందమ్మ వారికి. చంద్ర కళావతంసే అన్నారు. చంద్రకళే ఆ కిరీటం. చంద్రుడంటే మనస్సు. దానికి పదహారు కళలు. అందులో పదిహేను అమావాస్యతో సమసిపోతాయి. ప్రాపంచిక వృత్తులే అవి. కాని ఒకటి మాత్రమలా నశించదు. అది చిత్కళ. బ్రహ్మాకార వృత్తి అని భావం. బ్రహ్మమెలా పోదో అలాగే దాని జ్ఞానం కూడా పోదు. బ్రహ్మ స్వరూపమే గదా అది. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ అనే గీతా వాక్యానికిదే వివక్షితం. కనుకనే అవి పంచదశి అయితే ఇది షోడశి నిత్య ధ్రువ అని వర్ణించింది నామావళి. పోతే తత్త్వార్థ వర్ణాత్మికామ్. వర్ణమనే మాటకు రెండర్థాలున్నాయి. శరీరచ్ఛాయా వర్ణమే. అక్షరమూ వర్ణమే. అక్షరాలెన్ని. చతుర్విం శత్యక్షరా. 24 అక్షరాలు గదా గాయత్రీ ఛందస్సుకు. అవే ఆవిడ వర్ణం. ఆకృతి. అక్షరమెప్పుడూ అక్షరమైన తత్త్వాన్ని మనకు బోధిస్తుంది. కనుకనే తత్త్వార్థ వర్ణాత్మిక ఆవిడ. బ్రహ్మ తత్త్వాన్ని మనకు గుర్తు చేసే అకారాది వర్ణాలే వున్నాయో అవే శరీరాకృతిగా ఉన్నదా శక్తి. శక్తి మూలంగానే గదా శివతత్త్వం మనకు స్ఫురిస్తుంది.

ఇంక వరదా భయాంకుశ కశాః శుభ్రం కపాలం గదాం శంఖం చక్రం అధారవింద యుగళం. హస్తైర్వహం తీమ్. అష్ట భుజ ఆవిడ. అష్ట భుజాలతోనూ అష్టాయుధాలు ధరించి ఉంది. ఎనిమిది దివ్యాయుధాలు. ఏవవి. ఒకటి అంకుశం. మరొకటి కశ. అంటే పాశం. రాగస్వరూప పాశాఢ్యా – క్రోధాకారాంకు కుశోజ్జ్వలా అని గదా నామాలు. పాశాంకుశా లేవోగా వప్పటికి. రాగద్వేషాలే. అవే ఆయుధాల రూపంగా ఆవిడ చేతిలో ఉన్నాయి. మూడవది శుభ్రం కపాలం స్వచ్ఛమైన తెల్లని నర కపాలం. కపాల కుండల గదా ఆవిడ. కపాలం ప్రాణ శక్తికి సంకేతం. గదాం గద్ అనేధాతువుకు మాటాడటమని అర్థం. గదతి అంటే వదతి. గద వాక్కుకు సంకేతం. శంఖమంటే చెవులకు సంకేతం. చక్రం. చక్రం లాగా తిరగేది మనస్సు. అధ అరవింద యుగళం – రెండు అరవిందాలు. కమలాలు ఆవిడ నేత్రాలు. మొత్తం మీద వాక్కు ప్రాణం మనస్సు శ్రోత్రం నేత్రం. ఇందులో మనః ప్రాణాలు సూక్ష్మ శరీరం. జీవుడి కుపాధి. వాటి నౌకర్లు శ్రోత్రం నేత్రాదులు జ్ఞానేంద్రియాలు వాగాదులు కర్మేంద్రియాలు. వెరసి ద్వాద శేంద్రియాలూ కలిసి వచ్చాయి ఈ వర్ణనలో.

ఇవన్నీ ఇప్పుడా మహాశక్తి చేతుల్లో ఉన్నాయంటే ఏమిటర్థం. వాటిని మనమీద ప్రయోగించనూ గలదు. ఉపసంహరించనూ గలదు. ప్రయోగిస్తే సంసారంలో వచ్చి పడతాం. ఉపసంహరిస్తే సాయుజ్య సుఖమను భవిస్తాం.

రాగద్వేషాలనే ద్వంద్వాలు వదలకుండా నీవే పని చేసినా నీమీద ప్రయోగిస్తుందా ఆయుధాలు. దానితో నీవు సంసార సాగరంలో పడిపోతావు. రాగద్వేషాలకు స్వస్తి చెప్పి ఇంద్రియాలతో ఏ పని చేసినా వాటి ఫలితం నీకంటదు. ప్రమాదం లేదు. రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్ అని భగవద్గీత చెప్పిన మాటలోని ఆంతర్యమిదే. రాగద్వేషాలు లేకుండా నీవు జీవితం సాగిస్తే అప్పు డైహికమైన అర్థ కామాల వైపు పోదు నీ దృష్టి. ఆముష్మికమైన ధర్మం లేదా మోక్ష పురుషార్థం వైపే మళ్లుతుంది. అందులో ధర్మం వైపు ప్రయాణం చేశావో వరదాం. వరద అవుతుందావిడ నీకు. కావలసిన ఆయురారోగ్య ధనధాన్య సుఖ సంతోషాలన్నీ ప్రసాదిస్తుంది. లేక మోక్షమే కావాలనే కోరిక ఉందా నీకు. అభయాం. ఏ భయమూ లేకుండా చేస్తుంది ఇందులో వరదా అనేది ధర్మానికీ అభయా అనేది మోక్షానికీ సంకేతాలు. మొత్తానికివి రాగద్వేషాలనే ద్వంద్వాల అధీనంలో ఉంటే ఆ ద్వంద్వాలు రెండూ ఆ మహాశక్తి అధీనంలో ఉన్నాయి.

అంచేత భజే. దాన్నే నమ్ముకొని సేవిస్తూ పోవాలి మనం. ఆవిడ అనుగ్రహానికి పాత్రులమై ఇటు ఐహికమైన భోగమూ అటు ఆముష్మికమైన అపవర్గమూ పడయ గల మెప్పటికైనా. అయితే ఈ భజించటం కూడా ఏదో గాదు. సూర్య ప్రకాశ రూపంలో కనిపించేదా చైతన్య ప్రకాశమే కాబట్టి సూర్యోప స్థానం చేస్తే గాయత్రీ ఉపస్థానం చేసినట్టే. ఆ భావనతో

చేయటమే భజే అనే మాట కర్థం. ఎలా చేయాలా ఉపస్థానం. ఉపస్థానమంటే భజనమే. ఎలాగా అది. మూడు విధాలది. ప్రాతర్మధ్యాహ్న సాయాహ్నాలనే మూడు సంధ్యలు గదా అవి. అంచేత మూడు సంధ్యలలో సూర్య భగవానుడు మూడు రూపాల్లో దర్శనమిస్తుంటే మూడు మంత్రాలు జపిస్తూ తద్వారా ఆ దివ్య చైతన్య ప్రకాశాన్ని మనసులో నింపుకోవాలి మనం. అదే నిజమైన ఉపస్థానం. పోతే మూడు కాలాలకూ మూడు మంత్రాలున్నాయి మనం పఠించవలసినవి.

ప్రాతః కాలంలో సూర్యుడి పేరు మిత్రుడు. మధ్యాహ్న కాలంలో సవిత. సాయంకాలంలో వరుణుడు. వరుణుడెవడో గాదప్పటికి మిత్రుడే. అందుకే మిత్రావరుణ అని ఒకే ఒక దేవతగా పేర్కొన్నారు పురాణాల్లో. మిత్రా వరుణుడి కుమారుడే మైత్రావరుణి. వషిష్ఠుడు. అగస్త్యుడు. వీరిద్దరికీ మైత్రావరుణి అని పేరు. వారి అంశలో జన్మించారు. మిత్రుడయ్యాడట సూర్యభగవానుడు ప్రాతః కాలంలో లోకానికి. లోక బాంధవుడని జగన్మిత్రుడని అందుకే పేరు వచ్చింది. ఆయన ఉదయించినప్పుడే మనకు జీవితమనేది సాగుతున్నది. అన్ని వ్యవహారాలూ చేయగలుగుతాము. కండ్లు తెరవగలగుతా మసలు. సృష్టి ఆయన వల్లనే ఇలా జరుగుతున్నది గనుక మనకాయన మిత్రుడయ్యాడు. మైత్రి అంటే అసలు శబ్దార్థం కలుసు కోటమని. మొట్టమొదటి సారిగా మన మాయనను కలుసుకొన్నాము. ఆయన మనలను కలుసుకొంటున్నాడు. తరువాత మనకాయన సవిత.

తేజస్సునూ జలాన్నీ వర్షించి మనస్థితిని మధ్యాహ్న కాలంలో కాపాడుతున్నాడు. తరువాత సాయంకాలమూ సూర్యుడే వరుణుడవు తాడు మన పాలిటికి. వరుణ వరణ రెండూ ఒకటే. ఆవరించటమని అర్ధం. తన తేజస్సు కప్పి పుచ్చి మనకు కనపడకుండా అస్తమిస్తున్నాడు. అంచేత వరుణుడయ్యా డాయన. మొదటిది సృష్టి. రెండవది స్థితి. మూడవది లయం. సూర్య మండల మనే ఉపాధి ద్వారా ఈ సృష్టి స్థితి లయాలు సాగిస్తున్నదా మహాశక్తే. దీని ద్వారా అను దితా న స్తమితమైన తన చైతన్య ప్రకాశాన్ని మనకు గుర్తు చేసి దాన్ని భజించండి బాగు పడతారని బోధించటమే దీనిలో మర్మం. ఈ దృష్టితో మంత్రాల కర్ధం చెప్పుకొంటూ పోదాము.

**- ప్రాతః కాల మంత్రం -**

**మిత్రస్య చర్షణీ ధృతః - శ్రవో దేవస్య సానసిమ్ - సత్యం**

**చిత్ర శ్రవస్తమమ్ - మిత్రో జనాన్ యాతయతి ప్రజానన్-**

**మిత్రో దా ధార పృథివీ ముత ద్యామ్ - మిత్రః కృష్టీ రనిమిషా**

**భి చష్టే - సత్యాయ హవ్యం ఘృత వద్విధేమ - ప్రస మిత్ర**

**మర్తో అస్తు ప్రయస్వాన్ - యస్త ఆదిత్య శిక్షతి ప్రతేన -**

**న హన్యతే న జీయతే - త్వోతో నైన మగ్ం హో అశ్నోత్యం**

**తితోన దూరాత్ -**

మిత్రస్య దేవస్య – మిత్రుడే మా పాలికి దేవుడు. దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉదయిస్తూ సూర్యుడు మమ్మూ – మేమూ సూర్యుణ్ణీ కలుసుకొంటున్నాం. మిత్రుడు గాక మరెవరాయన. చర్షణీ ధృతః మాకే గాదు భూమి మీద చరించే ప్రాణులందరినీ ధరించి ఉన్నాడాయన. ఆయన వెలుగు జీవకోటి లోపల ప్రవేశించి ప్రాణ రూపంగా వారిని ధరించి ఉంది. బయట ప్రకాశాన్ని ఇచ్చి దానిలో వారిని నడుపుతున్నది. శ్రవోదేవస్య సానసిం – ఆయన కీర్తిని మేమందు వల్లనే కీర్తిస్తాము. ఎలాంటిదా కీర్తి. సత్యం ఎప్పటికీ నిలిచి ఉండేది. చిత్ర శ్రవస్తమం – చిత్ర విచిత్రంగా భాసించేది. చిత్రమంటే Multi colour అన్ని రంగుల కలయిక. తెలుపు మొదలు నలుపు వరకు ఏడు రంగులూ ఎక్కడ ఉన్నాయి. సూర్యుడిలోనే గదా. అదే గదా ఇంద్రధనుస్సుగా బయట పడేది. అందుకే సప్తాశ్వుడన్నారు సూర్యుణ్ణి. ఆ సూర్యుడి వల్లనే బ్రతికి బట్ట కడుతున్నాము. మనకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే జాగ్రదవస్థలోనే గదా. అది సూర్య ప్రకాశంలోనే గదా. స్వప్న సుషుప్తులలో అందరూ సమానమే.

మిత్రో జనాన్ యాత యతి ప్రజానన్. అంతేగాదు. మిత్రుడు గనుకనే ఆయన మనకు మార్గదర్శకుడు. జనులందరినీ యాత యతి – నడుపుతున్నాడు. నడపాలంటే నడిపేవాడికి తెలివి తేటలుండాలి. మార్గమూ గమ్యమూ అన్నీ తెలిసి ఉండాలి. ప్రజానన్ ఆయన అన్నీ

తెలిసినవాడే. అంటే తాను మేలుకొని మనల నందరినీ మేలుకొలిపి మన జీవితాలను నడుపుతున్నది సూర్యుడే. అది కేవలం భౌతికమైన మండలం గదా. మనకు మిత్రుడేమిటి మన జీవితాలను నడపట మేమిటంటా రేమో. మండలం భౌతికమైతే మండలాంతర్గమైన శక్తి ఒకటుంది. అది దేవత అని చెప్పాము. అవి కూడా చిచ్ఛక్తి కుపాధులేనని కూడా పేర్కొన్నాము. అది మరచిపోరాదు మనమెప్పుడూ. అంచేత సర్వ స్వతంత్రమైన ఆ చైతన్య దీప్తే ఆదిత్య దీప్తిగా అభివ్యక్తమై మనకొక మిత్రుడిలాగా తోడ్పడుతున్నదని అంతరార్థం. ప్రజ్ఞానం బ్రహ్మ అన్నట్టు ఆయన ప్రజ్ఞాన స్వరూపుడు. కనుక ఆ జ్ఞానంతోనే నడుపుతున్నాడు మనలను.

మిత్రో దా ధార పృధివీ ముతద్యామ్. ఆ మిత్రుడే దా ధార - ధరించి ఉన్నాడు. దేనిని. పృధివీ ముత ద్యామ్ - ఈ భూమిని ఆ ఆకాశాన్ని రెండింటినీ. ద్యావాపృధివీ. భూమ్యాకాశాలను రెంటినీ విభజించి చూపుతున్నాడు. అక్కడ ఉండే గోళాలన్నీ ఆయన చుట్టూ తిరుగుతున్నాయి. ఇక్కడ భూమి కూడా ఆయన చుట్టే తిరుగుతున్నది. వీటిని తిప్పుతున్నది ఆ సూర్యుడే. ఆయన ఆకర్షణ లేకుంటే ఇవి ఇరుసు మీద ఆకులలాగా ఒక పరిధిలోనే తిరిగే అవకాశం లేదు. అంచేత వీటిని ధరిస్తున్నదా సూర్యుడే. మిత్రః కృష్టీ రనిమిషా అభిచష్టే. అనిమిషా ఎల్లప్పుడూ అభిచష్టే గమనిస్తూ ఉన్నాడు. ఏమిటి కృష్టీః - మనం చేసే సకల కర్మలూ. ఆయన

వెలుగులోనే గదా మనసా వాచా కాయేన మనమే కర్మ చేసినా చేస్తున్నాం. అందుకే ఆయనకు కర్మ సాక్షి అని కూడా పేరు వచ్చింది. తాను చేయకుండా తన వెలుగులో మనం చేస్తుంటే చూస్తున్నాడని అర్థం. అందుకే జగచ్చక్షువూ కర్మసాక్షీ  అయ్యాడాయన.

సత్యాయ హవ్యం ఘృతవ ద్విధేమ. ఆ సత్య స్వరూపుడైన  సూర్య భగవానుడికి  కావలసిన హోమ  ద్రవ్యాలన్నింటినీ  ఘృతవత్ నేతిలో ముంచి - ఆజ్యమన్నింటినీ పవిత్రం చేస్తుంది గనుక తత్పురస్సరంగా విధేమ సమర్పిస్తాం. ఏదైనా  అగ్నిలోనే హోమం చేయాలి. సూర్య తేజస్సే అగ్ని. అదే  మనకీ  ప్రాణమిచ్చింది. మనసిచ్చింది. కనుక ఈ మనః ప్రాణాలు నీవే సుమా అని దానికే సమర్పించటం మరలా.  అందులో హవ్యం  మనస్సూ ఘృతం ప్రాణం. వీటి వ్యాపారాలన్నీ ఏ సౌర తేజస్సు వల్ల కలుగుతున్నాయో అవి మన సొంత మను కోకుండా దానికే సమర్పించాలి. సొంతమనుకొంటే మనం దానికి బద్ధుల మవుతాము. సమర్పిస్తే బంధ విముక్తుల మవుతాము. అయితే అది బద్ధం  కాదా అంటే కాదు. అది సత్యం  అంటే సత్య స్వరూపుడైన పరమాత్మే కనుక దానికి బంధ మోక్షాల ప్రసక్తే లేదు. నిత్యముక్తమది. దాని సగుణమైన ఉపాధే ఈ సౌరమండలం.  అప్పటికి మన తను మనః ప్రాణాలన్నీ భగవ దంకితం చేయాలని తాత్పర్యం.

ప్రసమిత్ర మర్తో అస్తు ప్రయస్వాన్. మిత్ర ఓ సూర్య భగవన్. సమర్తః అలా చేసిన ఆ మానవుడు. అస్తు ఇలా ఉండు గాక. ఎలా. అన్ని సత్కర్మల ఫలాన్ని అనుభవించుగాక. ప్రతి ఒక్కడూ చేసే సత్కర్మకు ఫలితమివ్వ వలసిందెవరు. ఆ పరమాత్మే గదా. ఆ పరమాత్మే. సూర్య రూపంగా మనకా ఫలిత మంద జేస్తున్నాడు. పగలంతా మనం కష్టపడి పనిచేస్తే అనంతరం దానివల్ల కలిగే లాభాన్ని పొందుతున్నామా లేదా. దానికి దోహదం చేసేది సూర్య ప్రకాశమే గదా. అదే మనకు ఫలమిస్తున్న దంటే తద్వారా ఫలదాత పరమాత్మే ననుకోండి.

యుస్త ఆదిత్య శిక్షతి వ్రతేన - ఇదంతా పరమాత్మ ప్రసాదమనే భావనతో ఉన్నప్పుడే నీకది అనుకూలంగా ఫలిస్తుంది. అందుకే చెబుతున్నాడు. యః ఎవడైతే ఆదిత్య ఓ ఆదిత్యా తే వ్రతే న శిక్షతి - నీ వ్రతంలో శిక్షణ పొందుతుంటాడో. అంటే ఇలాటి నిఃస్వార్ధ బుద్ధితో జీవిస్తాడో. ఆదిత్య - ఓ ఆదిత్యా - త్వోతః నీ చేత రక్షితుడు వాడు. ఆదిత్యుడవు గదా నీవు. అంచేత తప్పక రక్షిస్తావు. ఆదిత్య అంటే దగ్గరికి తీసుకొనే వాడని సత్ఫలితాన్ని అందించే వాడని రెండూ అర్థమే. ఆ దాన ప్రదానాలు రెండూ చేసి మనలను కాపాడుతాడని భావం.

నహన్యతే న జీయతే - ఎవడిని నీవలా కాపాడుతావో వాడు జీవితంలో దెబ్బ తినడు. నజీయతే. వాడి నెవడూ జయించలేడు. ఎప్పుడూ

ఏ విషయంలోనూ పరాజయం పాలు కాడు. అంతే కాదు. నైన మం హో అశ్నోతి. వాడినే పాపమూ అంటదు. పాపమనేది వాడి దరిదాపులకు రాదు. అంటే దురాలోచన మనసుకు రాదు. దుష్ప్రవర్తన అసలే ఉండదు. అంతితో న దూరాత్. దగ్గరి నుంచే కాదు. దూరం నుంచీ వచ్చి పడదు వాడి మీద. దగ్గర అంటే ఇహం దూరమంటే పరం. దగ్గర అంటే వర్తమానం. దూరమంటే భూత భవిష్యత్తులు. ఇహ పరాల్లో గాని భూత భవిష్యద్వర్త మానాల్లో గాని దేశకాలాల్లో ఎక్కడా ఎప్పుడూ వాడికి కీడు మూడదు. అంటే సంచి తాగామి కర్మలూ వాటి ఫలంగా ప్రాప్తించే స్వర్గ నరకాది సుఖదుఃఖాను భవాలూ వాడికి ప్రాప్తించవు. ఎవడా వాడు. ఆదిత్య వ్రతాన్ని పాటిస్తూ ఏమర కుండా జీవితాన్ని సాగించేవాడు. అంటే అర్థం. పరమాత్మ భావనతో నిత్యమూ బ్రతికే సాధకుడు. వీడాదిత్య దేవతో పాసన చేస్తే దేవాన్ భావయ తానేన తేదేవా భావయంతువః అని ఇటు ఐహికమైన భోగ భాగ్యాలైనా అనుభవించవచ్చు. లేక తద్రూపంగా భాసిస్తున్న పరా దేవతేనని దాన్ని తన కనన్యంగా భావించి తదేక ధ్యానంతో జీవితం సాగించినా సాగించవచ్చు. చివరకు మోక్ష సుఖాన్నే అనుభవించ గలడు.

### మధ్యాహ్న కాల మంత్రం

**ఆసత్యేన రజసా వర్తమానో నివేశయన్ అమృతం మర్త్యంచ -**

**హిరణ్య యేన సవితా ర ధేనా - దేవో యాతి భువనా వి**

**పశ్యన్ - ఉద్వయం తమ స స్పరి పశ్యంతో జ్యోతి రుత్తరమ్ - దేవం దేవత్రా సూర్య మగన్మ జ్యోతి రుత్తమం ఉదుత్యం జాత వేదసం - దేవం వహంతి కేతవః - దృశే విశ్వాయ సత్యం చిత్రం దేవానా ముదగా దనీకం - చక్షు ర్మిత్రస్య వరుణస్యాగ్నే రాప్రాద్యావా పృథివీ అంత రిక్షగీం - సూర్య ఆత్మా జగతః తస్థుషశ్చ - తచ్చక్షు ర్దేవహితం - పురస్తా చ్ఛుక్రము చ్చరత్ - పశ్యేమ శరద శ్శతం - జీవేమ శరద శ్శతం - నందామ శరద శ్శతం మోదామ శరద శ్శతం - భవామ శరద శ్శతం - శృణ వామ శరదశ్శతం - ప్రబ్రవామ శరద శ్శత - మజీతాః స్యామ శరద శ్శతం - జ్యోక్చ సూర్యం దృశే - య ఉదగా న్మహతోర్ణ వా - ద్విభ్రాజ మాన - స్సరిరస్య మధ్యా - త్సమా వృషభో రోహితాక్ష సూర్యో విపశ్చి న్మనసా పునాతు -**

మధ్యాహ్న మంత్రమిది. ఇప్పుడాయన మిత్రుడు మాత్రమే గాదు. సవిత అని చెప్పాము. సవిత అంటే ప్రసవించే గుణమున్న వాడు. అంటే మనకు ప్రసాదిస్తుంటాడు. ఏమిటి. ఒకటి గాదు. మూడు. మొదటిది వెలుగు. రెండు జలం. మూడు పాడి పంటలు. మనకు కావలసిన ఆహారం. ఇది ఆయన ఎక్కడో ఒకచోట స్థావరంగా ఉండి కూడా కాదు. జంగమంగా

సంచరిస్తూ. ఏమిటి ఎలా సంచరిస్తుంటాడు. ఆ సత్యేన రజసా ఇటు నుంచి అటు ప్రయాణిస్తుంటా దాకాశ మార్గంలో హిరణ్యయేన రథేన. బంగారు రథంలో తిరుగుతుంటాడట. బంగారు రథమా తళ తళ మెరిసే ఆయన మండలమే. భౌతికమైన మండలం వాహన మనుకొంటే దాని నధిష్ఠించిన దేవత సూర్య భగవానుడు. సూర్య భగవానుడేమో ఆ రథంలో కూచొని ఉన్నాడు రథికుడు. సూర్యమండల మాయన ఎక్కి కూచున్న రథం. అది బంగారు వన్నెతో ప్రకాశిస్తున్నది. సత్యేన. అది ఎప్పుడూ ఉంటుంది ఎప్పుడూ. తిరుగుతూనే ఉంటుంది. సూర్యుడు తిరగడు. గ్రహాలే గదా ఆయన చుట్టూ తిరుగుతాయంటారు ఈనాటి శాస్త్రజ్ఞులు. నిజమే. ఈనాటి శాస్త్రజ్ఞులే మరలా ఏమంటున్నారో తెలుసా. అసలు తిరగని పదార్థమంటూ ఏదీ లేదు. అణువు మొదలు ఆకాశం వరకూ అన్నీ పరిభ్రమిస్తూన్నవే. సృష్టిలో పరమాణువు అతివేగంగా తిరుగుతున్నదని ఆకాశం కూడా ఇంకా పెరిగి పోతున్నదని వీరే అంటున్నారా లేదా. అంచేత వేద ఋషులు ఆ రోజుల్లోనే ఈ సత్యం బయట పెట్టారంటే ఎంత గొప్పో చెప్పండి.

కాబట్టి సత్యమంటే ఎప్పుడూ ఉండేదే గాక ఎప్పుడూ దెబ్బ తినదు. కుంఠితం కాదట ఆరథం. రజసా – కదులుతూనే ఉంటుందది ఎప్పుడూ. నిరంతరం ప్రయాణం చేస్తూనే ఉంటుంది గదా. ఆ వర్త మానః – దానిలో కూచొని రాకపోకలు చేస్తూనే ఉంటుందా దేవత. సౌర ప్రకాశ రూపంగా

చరిస్తున్న పరమాత్మ అని భావం. ఇదే అనేజ దేకం మనసో జవీయః అని ఉపనిషత్తు కూడా చాటుతున్నది భావం. పోతే నివేశయన్. ఎక్కడ ఉండ వలసిన దాని నక్కడ ఉంచుతుంటాడు. ఏమిటది. అమృతం మర్త్యంచ. స్థావర జంగమాలని అర్థం. మర్త్యమంటే కదలకుండా పడి ఉండేది. అది స్థావరం. అమృతమంటే దానికి ప్రతి లోమంగా కదులుతూ మెదులుతూ ఉండేదని అర్థం. లేదా దేవలోకంలో ఉండే వారంతా అమృతులు. మర్త్య లోక వాసులంతా మృతులూ. ఈ రెండు లోకాలకూ మధ్యలో ప్రయాణం చేస్తున్నాడా సవిత. వీరినీ వారినీ దూరంగా విభజించి చూపుతున్నాడని కూడా చెప్పవచ్చు.

**దేవోయాతి భువనా విపశ్యన్.**

తాను సృష్టించిన ప్రాణులందరినీ వారి వారి లోకాల్లో వారు చేసే పనులను బాగా గమనిస్తూ తిరుగుతున్నాడట ఆయనగారు ఉదయాస్త మయాలూ. ఉద్వయం తమసః స్పరిపశ్యంతో జ్యోతి రుత్తరం. అలాంటి శ్రేష్ఠమైన తేజస్సును మేము మా తలలు పైకెత్తి అంధకారాని కావల వెలుగుతున్న దాన్ని చూడ గోరుతున్నాము. ఇక్కడ మధ్యాహ్న సూర్యుడు గనుక తల పైకెత్తి చూస్తేగాని కనపడడు. అప్పుడంధ కార మనే దాని గంధం కూడా ఉండదు. కారణం జగత్తంతా వెలుగే వ్యాపించి ఉంటుంది. చీకటి అంటే ఇక్కడ నామరూపాత్మకమైన ప్రపంచమే. అది అజ్ఞాన జన్యం.

అజ్ఞానమే అసలైన చీకటి. దాన్ని దాటిపోతే ఉన్నది జ్ఞానమే. అప్పుడిక అజ్ఞానమెక్కడిది. ప్రపంచమంతా బ్రహ్మ చైతన్య ప్రకాశంతో నిండి ఉంటుంది. అయితే అది మనం తలలు పైకెత్తి చూడాలి అంటే నామరూపాల కతీతంగా విలక్షణంగా దర్శించాలని భావం.

ఎలాంటిదా ప్రకాశమంటే వర్ణిస్తున్నాడు. దేవం దేవత్రా సూర్య మగన్మ జ్యోతి రుత్తమం. దేవ అంటే ప్రకాశం. దేవత్రా మిగతా తేజస్సులన్నింటిలో విలక్షణంగా ప్రకాశించేది. ఉత్తమమైన తేజస్సు. సౌర ప్రకాశంగా కనిపిస్తున్న దదే వాస్తవానికి. దాన్నే మేము శరణు వేడుతున్నాము. వరేణ్యం భర్గః అని గదా మంత్రం పేర్కొన్నది అంచేత అదే వరేణ్యం వరణీయం మనకు. ఉదుత్యం జాత వేదసం దేవం వహంతి కే తవః – ఆ సూర్యమండలంలో అభివ్యక్తమైన తేజస్సునే ఉద్వహంతి. మోసుకొని వస్తున్నాయి. ఏమిటవి. కేతవః దాని కిరణాలు. కిరణమంటే సర్వత్రా చెల్లా చెదరయిన వని అర్థం. అవి ఆకాశంలో ఒకచోట రాశీభూతమయి ఉన్న తేజో మండలాన్ని మనదాకా పట్టుకొని వస్తున్నాయా లేదా. అదే మోసుకు రావటమంటే. జాత వేదసం – అంటే అగ్నిహోత్రం. సాయంకాల మస్తమించేటపుడా కాంతినీ కిరణాలు తీసుకు వచ్చి అగ్నిలో ప్రవేశ పెడతాయని అర్థం. ఎందుకోసం. దృశే విశ్వాయ సూర్యం – సమస్త పదార్థాలనూ చూడాలి గదా మానవుడు. ఎలా చూస్తాడు వెలుగు లేకపోతే.

అందుకోసం. పగలు సూర్యుడి ద్వారా అయితే రాత్రి కాల మాయనకు ప్రతినిధి అయిన అగ్ని ద్వారా. చిత్రం దేవానా ముదగా దనీకం - అందుకోసమే చిత్ర విచిత్రమైన వర్ణాల సమూహంగా కాంతి కిరణాలన్నీ ఒక మండలంగా ఏర్పడి ఉదయిస్తున్నది ప్రతి దినమూ. చక్షు ర్మిత్రస్య వరుణస్య అగ్నేః అసలు సూర్యుడేమిటి వరుణుడేమిటి. అగ్ని ఏమిటి. అంతా ఒక్కటే.

ఆ ప్రాద్యావా పృథివీ అంతరిక్షగ్ం సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ - అంతటా వ్యాపిస్తున్న దొకే తేజస్సని చెప్పాము. ఏమిటి. ఎక్కడ. ద్యావా పృథివీ అంతరిక్షం. ఆకాశమూ భూమి రెండింటి నడుమా ఉన్న అంతరిక్షం. దాన్నే రోదసి అంటారు. ఈ మూడు ప్రదేశాలనూ మూడు రూపాలలో వ్యాపించి ఉందది. పృథ్విలో అగ్ని రూపంగా. అంతరిక్షంలో సూర్య రూపంగా. ఆకాశంలో వరుణ రూపంగా. వసురు ద్రాదిత్యులంటే వీరే. ఆకాశంలో చాలా దూరం వెళ్లిపోతే అక్కడ ఆ ప్రకాశం వరుణ అవుతుంది. ఆవృతమవుతుంది. Black holes అవేనేమో. అయినా అవి కూడా ఉన్నాయి గదా. ఉంటే స్ఫురిస్తుంటాయి గదా. అస్తి ఉంటే భాతి ఉన్నట్టే. లేకుంటే అస్తిత్వానికి ప్రమాణం లేదు.

అసలిదంతా బాహ్యార్థమే. అంతరార్థం చెప్పుకొన్నా మంటే మండలం స్వరూప స్థితి. కిరణాలు నామరూప క్రియలు. దృశే విశ్వాయ. అవి మనకు

తోడ్పడుతున్నాయి మరలా ఆ మూల తత్త్వాన్ని దర్శించటానికి. ఎక్కడ ఉందది. పరోక్షంగా వరుణ గుప్తమయి పోయింది. అలాటి దాన్ని ప్రత్యక్షం చేసుకొని చూడవలసి ఉంది మనం. అప్పుడు సర్వత్రా అదేనని స్వానుభవానికి వస్తుంది. తచ్చక్షు ర్దే వహితం పురస్తా చ్ఛుక్ర ముచ్చరత్. దేవతలు మన ఇంద్రియాలు. అవి వాటి వాటి పనులు యధావిధిగా చేయాలంటే ఒక తేజస్సుండాలి. అది బాహ్యమైతే సౌర తేజస్సు. ఆంతరమైతే జ్ఞాన తేజస్సు. దేవ హితం. ఇంద్రియ ప్రాణ మనో బుద్ధులన్నిటికీ హితమైనదది. సమస్త వ్యాపారాలనూ నడుపుతున్నదదే. పురస్తా చ్ఛుక్ర ముచ్చరత్. పురస్తాత్ అంటే తూర్పున ప్రతి దినమూ ఉదయిస్తున్నదా శుభ్రమైన ప్రకాశమే. పురస్తాత్తంటే తూర్పునే గాక మన చక్షురాదీంద్రియాల నన్నింటినీ ముందుకు నడుపుతున్నదని కూడా అర్థం.

ఇంత ఉపకారం చేస్తున్నది గనుకనే ఆ ప్రకాశాన్ని మనం పశ్యేమ శరదశ్శతం నూరేండ్లూ దర్శిస్తుండాలి. జీవేమ శరదశ్శతం - దర్శిస్తూనే నూరేండ్లు జీవించాలి. సమష్టి రూపాన్ని ధ్యానిస్తూ బ్రతికితే ఆ బ్రతుకు సఫలం. వ్యష్టి మేరకే బ్రతకటమైతే అది నిష్ఫలం. నందామ శర దశ్శతం మోదామ శరద శ్శతం - బ్రతికినంత కాల మానందంగా ఉండాలి. పదిమందినీ ఆనందపరచాలి. భవామ శరదశ్శతం. దృఢంగా ఉండాలి మన ఉపాధి. శృణ వామ శరద శ్శతం. శరీర దార్ఢ్యం ఉంటేనే చెవులు పనిచేస్తాయి. ఎందుకు. భద్రం కర్ణేభిః శృణ వామ ఎప్పుడూ సద్విషయం

శ్రవణం చేయటానికి. ప్రబ్రవామ శరదశ్శతం – స్తోత్రా లనండి – సంకీర్తన లనండి. గోష్ఠులనండి మరి ప్రవచనా లనండి – నిత్యమూ సద్విషయమైన గోష్ఠి సాగిస్తూనే ఉండాలి మనం. అజీతాః స్యామ శరద శ్శతం – అంతే కాదు – ఈలోపుగా రోగాలు రొష్టులూ దుర్వార్తలూ అశుభాలూ ఏవీ మామీద దాడి చేయరాదు. అపజయం పాలు కాకుండా నిరాఘటంగా సాగిలి మా జీవితం.

జ్యోక్చ సూర్యం దృశే య ఉదగా న్మహ తోర్ణవాత్. కల కాలమూ మేమా సూర్య ప్రకాశాన్నే చూస్తుండాలవి మా కోరిక. ఎలా ఉందా మండలం. బ్రహ్మాండమైన ఒక సాగరంలో నుంచి పైకి లేస్తుంటుంది. తూర్పున ఒకటి పశ్చిమాన ఒకటి మన దేశానికి రెండు వైపులా ఉన్నాయి రెండు సముద్రాలు. తూర్పున గదా ఉదయిస్తాడు సూర్యుడు. అలా ఉదయిస్తున్నప్పుడు తూర్పున ఉన్న సముద్ర గర్భంలో నుంచి పైకి వస్తున్నట్టు తోస్తుంది. అస్తమించే టప్పుడు మరలా పడమట ఉన్న సముద్ర గర్భంలో పడి పోతున్నట్టు తోస్తుంది. ఆకాశ మొక బాణలి బోర్లించి నట్టు గదా కనిపిస్తుంది మన కంటికి. అలా ఉన్నప్పుడక్కడికి భూమి అంతమయినట్టు భావిస్తాము. భూమి అంతమైతే ఏముందక్కడ. సముద్రమే గదా. ఇక్కడ సముద్రమంటే మనకు కనపడని ప్రదేశమన్న మాట. కనపడని చోటు నుంచి వచ్చి కనపడని చోటుకు వెళ్లి పోతున్న దా బింబం. వచ్చేటప్పుడు బిభ్రాజ మాన స్సరిరస్యమధ్యాత్. సరిర మంటే సలిలమే.

రలయో రభేదః – సాగర జలం నుంచి దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉదగాత్ – పైకి వస్తుంటాడు. సమా వృష భో రోహి తాక్షః సూర్యో విపశ్చిత్ – అలాటి సూర్యుడు నన్ను మనసా పునాతు – నేనాయనను మనసా ధ్యానిస్తే పునాతు. పరిశుద్ధుణ్ణి చేయాలని కాంక్ష. మనసు మన దగ్గరే ఉంది కాబట్టి స్మరిస్తే చాలు. యఃస్మరే త్పుండరీ కాక్ష మన్నట్టు వెంటనే పరిశుద్ధులం కాగలం. పుండరీకాక్షు డెవరో గాదు. వాస్తవంలో పుండరీక వికాసానికి తోడ్పడే సూర్య భగవానుడే. వృషభః వర్ష తీతి వృషభః – వర్షించే స్వభావ మున్న వాడాయన. ఆయనే మనకు వెలుగునూ జలాన్ని ఆహారాన్ని ప్రసాదిస్తున్నాడు. రోహితాక్షుడు కూడా. రోహిత మంటే లోహితం. ఎరుపు రంగు. ఎఱ్ఱని వర్ణం మధ్యాహ్న సూర్యుణ్ణి సూచిస్తుంది. అలాటి చూపుతో మనలను చూస్తున్నాడు. ఎరుపు రజో గుణం. రజస్సు చలనాత్మకం. మన సమస్త వ్యాపారాలనూ కనిపెట్టి చూస్తుంటాడని భావన. సూర్యః అంటే ప్రేరకుడని అర్థం. అన్నింటినీ ప్రేరణ చేసే వాడాయనే. కారణం విపశ్చిత్. విపశ్చన లేదా విచక్షణ ఉన్న వాడాయన. కనుక చూడగలడు ప్రేరణ చేయగలడు మన మనోవాక్కాయ కర్మలన్నీ.

## సాయం సమయ మంత్రం

ప్రాభాతిక మయింది. మాధ్యాహ్నిక మయింది. ఇక మిగిలి పోయింది సాయాహ్నిక మంత్రం. అది చెబుతున్నారిప్పుడు.

**ఇమంమే వరుణ శ్రుధీ హవ - మద్యా చ మృడయ - త్వా మవస్యు**

**రాచకే - తత్వా యామి బ్రహ్మణా వందమాన - స్తదాశాస్తే**

**యాజమానో హవిర్భిః - అహేడ మానో వరుణేహ బోధ్యురు**

**శగ్ంస - మాన ఆయుః ప్రామోషీః యచ్చిద్ధితే విశో యథా**

**ప్రదేవ వరుణ వ్రతం మినీ మసి ద్యవిద్యవి - యత్కించేదం**

**వరుణ దైవ్యే జనే భి ద్రోహం మనుష్యా శ్చరా మసి - అచిత్తీ**

**యత్తవ ధర్మాయు యోపిమ - మానస్తస్మా దేనసో దేవ**

**రీరిషః - కితవాసో యద్రిపుర్న దీవి - యద్వా ఘా సత్యముత**

**యన్న విద్మ - సర్వాస్తా విష్య శిథి రేవ దేవాధాతే స్యామ**

**వరుణ ప్రియాసః -**

ఓ వరుణ రూపంలో ఉన్న సూర్య భగవన్ ఇమం మే హవం శ్రుధీ. దయ ఉంచి నా యీ మొర ఆలకించు. అద్యాచ మృడయ. ఆలకించి నన్ను వెంటనే విముక్తుణ్ణి చేయి. చేసి నన్ను సుఖ పెట్టు. త్వా మవస్యుః – ఆచకే. నన్ను కాపాడటం కోసం నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. తత్వాయామి బ్రహ్మణా వందమానః – బ్రహ్మ మంటే ఋగాది మంత్రాలు. వేద మంత్ర ముచ్చరిస్తూ నీకు వందనం చేస్తున్నాను. యజమానః నిన్నే భజిస్తున్నాను. హవిర్భిః నీ కోసమే ఆహుతి చేస్తున్నాను సమస్తమూ. ఎందుకోసం ఆశాస్తే యజనం చేసే వాడాసించే ఫలమే దుందో. దాన్ని పాటించాలని–

దేవాన్ భావయ తానేన తేదేవా భావయంతు వః అన్నట్టు మనం ప్రాపంచికమైన పదార్థాలన్నీ భక్తితో దేవతకు సమర్పిస్తే ఆ దేవత వాటికి మారుగా సుఖశాంతులు మనకు ప్రసాదిస్తుంది. ఇదీ మనకూ దేవతలకూ ఉన్న లావాదేవీ. అహేడ మనో వరుణ – కాబట్టి ఓవరుణ దేవా? అహేడమానః నన్ను నిర్లక్ష్యంగా చూడవద్దు. అన్నీ నీకు సమర్పించాను. ఉరు శంస. నీవు గొప్ప కీర్తి ప్రతిష్ఠ లున్న వాడవు. మానః ఆయుః ప్రమోషీః – మా ఆయుః ప్రమాణాన్ని దయచేసి తగ్గించవద్దు. బోధి. ఈ మాత్రం నీవు మా విషయం గుర్తుంచుకొంటే చాలు. నూరేండ్ల జీవితాన్ని సంపూర్ణంగా మాకు ప్రసాదించ గలవు. ప్రసాదిస్తే బ్రహ్మ జ్ఞానం గడించి మేము తరించగలం.

ద్యవి ద్యవి – ప్రతి దినమూ మినీ మసి. మేము లోపింప జేసి ఉండవచ్చు. ఏమిటి వరుణ వ్రతం – వరుణ దేవా నీ యెడల మేమవలంబించ వలసిన వ్రతాన్ని. దీక్షను. యచ్చిద్ధి – ఓ కొంచెం పాటించక పోయినా సరే మేమ పరాధులమే. విశో యథా. నౌకర్ల లాటి వాళ్ళం మేము. నీవు మా కధిపతి వైతే మేము మీకు దాసులం. దాసుని తప్పులు దండంతో సరి అన్నారు. యత్కించేదం వరుణ. అయ్యా వరుణ దేవా దైవ్యే జనే అభిద్రోహం మనుష్యా శ్చరామసి – మానవ మాత్రులం మేము. తెలిసో తెలియకో అపచారాలు చేస్తుంటాము. ప్రకృతి గుణాలు

మాచేత అలా చేయిస్తుంటాయి. త్రిగుణాధీనమైన బ్రతుకు బ్రతుకుతున్నాము. అంచేత దైవ శక్తులైన మీ విషయంలో ఏలాటి ద్రోహమైనా చేసి ఉండవచ్చు. మేము మానవులమూ మీరు మాకంటే గొప్పవారైన దేవతలని చూడక మాతోడి మానవులుగానే మిమ్ము భావించి తక్కువ చేసి చూడవచ్చు మిమ్ము. యత్కించేదం. అలాటి అపరాధమే కొంచెం చేసి ఉన్నా ఆచిత్తీ. అది తెలిసి గాదు. తెలియని అజ్ఞాన దోషం వల్లనే సుమా. యత్తవ ధర్మా యుయోపిమ – తన్నిమిత్తంగా మీ విషయంలో పాటించవలసిన ధర్మాలు మేము యధావిధిగా పాటించక వదిలేసి ఉండవచ్చు.

మానస్త స్మా దేన సో దేవ రీరిషః – అంత మాత్రం చేత మమ్ము దోషులుగా భావించి వదిలేయకు మహాత్మా. ఏనః అంటే పాపం. తెలియక చేసిన ఆ పాపానికి మమ్ము రాచి రంపాన పెట్టవద్దు. కిత వాసో యద్రిపుర్న – కితవాసః అంటే మోసగాళ్లు. మోసగాళ్లమై మేము యత్ – చేయదగిన పని ఏది చేయలేదో నదిని – చేయదగనిది ఏది చేశామో. సత్యం అసలు తెలిసి కూడా మంచి పని చేయటం లేదో నవిద్మ – మాకే మాత్రమూ జ్ఞానం లేదా విషయంలో. కనుక సర్వాస్తా అఘా విష్య శిధిరేవ. ఆ పాపకార్యాల నన్నింటినీ నశింప జేసి మమ్మను గ్రహించు. అధాతే వరుణ ప్రియాసః – అలాటి దయా దాక్షిణ్యాలు మాపైన చూపావంటే మేము

నీకెప్పుడూ ఇష్టమైన వాళ్లమే అవుతాము. లేకుంటే మమ్ములను నీవెప్పుడూ ప్రబలమైన శత్రువులుగానే చూస్తుంటావు. అలా చూస్తే మా అపరాధాలు మన్నించ లేవు. మమ్ము బిడ్డలలాగా దగ్గరికి తీసుకోలేవు. ఇదీ మంత్రార్ధం.

అసలీ మంత్రం శునశ్శేపుడనే కుఱ్ఱవాణ్ణి హరిశ్చంద్రుడనే రాజుగారి కమ్మి అతడు వరుణ పాశ బద్ధుణ్ణి చేసినప్పుడా బాలుడు తన బంధ విముక్తి కోసం వరుణ దేవుణ్ణి స్మరిస్తూ ప్రార్ధించే వేదమంత్రమిది. కథావ్యాజంతో మన విషయమే వ్యంగ్యంగా బయట పెడుతున్నదా శాస్త్రమని తోస్తుంది నాకు. శునశ్శేఫుడెవడో కాదు మనమే. కుక్క బ్రతుకు బ్రతుకు తున్నాడు మానవుడు. వీణ్ణి ఈ సంసారానికి కట్టి వేసిన వరుణ పాశమా ఆవరణాత్మకమైన అవిద్యా పాశమే. దీని నుంచి మరలా విముక్తి కల్పించమని ఆ మాయా శక్తి కధీశుడైన పరమాత్మ అనుగ్రహం కోసం తహ తహలాడే మనబోటి జీవ కోటి ఆవేదన ఇది. అజ్ఞానం వల్ల ఎన్నో దుష్కృత్యాలు చేసి ఈ స్థితికి వచ్చాము. సంసార బంధంలో వచ్చి పడ్డాము. దీన్ని తప్పించి మాకు మరలా మోక్ష పదవిని ప్రసాదించ వలసిన వాడవు. నిత్య ముక్తుడవూ గుణాతీతుడవు నీవే సుమా అని ఆక్రందన.

ఆ మాటకు వస్తే ఈ మూడు మంత్రాలకూ బాహ్యార్ధమే గాదు. అంతరార్ధమే గాదు. పరమార్ధం దాకా ఉన్నది విస్తారం. బాహ్యార్ధం భౌతికమైన స్థాయి వరకే. అది సూర్యమండలమూ దాని ప్రకాశమూ.

దాని వెలుగులో నడిచే మన జీవితమూ. ఎలాగూ తెలుస్తూనే ఉన్నది. తేజోబన్నా లిచ్చి మనలను కాపాడుతున్నదదే. ఇంతవరకూ మనకు తెలిసిందే. పోతే ఆధ్యాత్మికమైన భూమికలో చెబితే అది మనలను మేలు కొలిపే మన చేత అన్ని పనులు చేయిస్తూ మనకు మేలు చేసే మిత్రుడూ. అలాగే పగలంతా మనకు తన ప్రకాశాన్ని అందజేస్తూ మన స్థితిని కాపాడే సవిత. అలాగే సాయంకాలం తన ప్రకాశాన్ని తాను ఉపసంహరించు కొన్నా దాన్ని అగ్నిలో ప్రదీపాలలో ప్రవేశపెట్టి మన కుపకారం చేసి వరుణ రూపంలో మనల నావరించి నిద్ర పుచ్చి మనకు రాత్రి కాలం విశ్రాంతి కల్పించే వరుణుడు. మరలా తెల్లవారగానే నిద్ర నుంచి మనలను మేల్కొలిపి సుప్రభాతం చెప్పే ప్రాణమిత్రుడూ అవుతున్నాడు.

పోతే ఇక పారమార్థికంగా భావన చేస్తే ఎంతైనా ఉంది ఇందులో మర్మం. అది ఇంతకు ముందక్క డక్కడా స్పృశిస్తూనే వచ్చాను. దాన్నే కొంత విపులంగా వర్ణించి చెప్పాలని ఉంది. అసలదే తాత్పర్య మీ సంధ్యావందన ప్రక్రియ కంతా. సంధ్య అంటే ఏమని చెప్పాము. సంధ్యా అంటే గాయత్రే. గాయత్రి అంటే బ్రహ్మ విద్యే. అది బ్రహ్మాకార వృత్తే. అదే వరేణ్యం భర్గః – అలాంటి వృత్తి మానవుడి కేర్పడాలంటే బ్రహ్మ మనేదేదో తెలిస్తే గదా. దాన్నే ఇప్పుడీ మూడు మంత్రాలూ మనకు ప్రకటం

చేస్తున్నాయి. ఎలాగని అడుగుతారేమో. బ్రహ్మమనేది నిరుపాధికమైతే నామరూప రహితం. నిష్క్రియం. అదే సోపాధికమైతే నామరూపాత్మకం. సక్రియం. ఒకటి స్వరూపం. మరొకటి దాని విభూతి. స్వరూప మెప్పుడూ అవ్యక్తంగా ఉండిపోతుంది. విభూతి ఎప్పుడూ నామరూప క్రియాత్మకంగా వ్యక్తమయి కనిపిస్తుంటుంది. అదే ఈ ప్రపంచం – దీనితో వ్యవహరించే వ్యష్టి చైతన్యం జీవుడు. సమష్టి చైతన్యం దేవత. జీవులనేక రూపాలుగా ఉన్నట్టే ఆ దేవతలు కూడా అనేక రూపాలు. వారి శరీరాలు భూతమైతే వాటి నధిష్ఠించిన చైతన్య ఖండాలకు దేవతలని పేరు.

వారిలో ఒక దేవత ఈ సూర్యుడు. దాని మండలం శరీరమైతే – దాని కధిపతి సూర్యుడనే దేవత. ఇప్పుడీ సూర్యుడు మనకేదైనా మంచీ చెడ్డా చేస్తున్నాడు చెందుతున్నాడంటే ఆయన గాదు చేయటం. ఆ ఉపాధి ద్వారా నిరుపాధికమైన పరమాత్మే అలా ప్రవర్తిస్తున్నాడని ఆ పరమాత్మే మన వ్యష్టి చైతన్య రూపంగా దాన్ని అందుకొంటున్నాడని అర్థం చేసుకోవాలి మనం. ఎలా ప్రవర్తిస్తున్నాడాయన. ఉదయం మధ్యాహ్నం సాయంత్రం మూడు కాలాల్లో మూడు రూపాలు ధరించి వస్తుంటాడు మన దగ్గరికి. అందులో కనపడని రూపం రాత్రి కాలం. కంటికి కనపడడే గాని అవ్యక్తంగా తన స్వస్వరూపంలో తానుంటాడు. దాన్ని దర్శించాలంటే వరుణ పాశబద్ధులమైన మనకు చేతగాదు. వరుణ పాశం మనకీ సంసార

బంధమేనని చెప్పాము. వరుణుడెవరో గాదా మరుగు పడిన పరమాత్మ స్వరూపమే. అది మనమెన్ని జన్మల నుంచి ఎన్ని దుష్కార్యాలు తెలిసీ తెలియక చేస్తూ వచ్చామో ఆ అపరాధ ఫలంగా దూరమయి పోయింది. దానివల్లనే ఆయన పాశమైన ఈ సంసార బంధం. అంచేత ఇది నిర్మూలమయి పోయి దీనిలో నుంచి మరలా మనం బయట పడాలంటే ఇమంమే హవం శ్రుధీ అని ఆ స్వరూపాన్ని తదేక చిత్తంతో ధ్యానిస్తూ ప్రార్థిస్తూ కూచోవాలి. అదే వరుణ వ్రతం. అదే ఒక వ్రతంగా పెట్టుకోవాలి.

అలాటి వ్రతాన్ని పాటిస్తూ పోతే మనకు క్రమంగా జ్ఞానోదయమై ఆయన స్వరూపం మనకు ప్రత్యక్షమవుతుంది. అదే రాత్రి కాలం గడచి ప్రాతఃకాలం రాగానే సూర్యబింబం మనకు గోచరించటం. రాత్రి ఏదో గాదు. అజ్ఞానం. దానికి భిన్నంగా ప్రభాత మనేది జ్ఞానం. జ్ఞానంతోనే పట్టుకోవాలి పరమాత్మను. అలా పట్టుకోండి నన్నని చెప్పటానికే మనకు పరమ హితైషి అయిన మిత్రుడుగా ప్రత్యక్షమవు తుంటాడు ప్రతి దినం. మిత్రుడయి ఏమి చేస్తుంటాడు మనకు. మన శరీరాలతో సహా ఈద్యావా పృథ్వులను రెండింటినీ ధరించి ఉన్నాడు. మిత్రో జనాన్ యాత యతి. మన జీవితాలను అంతర్యామి రూపంగా నడుపుతున్నాడు. మనోవాక్కాయాలనే త్రికరణాలతో మనం చేసే ప్రతి పనీ గమనిస్తున్నాడు. కర్మణ్య కర్మయః పశ్యేత్తన్నట్టు ఇలా ప్రతి ఒక్క కదలిక జీవితంలో ఆ

పరమాత్మే అంతర్యామియై మనలను కదిలిస్తున్నాడని భావిస్తే చాలు. మనదేమీ లేదు. మనం చేస్తున్నా మనుకొంటున్నదంతా ఈశ్వరుడే మన ఉపాధి ద్వారా చేస్తున్నాడని ఒక అఖండమైన దర్శన మేర్పడుతుంది మానవుడికి. వ్యష్టి భావన సమష్టి భావనగా మారుతుంది. అలా మారిందంటే నహన్యతే న జీయతే. వాడికి జీవితంలో ఏ అపజయమూ లేదు. అంతా జయమే. అసలు అవిద్యాది పాపాలు కూడా అంటవు. వాటి పాటికవే పటా పంచెలయి పోతాయి. ఎటు వచ్చీ మనలను ప్రతి దినమూ కలుసుకొంటున్న - మనలను మేల్కొలుపుతున్న - మన ప్రతి ఆలోచనా పనీ నడుపుతున్న మిత్రుడెవడో గాదు. పరమాత్మే నని గ్రహించాలి మానవుడు.

అంతే కాదు. ఈ మిత్రుడు మనకెంత సన్నిహితంగా వచ్చి మనలను నడుపుతున్నాడో అంతగా ఈ బ్రహ్మాండాన్ని కూడా వ్యాపించి అన్నింటి స్థితి గతులనూ గమనిస్తూనే ఉన్నాడని కూడా అవగాహన చేసుకోవాలి మనం. అప్పుడాయన సవిత. నివేశ యన్న మృతం మర్త్యంచ. చరా చర పదార్థాలన్నిటినీ ఏవి ఎక్కడ ఉండాలో ఎలా ఎండాలో నిర్ణయిస్తున్నాడు. దేవం వహంతి కేతవః ఆయనను సర్వత్రా చూపుతున్న వేవో గావు. ఆయన కిరణాలు. కిరణాలేవో గావు. మన చుట్టూ కనిపించే ఈ నామరూపాలే. ఇవే అన్ని వైపులా చెల్లా చెదరయి ఉన్నాయి. అందుకే కిరణాలన్నారు

వాటిని. చిత్ర విచిత్రాలవి. అనేకమూ అనంతమూనని అర్థం. కాని మన బాధ్యత ఏమంటే ఉద్వయమ్ తమసస్పరి పశ్యంతః ఈ త్రిగుణాత్మకమైన ఆలోచనల నతిక్రమించి చూడాలి. ఇదే తమస్సు మన పాలిటికి. తమసో మా జ్యోతిర్గమయ. ఇది దాటి చూడగలిగితే ఆ చైతన్య ప్రకాశ మందుతుంది మనస్సుకు. సంసార సాగరం నుంచి పైకి వస్తున్న తేజస్సది. పశ్యేమ శరదశ్శతం మన నూరేండ్ల జీవితమూ దాన్ని చూడటానికే దాన్ని వినటానికే దాన్ని ఒకరి కొకరు చెప్పుకోటానికే. అప్పుడే ఇది సార్థకం. సాధన మైనప్పుడే సార్థకం **Purposeful** అలాటి అనుభూతి కోసం నూరేండ్లూ బ్రతకాలని రోగాలూ రొష్టులూ రాగూడదని ఆపదలు ముంచుకు రాగూడదని కోరుకోవాలి మనం. అసలు నిరంతర మా చింతన చేస్తూ ఉంటే అది మనల నెప్పుడూ తప్పజూడదు. మన అభీష్టాన్ని సఫలం చేసి తీరుతుంది. అంతా పరమాత్మ స్వరూపమే గదా. ఆ సత్యాన్ని గుర్తించిన సాధకుడికేది గాని ఎలా హాని చేయగలదు. ఇదీ బరవసా.

అది మహర్షులు పూర్వమనుభవానికి తెచ్చుకొనే మనకు బోధిస్తూ వచ్చారు. అదే ఈ మంత్రత్రయం ద్వారా మనకు వారు చేసే బోధ. ఇంతకూ పరమాత్మే సూర్యుడనే ఉపాధి ధరించి మిత్రుడుగా మనలను ప్రతి దినమూ కలుసుకొంటూ సవితగా మనకు చేయూత నిచ్చి అది మనం గట్టిగా పట్టుకొన్నామా లేదా అని పరీక్షించటం కోసం వరుణుడుగా అస్తమించి

మనకు మైకం కల్పించి మరలా ఆ మైకం నుంచి తేరుకొన్నామా లేదా తన సంగతి గుర్తుందా లేదా వీడికని మరలా మరుసటి దినం మనకు తన స్వరూపాన్ని గుర్తు చేస్తూ ఇలా వ్యక్తా వ్యక్తంగా మనతో దోబూచు లాడుతున్నాడు. ప్రతి దినమూ మూడు సంధ్యలలో వందనం చేస్తూన్నామంటే ఈ అఖండమైన బ్రహ్మ భావనతో సంబంధం పెట్టుకొనే ప్రయత్నమే గాని ఏదో సంధ్య అనేది ఒక కాలం. ఆ కాలంలో మనకు కనిపించినా కనిపించకున్నా ఒక మండలాన్ని పైన చూస్తూ క్రింద దాని కిదుగో ఈ అర్ఘ్య మిస్తున్నానని యాంత్రికంగా కాదు.

ఇక్కడికి సూర్యోపస్థాన మయింది. మూడు సంధ్యలలోని మూడు మంత్రాలకూ అన్ని భూమికలలో అర్థం చెప్పుకొన్నాం. భూత విషయంగా ఒకటి. దేవతా విషయంగా ఒకటి. ఆఖరు కివేవీ గావు. పరమాత్మ విషయంగా ఒకటి. భూతం కంటే దేవత గొప్పదైతే దేవత కంటే పరాదేవత గొప్పది. దేవ అంటే దీవ్యతీతి దేవః – ప్రకాశించేదని అసలైన అర్థం. జడ ప్రకాశం కాదది. చైతన్య ప్రకాశం. జడ ప్రకాశం ప్రకాశమే గాదు. అది భూతమే. దాన్ని ప్రకాశింప జేసేది దేవత. ఆ దేవత కూడా ఖండమైన ప్రకాశమే. దానికి కూడా ప్రకాశాన్ని సరఫరా చేసేది పరిపూర్ణమైన పరా దేవత. అదే పరిపూర్ణమైన చైతన్య ప్రకాశం. ఆ పరిపూర్ణ ప్రకాశమే మరలా ఆయా దేవతా రూపంగా లోపల చేరి భౌతికమైన ప్రపంచంగా బయటపడి

కనిపిస్తున్నది. మనలో చేరి దీన్ని కనే జీవ చైతన్య రూపంగా భాసిస్తున్నది. ఇప్పుడీ జీవుడా అఖండ చైతన్యాన్ని అందుకొంటే గాని మోక్షం లేదు. అందుకోవాలంటే ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. మొదట ఆ అఖండ చైతన్యమే దేవతా మూర్తులుగా మారిందో ఆ దేవతా మూర్తులను మంచి చేసుకోవాలి. వీడు వ్యష్టి అవి సమష్టి. కనుక వ్యష్టి తన కన్నా సమష్టి అని భావించే దేవతను పట్టుకొంటే అవి తమకు కూడా అతీతమైన పరా దేవతా స్ఫూర్తిని మనకు ప్రసాదిస్తాయి. ఈ భావమే ఇప్పుడీ దిగ్దేవతా నమస్కారమనే వ్యాజంతో మనకు బయట పెడుతున్నది స్తోత్రం.

## - దిగ్దేవతా నమస్కారము -

దిగ్దేవత లంటే ఎవరో కాదు. దిక్కులన్నింటినీ వ్యాపించిన పరమాత్మ విభూతి శకలాలు. దిక్కులు వాటి శరీరం. అవి వాటి వరకూ వ్యాపించిన చైతన్య ఖండాలు. దేవతలు. అష్ట దిక్కులకూ అష్ట దిక్పాలకు లున్నారు. ఆ దిక్పాలకులీ దేవతలే. తూర్పు ఆగ్నేయం దక్షిణం నైరృతి. పశ్చిమం - వాయవ్యం ఉత్తరం ఈశాన్యం ఇవీ అష్ట దిక్కులు. దిశలూ విదిశలూ రెండూ కలిసి ఎనిమిది. వీటికి వరుసగా ఇంద్రుడు అగ్ని యముడు, నిరృతి వరుణుడు వాయువు కుబేరుడు ఈశాన్యుడు - పాలకులు. అంటే దిగ్దేవతలు. ఇందులో ఆగ్నేయాది విదిశలనే అవాంతర దిశలని కూడా పేర్కొంటారు. ఇవి గాక ఊర్ధ్వ దిశ ఒకటి అధోదిశ ఒకటి రెండున్నాయి. అవి కూడా కలిస్తే మొత్తం పది. దశ దిశలంటారు వీటినే.

ప్రస్తుత మీ పది దిక్కుల వైపు తిరిగి చేతులు చాచి చూపుతూ వాటి అధిదేవతలకు నమస్కరిస్తున్నాడు సాధకుడు ఎలాగా.

**ఓం నమః ప్రాచ్యైదిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్య శ్చనమః - ఓం నమో దక్షిణా యైదిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతా భ్యశ్చ నమః - ఓం నమః ప్రతీచ్యైదిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్యశ్చ నమః - ఓం నమ ఉదీ చ్యైదిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్యశ్చ నమః - ఓం నమ ఊర్ధ్వాయై దిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్యశ్చ నమః - ఓం నమో ధరాయైదిశే యాశ్చ దేవతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతా భ్యశ్చ నమః - ఓం నమోః ఉ వాంత రాయై దిశే యాశ్చదే వతా ఏతస్యాం ప్రతి వసంతి ఏతాభ్యశ్చ నమః -**

ఇందులో ప్రాక్కంటే తూర్పు - దక్షిణ దక్షిణ దిక్కు. ప్రత్యక్కంటే పడమర - ఉదక్కంటే ఉత్తరం - నాలుగు దిశలూ కలిసి వచ్చాయి. ఊర్ధ్వం అధరం అనటంలో పైది క్రిందిది రెండూ వచ్చాయి. పోతే అవాంతర మవటంలో దిశలే గాక విదిశలూ కలిసి వచ్చాయి. అన్నీ కలిసి దశ దిశలూ సరిపోయాయి. పోతే ఈ దిశలకూ ఈ దిశలలో నివసించే

దేవతలకూ నమస్కారం చెప్పటం వల్ల అధిభూత అధిదైవత రూపంగా వ్యాపించిన పరమాత్మకే నమస్కరించి నట్టయింది. దేవతాభ్యః -అని బహువచనంలో ప్రయోగించటం కూడా సాభిప్రాయమే. దిగ్దేవత ఒక్కడే అయినా ఆయన కళత్ర పుత్ర మిత్రాది పరివార ముంటుంది గదా. ఆ పరివార దేవతలు కూడా కలిసి వస్తారని అభిప్రాయం. అప్పటి కన్ని వైపులా పరమాత్మ భావనే విస్తరించి ఉండాలి ఈ నమస్కరించే వ్యక్తికి.

అంతేకాదు

**నమో గంగా యమునయోర్మధ్యే యే వసంతి తే**

**మే ప్రసన్నాత్మాన శ్చిరం జీవితం వర్ధయంతి. నమో గంగా**

**యమున యో ర్మని భ్యశ్చ నమః సంధ్యాయై నమః -**

**సావిత్ర్యై నమః గాయత్ర్యై నమః సరస్వత్యై నమః సర్వాభ్యో**

**దేవతా భ్యో నమః - దేవే భ్యో నమః ఋషిభ్యో నమః - మునిభ్యో**

**నమః గురుభ్యో నమః - పితృభ్యో నమః - కామో౽**

**కార్షీ న్మన్యుర కార్షీ న్నమో నమః**

దేవతలకు నమస్కరించి వారి అనుగ్రహం సంపాదించిన తరువాత మహర్షుల ఆశీస్సులు కూడా అందుకోవాలి మనం. ఋషులంటే వారా దేవతా మూర్తులను దర్శించినవారు. ఋషులే గాక మునులు కూడా వారు. దర్శించి తద్ద్వారా పరాదేవత అయిన పరమాత్మ తత్త్వాన్ని మౌనంగా

ధ్యానిస్తున్న వారు కూడా. వారి అనుగ్రహం సంపాదిస్తే వారిలాగే మనం కూడా పరమాత్మ తత్త్వాన్ని అందుకొనే మార్గం గ్రహించగలం. అందుకే గంగా యమునాది పుణ్య నదీ ప్రాంతంలో జ్ఞాతా జ్ఞాతంగా వసించే ఆ మహా మునులకు అభి వందనం సమర్పించాలి మనం. సమర్పిస్తే వారు మనకు దీర్ఘకాల జీవితాన్ని ప్రసాదిస్తారు. జీవే మ శరద శ్శతమని గదా అన్నారు. అర్ధాంతరంగా ముగియ కుండా దీర్ఘకాలం జీవించినప్పుడే ఏ గొప్ప కార్యమైనా సాధించగలడు మానవుడు - శరీర మాద్యంఖలు ధర్మ సాధన మన్నారు పెద్దలు.

ధర్మమంటే ఏమిటి. ఎప్పుడూ మనలను ధరించి ఉండే దేదో అది ధర్మం. దాన్ని గుర్తించి మనం కూడా దాన్ని ధరించి ఉంటే అదీ ధర్మమే. ధర్మోరక్షతి రక్షితః అనే వాక్యానికిదే అంతరార్థం. అలాటి ధర్మం బ్రహ్మమే. అలాటి ధర్మం బ్రహ్మాకార వృత్తే. బ్రహ్మమెప్పుడూ మనలను వాటేసుకొనే ఉంది. వస్తుసిద్ధమది. దేశకాల వస్తువులన్నీ దాని స్వరూపమే. కాగా అలాటి సర్వవ్యాపకమైన తత్త్వాన్ని మానవుడు బుద్ధి సిద్ధం చేసుకోవా లెటు వచ్చీ. ఇప్పుడలా బుద్ధి సిద్ధం చేసుకొనే ప్రక్రియే ఈ నమస్కారం. నమస్కారం కేవలం కాయికమే కాదు. వాచికమే కాదు. మానసికం కూడా. మనసులో ఆ అఖండ వృత్తి ఏర్పడాలంటే దేశకాల పాత్రలనన్నిటినీ బ్రహ్మాకారంగా భావన చేయాలి. అందులో దశదిశలకూ నమస్కరిస్తున్నా

మంటే అది దేశమంతా పరమాత్మ భావనతో చూడటమే. త్రిసంధ్యలలో అలా నమస్కరిస్తున్నా మంటే కాలమంతా తదాకారంగా భావించటమే. అలాగే ఆ దేశకాలాల్లో నివసించే ఋషులకూ మునులకూ నమస్కారమంటే దాన్ని స్వానుభవానికి తెచ్చుకొన్న పాత్ర భూతులైన పెద్దలందరి సాహాయ్యాన్నీ అర్థించటమే. వారిని కూడా బ్రహ్మ భావనతో దర్శించటమే.

ఇదంతా ఎందుకోసం. బ్రహ్మ జ్ఞాన మార్జించి తద్ద్వారా బ్రహ్మతత్త్వాన్ని మన స్వరూపంగా అనుభవానికి తెచ్చుకోటానికే గదా. అందుకే **సంధ్యాయై నమః సావిత్ర్యై నమః - గాయత్ర్యై నమః - సరస్వత్యై నమః** అంటున్నారు. సంధ్య ఆ బ్రహ్మ విద్యే. అదే సావిత్రీ రూపంగా మనదగ్గరికి వచ్చింది. సవన మంటే ప్రసవం. ఆ పరమాత్మ చైతన్యమే సవితృ ప్రకాశ రూపంగా వచ్చి మనకు బ్రహ్మాకార వృత్తి నందించింది. అలా అందించిన దాన్ని మరచిపోకుండా దాని గానం చేస్తూ పోతే అది గాయత్రి అయి మనలను కాపాడుతుంది. చివరకు దాని బలంతోనే ఉపాధిని వదిలేసి పోతే సరస్వతి అయి అది మనలనా బ్రహ్మ తత్త్వానికే చేరుస్తుంది. ఇలా మన జీవిత మాది మధ్యాంతాలు మూడు దశలలోనూ బ్రహ్మాకార వృత్తే మనకు శరణ్యమదే మనకాలంబనం. అందుకే దాని నాశ్రయించాలి అనుక్షణమూ. దానికి సంకేతమే ఈ సమస్కార మనే క్రియ. ఈ మార్గంలో పయనించి జీవిత లక్ష్యాన్ని సాధించి సిద్ధులైన దేవతలనేమిటి - ఋషులనేమిటి.

మునులనేమిటి. సద్గురువుల నేమిటి. మన మూల పురుషులైన పితరులనేమిటి. అందరినీ భక్తి శ్రద్ధలతో సేవించాలి మనం. దానికేవైనా అంతరాయా లున్నాయంటే అవి రెండే. కామమూ మన్యువూ. అంటే కామ క్రోధాలు. ఈ ద్వంద్వాలు రెండూ అడ్డు తగులుతున్నంత వరకూ ఏ సత్ఫలితాన్నీ ఆసించ లేము. అవి పోవాలంటే వాటిని మనమీదికి పురికొల్పే ఏ శక్తులున్నాయో వాటిని మంచి చేసుకోవాలి. అవి వాటి అధిదేవతలు. కామోకార్షీత్ మన్యు రకార్షీత్ - అవే ఈ కామక్రోధాలను మనకు కల్పిస్తున్నాయి. కాబట్టి వాటికి నమస్కారం చెప్పాలి మనం. వాటి ప్రయోగోప సంహారాలు రెండూ ఆ దేవత చేతిలోనే ఉన్నాయి కాబట్టి అవి ప్రసన్నమైతే ఉపసంహరిస్తాయని అర్థం.

అప్పటికి దేశకాల వస్తువులు మూడింటినీ పరమాత్మే వ్యాపించి ఉన్నాడనే బ్రహ్మ భావనతోనే సమస్తమూ దర్శించి నట్టయింది సాధకుడు. **పృథివ్యాపస్తేజోవాయు రాకాశాత్.** అసలీ పృథివ్యప్తేజోవాయ్వాకాశా లెక్కడివి. ఎక్కడి నుంచి ఆవిర్భవించాయి. ఏది వీటికి మూలం. ఆ పరమాత్మే గదా. అది అవ్యక్తమయితే ఇవి దాని వ్యక్తమయిన రూపం. భూతమంటే ఆవిర్భూతమనే అర్థం. ఇవి ఒకదానిలో నుంచి ఒకటి వచ్చినట్టు కనిపిస్తున్నా అన్నీ కలిసి చివరకా మూల తత్త్వమైన పరమాత్మను చేరవలసి ఉంది. ఎందుకంటే సూక్ష్మంలో నుంచే స్థూల మేర్పడుతుంది. సూక్ష్మమయ్యే

కొద్దీ అది నిరాకారం సామాన్యం వ్యాపక మవుతుంది. అలాంటిదే ఇప్పుడు మనం చూచే ఆకాశం. దీనిలో నుంచి వాయువు. దానిలో నుంచి తేజస్సు. అందులో నుంచి జలం. దానిలో నుంచి పృథివి. అంతకంతకు సూక్ష్మం స్థూలమవుతూ వచ్చింది. ఇది సృష్టి. మరలా ఈ స్థూల మంత కంతకు సూక్ష్మమవుతూ పోతే అది లయం. ఇందులో అతి సూక్ష్మం. నిరాకారం సామాన్యం వ్యాపకమైన దాకాశమైతే - దానికి కూడా మూలభూతమైన దొకటుంది. ఒకటే ఉంది.

ఏదది. ఏదో గాదు. వాసుదేవ అని ఒక్క మాటలో చెప్పింది శాస్త్రం. వాసుదేవ అంటే వసుదేవుడి కుమారుడు కృష్ణుడు కాదు. వసతీతి వాసు. దీవ్యతీతి దేవ. ఏది ఉంటుందో ఉన్నట్టు ఏది స్ఫురిస్తుంటుందో అది వాసు దేవ అంటే. ఇందులో ఉండటం వరకూ ఆకాశంలో కనిపిస్తుంది. కాని స్ఫురించటం లేదందులో. స్ఫురణ అంటే తానున్నట్టు తనకు తెలియటం. ఉందే గాని ఉన్నట్టు తెలియ దాకాశానికి. ఆ తెలియటమే ప్రమాణం. దానితో తెలుసుకొనేదేదో అది ప్రమేయ మంటారు. ఆకాశం ప్రమేయమే గాని ప్రమాణం కాదు. ప్రమాణానికి కేవలం గోచరిస్తుంటుం దంత మాత్రమే. అంచేత అది ఎంత సామాన్యమైనా వ్యాపకమైనా దాన్ని కూడా వ్యాపిస్తుందీ జ్ఞానమనే సామాన్యం. కనుకనే సర్వవ్యాపకమైన ఈ జ్ఞానాన్ని మహా సామాన్యమని పేర్కొన్న దుపనిషత్తు. అదే వాసుదేవ.

**ఓం నమో భగవతే వాసుదేవాయ -** అందుకే దానికే చెప్పాలి మనం నమస్కారం. ఇంకొక దేవతకూ మహర్షులకూ గురువులకూ ఎవరికి మనం నమస్కరించినా ఆ రూపంలో ఉన్న ఆ వాసుదేవుడికే చెందుతాయన్ని నమస్కారాలు. అది వాసుదేవే గాక భగవతే. భగవంతుడు కూడా. జ్ఞానైశ్వర్యాది షడ్గుణాలకూ భగమని పేరు. భగోస్యాస్తీతి భగవాన్. ఆ గుణా లెవరి కుంటే వాడు భగవంతుడు. జ్ఞానశక్తి క్రియాశక్తీ సంపూర్ణంగా ఉన్నవాడని అర్థం. జ్ఞానం స్వరూపమైతే క్రియ దాని విభూతి. ఒకటి నిర్గుణం - మరొకటి సగుణం. నిర్గుణమైన వాసుదేవ స్వరూపమే సగుణమైన దేవ ఋషి గురు పితృ కామ మన్యు రూపంగా భాసిస్తున్నది. కనుక ఆ ఒక్క దాన్ని ఆశ్రయిస్తే చాలు. దాని చెప్పు చేతల్లో ఉన్న ఇవన్నీ మాట వింటాయి మనకు మేలు చేస్తాయి.

కనుకనే నారాయణాయ విద్మహే - వాసు దేవాయ ధీమహి - తన్నో విష్ణుః ప్రచోదయాత్తనే మాట వచ్చింది. ఏమిటీ మాట. నారాయణ వాసుదేవ విష్ణు ఒకటి కావా. మూడింటికీ ఒకటే అర్థమయినప్పు డొక చోట విద్మహే ఒకచోట ధీమహి మరొక చోట ప్రచోదయాత్తనే మాటలేమిటి. అక్కడే ఉంది విశేషం. గౌణంగా తీసుకోవాలీ నామాలను విష్ణు నామాలలాగా. అలా తీసుకొంటే నారాల కయన మేదో అది నారాయణ. నారమంటే పాంచభౌతికమైన జగత్తు - పంచకోశాత్మకమైన జీవ

సమూహం. రెండూ. వీటి కయన మంటే అధిష్ఠానం. అది ఈ రెంటికీ అతీతమైనది. కనుక నిరాకారం వ్యాపకం. అలాంటిది మనకు గోచరం కాదు. నారాయణః పరోఽవ్యక్తాత్ – అవ్యక్తమైన ప్రకృతి కన్నా అతీతమైన తత్త్వం మనకెలా గోచరిస్తుంది. కాని ఎప్పటికైనా మనం చూడక తప్పదు. లేకుంటే మోక్షం లేదు మన జీవితానికి. అందుకే విద్మహే. చూడాలి మనమంటున్నాడు. మరి అగోచరం కదా ఎలా చూడాలంటారు. అందుకే వాసుదేవాయ ధీమహి. వాసుదేవ రూపంగా ధ్యానించాలి. మనసుకు తెచ్చుకోవాలి. వాసుదేవ అంటే చెప్పాము గదా. అస్తి భాతి ఉన్నది ఉన్నట్టు స్ఫురిస్తున్నదని. మీరీ ప్రపంచంలో ఏది చూడండి. ఏదో ఒక రూపంలో ఉంటుంది. అది అలా ఉన్నట్టు మనకు స్ఫురిస్తుంటుంది. సత్తా స్ఫూర్తులు లేని పదార్థమే లేదు లోకంలో. బాహ్యంగానే కాదు మనసులో కలిగే ఏ ఆలోచనైనా సుఖదుఃఖాది ఏ అనుభవాలైనా అవి అస్తి భాతి ఉన్నాయనే భాసిస్తున్నాయనే అనుభవానికి వస్తుంటాయి. అలా కాకుంటే అసలేదీ మన అనుభవానికే రాదు సుమా. కాబట్టి భావంలో బాహ్యంలో ప్రతి ఒక్కటీ వాసుదేవే. ఏది మనసుకు వచ్చినా అది వాసుదేవే. కనుక అంతటా పరుచుకొని ఉన్న ఆ వాసుదేవ రూపాన్నే మనసులో పెట్టుకోవాలి. అదే నారాయణ తత్త్వాన్ని చూపుతుంది మనకు.

పోతే తన్నో విష్ణుః ప్రచోదయాత్తన్నారు. అదేమిటంటే అస్తిభాతి సర్వత్రా ఉండవచ్చు. చూచే అవకాశమూ ఉండవచ్చు. కాని మన బుద్ధి అందులో ప్రవేశించాలి గదా. బుద్ధి అందులో ప్రవేశించినప్పుడే అది బుద్ధిలో ప్రవేశిస్తుంది. లేకుంటే వస్తు సిద్ధంగా అది ఉన్నా మన సొమ్ము గాదు. ఇంతెందుకు వాయువు సర్వత్రా ఉంది. కాని దాన్ని మన మనుక్షణమూ పీల్చి లోపలికి తీసుకొంటేనే మనం బ్రతుకుతాము. లేకుంటే మనుగడే లేదు మానవుడికి. అలాగే ఆకాశమిప్పుడు సర్వత్రా ఉంది. మన వెలపలా ఉంది లోపలా ఉంది. వాయువులాగా పీల్చే ప్రయత్నం కూడా లేదు. కాని అది ఉన్నట్టు గుర్తించక పోతే దగ్గర ఉన్నా అది మనకు దూరమే. అందుకే చిన్న పిల్ల లాకాశ మెక్కడ ఉందని అడిగితే చేయి పైకెత్తి అదిగో ఆకాశమని పైకి చూపుతుంటారు. అలాగే ఇప్పుడా నారాయణ తత్త్వం వాసుదేవ రూపంగా సర్వత్రా సత్తాస్ఫురత్తలుగా దర్శనమిస్తున్నా నామరూపాలనే విజాతీయ భావాలడ్డు తగిలి దాన్ని ఉన్నదున్నట్టు పట్టుకో లేకపోతున్నాము. అంచేత తన్నో విష్ణుః ప్రచోదయాత్తనే మూడవ మాట వచ్చింది. విష్ణు అంటే విశతీతి విష్ణు. దేనిలో ప్రవేశిస్తుందో అది విష్ణు. ఏది మరలా బుద్ధిలో ప్రవేశిస్తుందో అది విష్ణు. మన బుద్ధి అందులో ప్రవేశించి చూడాలి మొదట. అప్పుడది తప్పకుండా బుద్ధికి స్ఫురిస్తుంది. కనుక ఆ వాసుదేవ తత్త్వం విష్ణువై మన బుద్ధి నందులోకి ప్రచోదన

మంటే ప్రేరణ చేయాలి. చేసి దాన్ని మరలా మన బుద్ధిలోకి ప్రేరణ చేయాలి. అలా చేస్తే అంతకు ముందున్న విజాతీయ భావాలన్నీ బయటికి ప్రచోదన మయి సజాతీయమైన ఈ సచ్చిద్భావన లోనికి ప్రచోదన మవుతుంది. ఇంత ఉంది ఈ మూడింటిలో మర్మం.

అయితే ఏమిటది ఎలా సాధించాలని అడిగితే చెబుతున్నాడు. **యాగ్ం సదా సర్వాభూతాని చరాణి స్థాన రాణి చ సాయం ప్రాతర్న మస్యంతి - సామా సంధ్యా అభిరక్షతు.** సంధ్యా దేవి ఎప్పుడూ తన్ను సేవించే నన్ను రక్షించు గాక. ఎవరా సంధ్య. ఎలా రక్షించాలంటారు. సంధ్య అంటే కాలం. కాలమంటే కదలిక. దానికెప్పుడూ అధీనమయ్యే ఉన్నది మన బ్రతుకు. మనమే గాదు. **చరాణి స్థావరాణి చ** - చరాచర పదార్థాలన్నీ దాని వశంలోనే ఉన్నాయి. ప్రతి ఒక్కటీ అది ప్రాణమున్నదే కావచ్చు. లేనిదే కావచ్చు. నిరంతరమూ చలిస్తూనే గదా ఉంటుంది. జడ పదార్థమెలా చలిస్తుందనే ప్రశ్న లేదు. అదీ కొంతకు కొంత మార్పు చెందుతూ చివరకు ఎప్పటికో ఒకప్పటికి నశించేదే. చేతనం మాట ఇక చెప్పనే అక్కర లేదు. పుట్టటమూ పెరగటమూ పోవటమూ - అంతా చలనమే. మార్పే. అదే కాలమనే మాట కర్థం. సాయం ప్రాతర్న మస్యంతి - ఉదయాస్తమయాలూ దానికే అన్నీ నమస్కరిస్తున్నాయి. నమస్కరిస్తున్నాయంటే కాలానికే సమస్త భూతాలూ తల వంచి దాని కధీనమై బ్రతుకు సాగిస్తున్నాయని భావం.

ఈ విధంగా ఏ కాలరూపిణి అయిన సంధ్య కధీనమై ఉన్నాయో అది మమ్ము రక్షించాలని కోరటంలో ఏమిటి ఆంతర్యం. ముందు చెప్పిన వాసుదేవుడికీ ఈ సంధ్యకూ ఏమిటి సంబంధం. ఉంది. కావలసినంత ఉన్నది సంబంధం. వాసుదేవ జ్ఞాన స్వరూపమైన పరమాత్మ అయితే ఇది ఆయన క్రియాశక్తి. కాలమే క్రియ. కదిలే దదే గదా. అది కూటస్థమైన ఆ స్వరూపం దగ్గరి నుంచి మనదాకా కదులుతూ వస్తున్నది. వచ్చి మరలా మనలను కదుపుతూ కూచుంటుంది. అలా కదపటం వల్లనే ప్రతి ఒక్కడూ లోకంలో మనసా వాచా వపుషా నిత్యమూ కదులుతూనే ఉంటాడు. అణువు మొదలు అన్ని జడ పదార్థాలు కూడా అతి వేగంగా కదులుతూ ఉంటాయి. అలా కదలక పోతే తిండి లేదు. తీర్థం లేదు. తిరగ లేము బ్రతకలేము. దేనికీ నోచుకోలేము.

అయితే ఈ కాలం మనలను కదిలిస్తున్నదంటే అది రెండు మార్గాలలో ఏదైనా కావచ్చు. అది అవిద్యా రూపిణి అయి కదిలించిందంటే సుఖం లేదు. ఐహికమైన అన్నపానాదులూ – వస్తు వాహనాదులూ పోగు చేసుకోటానికైనా కదులుతూ పోతాము మనం. చివరికీ వాసనలతోనే ఒక జన్మ నుంచి మరో జన్మకైనా కదలి పోతుంటాము. దీనివల్ల జీవిత సమస్య సమస్యగానే మిగిలిపోతుంది. తెగదు. తెల్లవారదు. నూటికి తొంభయి మంది జీవిత మిలాగే సాగిపోతున్నది. పామరులే గాదు.

పండితులూ శాస్త్రజ్ఞులూ కళాకారులూ ధార్మికులమని విర్రవీగే వారి జీవితాలు కూడా ఇంతే. పోతే అదే కాలం విద్యా రూపిణి అయి మన బుద్ధులను కదుపుతూ పోయిందంటే ఏ తత్త్వాన్ని వదిలేసి మనమింత దూరం వచ్చి ఈ సాగరంలో పడ్డామో ఆ వాసుదేవ తత్త్వం వైపే తీసుకెళ్ళి మనకు దానితో సాయుజ్యాన్నే ప్రసాదిస్తుంది. ఇందులో మొదటిది మనలను శిక్షించటమైతే రెండవది రక్షించటం. అందుకే వాపోతుండాలి మానవుడెప్పుడూ అమ్మా కాల స్వరూపిణీ సంధ్యా ! నిన్ను నేను విద్యారూపిణిగా అంటి పట్టుకొన్నాను. నన్ను సంసార కూపంలో పడదోసి దెబ్బ తీయకుండా వాసుదేవ సాయుజ్యాన్ని ప్రసాదించి మోక్ష సుఖాన్ని అబ్బ జేయి తల్లీ శిక్షించకు నన్ను రక్షించమని. ఇదే అసలు **ధియో యోనః ప్రచోద యాత్తనే** మాటలో కూడా ఇమిడి ఉన్న తాత్పర్యం. **భర్గో దేవస్య -** బ్రహ్మ విద్య. అది సవితృ రూపుడైన పరమాత్మ నుంచి మనదాకా ప్రసరిస్తూ వచ్చిన క్రియాశక్తే. **ధియో యోనః** - అది మన బుద్ధులను కదుపుతూ పోవటమే **ప్రచోదయాత్** ఎటు వచ్చీ ఆ ప్రచోదన విషయాభి ముఖంగా గాక ఆత్మాభిముఖంగా జరగాలనే మన ఆకాంక్ష.

**శివాయ విష్ణు రూపాయ - శివ రూపాయ విష్ణవే**

**శివస్య హృదయం విష్ణుః - విష్ణోశ్చ హృదయం శివః**

**యధా శివమయో విష్ణు - రేవం విష్ణు మయ శ్శివః**

**యధాం తరం న పశ్యామి - తధామే స్వస్తి రాయుషి -**

ఇంతవరకూ జ్ఞాన స్వరూపమైన వాసుదేవ తత్త్వాన్నీ ఆయనతో ఓతప్రోతమై మనదాకా ప్రసరిస్తూ వచ్చిన క్రియా రూపిణి అయిన సంధ్యా దేవతనూ రెంటినీ వర్ణించారు. ఈ సంధ్య ఏదో గాదు. బ్రహ్మ విద్యే గనుక ఈ బ్రహ్మ విద్య ద్వారానే మనమెప్పటికైనా బ్రహ్మ తత్త్వాన్ని అందుకోవాలని స్వానుభవానికి తెచ్చుకోవాలని అర్థమయింది. అందుకోసమే ఆ రెండింటినే నిత్యమూ వందనం చేయాలి సాధకుడు. అంటే మనసా వాచా అదే లోకంగా జీవించాలి. అప్పుడే జీవ జగత్తులనే భేదం నశించి అంతా బ్రహ్మ స్వరూపంగా చూడగలడు సాధకుడు.

జీవుడు జ్ఞానమైతే జగత్తు జ్ఞేయం. ఈ రెండింటికీ ఉన్న సంబంధ మన్నాన్నాద సంబంధం. అన్న మంటే ఈ చరా చర జగత్తే Matter. అన్నాద దీన్ని నిత్యమూ లోపలికి తీసుకొని దీని అనుభవాన్ని పొందుతున్న జ్ఞానమే Mind. కాగా ఇవి రెండూ పైకి రెండుగా కనిపిస్తున్నా అది ఆ భాసే సత్యం కాదు. సత్య మఖండమైన జ్ఞానం. అదే వాసుదేవ. సచ్చిద్రూపంగా అది ఈ జ్ఞేయమైన జగత్తునూ జ్ఞాత అయిన జీవులనూ రెంటినీ వ్యాపించి ఉంది. వస్తుతః ఇవి రెండూ దాని కభిన్నమే. అసలదే మన అవిద్యా వశాత్తూ ఇలా రెండు పాయలయి ప్రకాశిస్తున్నది.

ఈ రెండు పాయలే శివకేశవులు. శాస్త్ర భాషలో జ్ఞాన జ్ఞేయలైతే పురాణ భాషలో శివకేశవులు. శివుడు జ్ఞానానికీ విష్ణువు జ్ఞేయానికీ

సంకేతాలు. జ్ఞేయమైనదీ ప్రపంచమే గదా. ఇది నామరూప క్రియలతో చిత్ర విచిత్ర రూపంగా కనిపిస్తున్నది. ఎప్పటికప్పుడు మారిపోతున్నది. నవ నవోన్మేషంగా ఎన్నో వేషాలు వేస్తూ కనిపించేసరికి మనకెంతో ఆకర్షకంగా తోస్తుంటుంది. సృష్టి లయాలకు మధ్య కాలంలోనే ఇలా కనిపిస్తున్నది కాబట్టి స్థితి కాలమిది. స్థితి కారుడే గదా విష్ణువు. ఆయనే గదా మత్స్య కూర్మాద్యనే కావతారాలెత్తు తుంటాడు. ఎప్పటికప్పుడనేక రూపాలు ధరించి భ్రమ గొలుపుతుంటాడు. దీన్నే గదా మనం జ్ఞేయమని చూస్తుంటాము. దీన్నే గదా జ్ఞానంతో గ్రహించి అందులో ఎప్పటికప్పుడు ఏకం చేసుకొంటున్నాము. ఆ ఏకం చేసుకోటమే గదా లయం. కనుకనే విష్ణువు స్థితి కారుడైతే శివుణ్ణి లయకారుడని వర్ణించారు. ఆ తృతీయ నేత్రం అగ్ని. జ్ఞానమే అగ్ని. జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి అన్నట్టు జ్ఞేయమైన ఈ ప్రపంచమంతా జ్ఞానంలోనే లయమై పోతున్నది. ఇది అన్నమైతే అది అన్నాద. జ్ఞేయ మన్నం - జ్ఞాన మన్నాదం. అన్నాన్ని విడిచి అన్నాదుడు లేడు. అన్నాదుడు లేకుంటే అన్నాని కర్థం లేదు. జ్ఞేయ మన్నం జ్ఞానమన్నాద అని గదా చెప్పాము. జ్ఞేయం విష్ణు స్వరూపం. జ్ఞానం శివ స్వరూపం. జ్ఞేయమనేకం. జ్ఞాన మేకం. అనేకం భోగానికి. ఏకం వైరాగ్యానికి. భోగమంటే అనుభవం చరా చర పదార్థాలనే గదా అనుభవిస్తుంటాము. అది భోగం. అదంతా లయం చేసుకొంటే మిగిలేది ఏకమైన జ్ఞానమే

గదా. అది వైరాగ్యం. కనుకనే విష్ణువు భోగానికైతే శివుడు వైరాగ్యానికి చిహ్నామై కూచున్నారు.

ఇంతకూ జ్ఞేయం ప్రమేయమైతే జ్ఞానం దానికి ప్రమాణం. ప్రమాణ ప్రమేయాలు రెండూ పరస్పర సాపేక్షాలు. Inter dependent జ్ఞానాన్ని విడిచి జ్ఞేయం లేదు. జ్ఞేయాన్ని విడిచి జ్ఞానం లేదు. జ్ఞానమగ్ని. జ్ఞేయం దానిలో ఆహుతి అయ్యే సోమం. అగ్నీ షోమ యాగమని పేరు దీనికి. దీని వివరమంతా నా భాగవత సామ్రాజ్యం చదివితే తెలుస్తుంది పాఠకులకు. కనుక ఇలా శివ విష్ణువులని రెండు శాఖలయి కనిపిస్తున్నా రెండూ కలిసి ఒకే వృక్షానికి చెందిన శాఖలు. వృక్ష రూపంగా రెండూ అభిన్నమే. శాఖలుగా చూస్తేనే ఎక్కడికక్కడ భిన్నమై కనిపిస్తుంది. అలా చూడకండి. ఏకంగా చూడండి అప్పుడే మీకది మోచకమవుతుంది. లేకుంటే బంధకమే సుమా అని హెచ్చరిస్తున్నదీ మంత్రం. ఎలాగ **శివాయ విష్ణు రూపాయ.** శివుడంటే ఎవరో గాదు. విష్ణు స్వరూపుడే. **శివ రూపాయ విష్ణవే** విష్ణువంటే ఎవరో గాదు. మరలా శివస్వరూపుడే. **శివస్యహృదయం విష్ణుః** - శివుని ఆంతర్యం విష్ణువే. **విష్ణో శ్చ హృదయం శివః - విష్ణువాంతర్యం** కూడా శివుడే. **యధా శివ మయో విష్ణుః** - విష్ణువంటే శివ మయుడు. శివునిలో చేరిపోయాడు. ఆయనతో ఏకం. అలాగే **ఏవం విష్ణుమయ శ్శివః** - శివుడు కూడా విష్ణువుతో ఏకం. **యధాంతరం**

**నపశ్యామి తధామే స్వస్తి రాయుషి** - ఇంతకూ ఇద్దరికీ అణుమాత్రం భేదం చూచినా దెబ్బ తింటాము. అలా తేడా చూడనంత వరకూ మనకు క్షేమం. ఆయుర్ధాయం పెరుగుతుంది. నిర్విఘ్నంగా నూరేండ్లు బ్రతికినా బ్రతుకుతాం. లేకుంటే అర్ధాయుష్కులమై నడమంతరంగానే నశించి పోతాం.

చూడండి. ఎంత గొప్ప ఉపదేశమో ఇది మనకు. ఈ సూక్ష్మం తెలియక మా విష్ణువు గొప్పని కొందరూ లేదు మా శివుడే గొప్పని కొందరూ - శివుడు శ్మశాన వాసి అమంగుళుడని వారూ - విష్ణువు భోగలాలసుడూ అలంకార ప్రియుడూ షోకిలా పురుషుడని వీరూ - తెలిసీ తెలియక ఒకరితో ఒకరు కుమ్ము సుద్దు లాడుతున్నారు. వీరి కటు శాస్త్రమూ తెలియదు. ఇటు పురాణ హృదయమూ తెలియదు. మిడి మిడి జ్ఞానంతో సతమత మవుతున్న మూర్ఖులు వీరు. **సపండితాప శదః మూర్ఖ ఇన ఉపేక్ష ణీయః** అని భగవత్పాదులు చెప్పినట్టు వీరిని పనికి రాని వారి జాబితాలో చేర్చి ఒక లంబరు రూములో పారేయటం తప్ప మనం చేసే దేమీ లేదు. వారితో చర్చకు దిగటం మనకే సిగ్గు చేటు. ఇద్దరికీ ఒక పక్క అభేదం స్పష్టంగా కనిపిస్తున్నా ఇంకా వీరు తగాదా పడుతున్నారంటే ఎంత హాస్యాస్పదం. విష్ణు నామాలలో కుప్పతెప్పలుగా ఉన్నాయి శివనామాలు. వాటినేమి చేస్తారు వైష్ణవులు. చదవటం మానేస్తారా.

మహా పాపం. ఈశ్వర నామ ముచ్చరిస్తే పాతకమని చెప్పి వెంకట రమణా శ్రీనివాసా అని కేకలు పెడతారే. **ఈశ్వర స్సర్వభూతానాం - కర్తా భోక్తా మహేశ్వరః** ఇలాటి గీతా వాక్యాల నెలా ఉచ్చరిస్తారు. **శివ మద్వైత** మనే ఉపనిష ద్వాక్యాన్ని ఎలా సమన్వయిస్తారు. వీరి పిచ్చి గాని విష్ణు నామాల్లో శివనామాలెలా ఉన్నాయో – శివ నామాల్లో విష్ణు. నామాలూ ఉన్నాయి. అసలు శివమంటే మంగళం. శుభం. అది జ్ఞానం. అదే సర్వవ్యాపక మయితే విష్ణు. స్వరూప స్థితిలో ఉంటే బ్రహ్మం – బ్రహ్మ విష్ణు మహేశ్వరు లందుకే ఒకే ఒక తత్త్వం. కాళిదాసాది మహాకవులూ దార్శనికులూ ఎప్పుడో గ్రహించారీ రహస్యం. లోకులకు బోధించారు. అయినా ఈ ప్రబుద్ధుల కింకా అర్థం కాలేదంటే భగవత్పాదులన్నట్టు మూర్ఖులని మనం త్రోసి పుచ్చటమే తప్ప చేసేది లేదు.

అయితే శివకేశవులనేవి జ్ఞాన జ్ఞేయాలనీ అవి ఒకదాని కొకటి సాపేక్ష Relative మనీ చెప్పారే. నిరపేక్షమైన Absolute తత్త్వ మొకటి వీటి కాధారమైన దుంటే గదా ఆ మాట చెల్లుతుంది. ఆ నిరపేక్షమైన ఒకే ఒక తత్త్వమేమిటని ప్రశ్న. దానికిప్పుడు సమాధాన మిస్తున్నారు మహర్షులు.

**నమో స్త్వనంతాయ - సహస్ర మూర్తయే**

**సహస్ర పాదాక్షి శిరోరు బాహవే**

**సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే**

**సహస్ర కోటీ యుగ ధారిణే నమః**

అనంతాయ - అనంతమని ఒక్కమాటలో నిర్దేశించారు దాన్ని. అంతం లేని దేదో అది అనంతం. దేశకాల వస్తువులే మన జ్ఞానానికంతం. అవి జ్ఞానంలో నే లయమై జ్ఞాన మఖండంగా మిగిలిపోతే అది అనంతమూ ఏకమే అవుతుంది. దానికప్పుడు మరొక దాని అపేక్ష లేదు కాబట్టి నిరపేక్షమది. దానికే ప్రజ్ఞానమని పేరు పెట్టిందుపనిషత్తు. ప్రజ్ఞానం బ్రహ్మ బ్రహ్మం ప్రజ్ఞాన స్వరూపమట. ప్రకృష్టమైన జ్ఞానమే ప్రజ్ఞానం. ప్రకృష్టమంటే పరిపూర్ణం. జ్ఞానం పరిపూర్ణ మెప్పుడవుతుంది. జ్ఞాతా జ్ఞేయం రెండు కొసలూ అందులో లయమైతే అప్పుడది పరిపూర్ణం. జ్ఞాతే జీవుడు జ్ఞేయమే జగత్తు. ఇవే అన్నాన్నాదులు. ఇవే శివకేశవులు. ప్రజ్ఞానంలో నుంచి రెండు కొసలూ బయటకి వస్తే ఏర్పడుతాయవి. లోపల చేరితే ఒక్కటే. ఇవి రెండూ దానికి శాఖలైతే అది మహా వృక్షం. శాఖలు వృక్షం కన్నా వేరుగా నట్టే పరిపూర్ణమైన ఆ జ్ఞానానికీ జ్ఞాతృజ్ఞేయాలు వేరుగావు. అంటే శివకేశవులు ఇద్దరూ కలిసి బ్రహ్మ స్వరూపంగా ఏకమేనని చెప్పక చెప్పినట్టయింది. ఈ రహస్యం తెలియకనే పేచీ పడుతున్నారీ మూర్ఖులని వ్యంగ్యంగా అతివాదులకు బుద్ధి చెప్పినట్టు కూడా అయింది.

**నమోస్త్వనం తాయ** - అలాటి ఏకమైన అఖండమైన తత్త్వానికి నమస్కారం. అనంతమయి నప్పుడది ఆత్మ స్వరూపమే గదా. ఇక నమస్కార మెవరికి. అంటే చెబుతున్నారు. **సహస్ర మూర్తయే** - వందలు వేలు

రూపాలు కూడా అదే ధరిస్తున్నది. స్వరూపంగా అది ఏకమే అయినా తన మాయా శక్తి ప్రభావంతో అనేక రూపాలుగా భిన్నమయి కనిపిస్తుంటుంది. ఏమిటా రూపాలని అడుగుతారా. **సహస్ర పాదాక్షి శిరోరు బాహవే -** వేలాది పాదాలు - వేలాది శిరస్సులు - వేలకు వేలు ఊరువులు - బాహువులూ - ఇలా అసంఖ్యాక మైన రూపాలు ధరించి కనిపించ గలదు. అవే ఈ చరా చర పదార్థాలన్నీ ఇప్పుడు మనం చూస్తున్నవి. ఇవి అమూర్తమైన ఆ తత్త్వం మూర్తీభవించి కనిపించే రూపాలే.

**సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే** అలాగే వేలకొలది నామాలు చాలా ఉన్నాయి దానికి. రూపాలున్నప్పుడు నామాలు కూడా ఉండి తీరుతాయి. నామరూపాలు రెండూ అన్యోన్యాశ్రయాలు. నామమంటే పేరని గాదు. మనసులో కలిగే వృత్తులు. జ్ఞానం కదిలితే అది వృత్తి Idea. దానినే నోట ఉచ్చరించి నామమంటున్నాము. ఉచ్చరించక ముందు కూడా నామమే అది వృత్తి రూపంగా. ఆ వృత్తి ఎలా ఏర్పడింది జ్ఞానంలో. జ్ఞేయ మనేది బాహ్యంగా ఒకటుంటేనే గదా. అదే రూపం Thing or form అప్పటికి రూపం లేకుంటే నామమేర్పడదు. నామమనేది ఏర్పడితే గాని ఇది రూపమని గుర్తించలేము. ఇవే వాచ్య వాచకాలూ. గ్రాహ్య గ్రాహకాలూ. శబ్దార్థాలూ అని వ్యవహరిస్తుంటారు ఎవరికి తోచినట్టు వారు. మొత్తం మీద ఈ పరస్పర మవి నాభూతంగా ఉన్న నామరూపాల కాధారమేమిటి.

అదే చెబుతున్నాడు పురుష అని. పూర్ణ త్వాత్పురుషః – పూర్ణత్వమే పురుష అంటే. పూర్ణ మెప్పుడవుతుంది. రెండు ఖండాలూ కలిసి ఏకమైతే. నామరూపాలు రెండూ దేనిలో చేరిపోతాయో అది పురుష. అఖండమైన చైతన్యం. కనుకనే ఇప్పుడర్థమవుతుంది. **నామరూప యోర్నిర్వహితా తే యదంతరా తద్బ్రహ్మ** అనే ఉపనిషద్వాక్యం. నామ రూపాలనేది మోస్తున్నదో నామరూపాలలో ఏది మరలా చేరి వాటి చేత మోయ బడుతున్నవో అదట బ్రహ్మం. మోసేది మోయబడేది రెండూ ఒకటే అప్పుడేమిటర్థం. ఆధారా ధేయాలు రెండూ బ్రహ్మమే మరేదీ లేదనే గదా. అందుకే శాశ్వతే. నామరూపాలలాగా ఎప్పటికప్పుడు వస్తూ పోయేది కాదు. శాశ్వతమైనది. ఎప్పటికీ నిలిచి ఉంటుంది. కాలం దాన్ని ఏమీ చేయలేదు. కాలాన్నే ధరించి ఉంటుందది **సహస్ర కోటీ యుగ ధారిణే నమః -** కోటాను కోట్లు యుగాలు గడిచినా వాటినది గడుపుతుందే గాని వాటివల్ల గడచిపోయేది కాదు. దీన్నిబట్టి ఏమర్థమయింది సారాంశం. నామ రూప క్రియలు మూడూ పరమాత్మ సృష్టేనని – అవి పరమాత్మకు అన్యంగా లేవని – అదే ఇన్ని రూపాలుగా అభివ్యక్త మవుతున్నదని గదా. అలాంటి దాన్ని ఆశ్రయించి స్వానుభవానికి తెచ్చుకోవాలంటే నమః దానికి అధీనమయి పోవటమే మార్గం.

**నమో బ్రహ్మణ్య దేవాయ - గో బ్రాహ్మణ హితాయ చ**

**జగద్ధితాయ - కృష్ణాయ - గోవిందాయ నమో నమః -**

ఈ శ్లోక మింతకు ముందు రావలసినదైనా దాన్ని ఇక్కడ చెప్పుకొంటేనే బాగుంటుందని నా అభిప్రాయం. ఎందుకంటే నిరపేక్షమైన తత్త్వమే సాపేక్ష మయిందని చెప్పాము. అమూర్తమే మూర్తమయిందని పేర్కొన్నాము. అమూర్తం పరమాత్మ చైతన్యమైతే మూర్తం దాని అవతారం. అవతారం లయంలో జరగదు. స్థితిలోనే జరుగుతుంది. కనుకనే శివుడవ తరించడు. విష్ణువే అవతారాలన్నీ ధరించేది. స్థితి కారుడాయనే గదా. అంచేత ఇక్కడ కృష్ణావతారాన్ని స్మరిస్తూ దానికే నమస్కృతి చెబుతున్నాడు. **గోవిందాయ నమో నమః -** గాం వింద తీతి గోవిందః భూమి మీద అవతరించిన వాడని అర్థం. అలాంటి వాడికి నమః ఎందు కవ తరించాడు. ఎలా అవతరించాడు. జగద్ధితాయ కృష్ణాయ. జగత్తు కంతా మేలు చేయటానికి. జగత్తంటే జడమైన ప్రపంచం కాదు. చేతనమైనది. చేతనులలో కూడా అధికార సంపత్తి ఉన్నవారు. చెప్పిన దర్థం చేసుకొని తామాచరించి ఇతరుల చేత ఆచరింప జేసేవారే అధికారులంటే Competent **గోబ్రాహ్మణ హితాయ** గోబ్రాహ్మణులంటే వారే. గో వంటే ఇక్కడ విద్య. బ్రహ్మ విద్య దాన్ని అందుకొని సాధన చేసే వాడెవడో వాడు

బ్రాహ్మణుడు. విద్యా విద్యా వంతుడని భావం. అలాంటి వారి నుద్ధరిస్తే పరమాత్మ - తన్ముఖంగా అందరినీ ఉద్ధరించిన వాడవుతాడు. **బ్రహ్మణ్య దేవాయ.** ఆ దేవుడప్పుడు బ్రహ్మణ్యుడవుతాడు. విద్యోపదేశం ద్వారా విద్యావంతులకు తద్ద్వారా అవిద్యావంతులకూ హితకారి అవుతాడని అర్థం. ఎవడా దెవుడెలా అవుతాడు. **కృష్ణాయ** - కర్షతీతి కృష్ణః - ఎవడలా ఉపదేశించి ఈ మానవ లోకాన్ని తన వైపు కర్షణ చేస్తాడో లాక్కొని పోగలడో వాడే కృష్ణుడు. అప్పుడే గోవిందుడు. గోవంటే విద్య అని గదా చెప్పాము. దాని బలంతో విందతి ప్రాప్నోతి. బ్రహ్మ పదాన్ని ఈ విద్యా వంతుడు పొందేలాగా చూడగలడని తాత్పర్యం.

పోతే ఇప్పుడిక బ్రాహ్మణుడైన వాడు గాయత్రికి ఉద్వాసన చెబుతున్నాడు. ఆవాహన అయింది. అనుష్ఠాన మయింది. ఇక ఉద్వాసన. గాయత్రీ అంటే బ్రహ్మ విద్య అది గదా చెప్పారు. దాన్ని నిత్యమూ దగ్గరుంచు కోవాలి గాని ఉద్వాసన చెప్పటం దేనికని ప్రశ్న వస్తుంది. దీనికి జవాబింతకు పూర్వమే చెప్పాము. విద్య అనేది కేవల మాలంబనం మాత్రమే. దాని ద్వారా అసలైన తత్త్వాన్ని పట్టుకొన్న తరువాత పదిమందికీ అందటానికి దాన్ని విస్తరింప జేయాలి. మరలా తాను విస్మరించకుండా ఎప్పటికప్పుడను సంధానమూ చేసుకొంటుండాలి. విస్తరించటమే ఉద్వాసన. అనుసంధానమే ఆవాహన. అందుకే అహరహ స్సంధ్యో పాసన.

**ఉత్తమే శిఖరే జాతే - భూమ్యాం పర్వత మూర్ధని**

**బ్రాహ్మణేభ్యోఽ భ్యను జ్ఞాతా - గచ్ఛ దేవి యధా సుఖమ్**

**స్తుతామయా వరదా వేదమాతా**

**ప్రచోదయంతీ పవనే ద్విజాతా**

**ఆయుః పృధి వ్యాం ద్రవిణం బ్రహ్మ వర్చ సం**

**మహ్యం దత్వా ప్రయాతుం బ్రహ్మ లోకమ్ -**

గాయత్రిని సంబోధిస్తున్నాడు సాధకుడు. అమ్మా గాయత్రీ మాతా! **గచ్ఛదేవి యధాసుఖం** – నీకు వీడ్కోలు చెబుతున్నాను. స్వేచ్ఛగా వెళ్లవచ్చు నీవు. **బ్రాహ్మణేభ్యః అభ్యను జ్ఞాతా -** నీ ఉపాసన నిత్యమూ చేసే బ్రాహ్మణులందరూ నీకు అనుమతి ఇచ్చారు. నీవు సామాన్యురాలవు గావు. దేవతవు. మంత్రాధి దేవతవు. ఉత్తమే శిఖరే భూమ్యాం పర్వత మూర్ధని జాతే – భూమి దగ్గరి నుంచి పర్వత శిఖరాల దగ్గరి నుంచి ఉత్తమమైన శిఖరం దాకా సర్వత్రా ఉన్న దానవు నీవు. భూమి భూలోకం. ఉత్తమ శిఖరం సత్య లోకం. సప్త లోకాలకూ వ్యాపించి ఉన్నదా పరాశక్తి అని భావం. ఇది సమష్టి విషయమైతే ఇక వ్యష్టి విషయం మన శరీరం. మన ఈ శరీరంలో అన్నమయ కోశం. పృథివీ తత్త్వం. భూలోకం. పర్వతమంటే సోపాన శ్రేణిలాగా ఉన్న మూలాధార స్వాధిష్ఠాన మణిపూర అనాహత విశుద్ధ ఆజ్ఞా చక్రాలనే ఆరు భూమికలు. అవి దాటితే ఉన్నది ఉత్తమమైన

శిఖరం సహస్రార చక్రం. అదే కైలాసం. అక్కడే శివశక్తులు రెండూ ఏకం. అర్ధనారీశ్వర మైన ఆతత్త్వమే జీవ బ్రహ్మైక్యానికి ద్యోతకం. అలాటి సాయుజ్యాన్ని ప్రసాదించేది బ్రహ్మాకార వృత్తి రూపిణి అయిన గాయత్రే. అప్పటికి గాయత్రి అంటే అర్థమయింది గదా. బ్రహ్మాండ పిండాండాలన్నీ వ్యాపించిన పరాశక్తి పరా విద్య గాయత్రి.

దాన్ని సాధించే ఉపాసకుడూ బ్రాహ్మణుడే. సాధించిన జ్ఞానీ బ్రాహ్మణుడే. అలాటి బ్రాహ్మణు లందరూ అనుజ్ఞ ఇస్తారా దేవికి. ఎప్పుడు **స్తుతామయా వరదా వేదమాతా.** వేదాలన్నిటికీ మూలభూతమైనదీ మనసారా సేవిస్తే అభీష్ట వరప్రదాయిని అయినదీ అని భావిస్తే. అలాటి భావన ఉన్నప్పుడే ప్రచోదయంతీ పవనేద్విజాతే - పవిత్రమైన ధర్మ మోక్ష పురుషార్థాలలో బుద్ధి నా శక్తి ప్రవేశ పెడుతుంది. అలా ప్రవేశించిన బుద్ధి మంతులే ద్విజాతులు. భౌతిక జన్మే గాక జ్ఞాన జన్మ కూడా ఎత్తిన వారు. వారిలో నేనూ ఒక సాధకుడనే నమ్మా. అంచేత **ఆయుః పృథివ్యాం - ద్రవిణం బ్రహ్మవర్చసం - మహ్యం దత్వా.** దీర్ఘకాల జీవితాన్ని ప్రసాదించు నాకీ లోకంలో. జీవితముంటేనే అన్నీ. లేకుంటే ఏదీ లేదు. బ్రతకటానికి కావలసిన దేమిటీ ద్రవిణం. ధనం - ధనమంటే డబ్బే గాదు. కావలసిన వస్తు వాహనాదులన్నీ. అయితే ఇది ఐహికమే. పోతే ఆముష్మికం మరొకటున్నది. అది బ్రహ్మ వర్చసం. బ్రహ్మ జ్ఞానం వల్ల ఏర్పడే దివ్య తేజస్సు. ఇవి రెండే నాకభిమతమైనవి. అవి నాకు ప్రసాదిస్తే నేను

**ప్రయాతుం బ్రహ్మ లోకం.** బ్రహ్మైవ లోకః బ్రహ్మ లోకః అన్నారు భాష్యకారులు. బ్రహ్మ సాయుజ్యమన్న మాట. అది పడయటానికి నీవే నా కాలంబనం. విద్యయా అమృత మశ్నతే అన్నారు. అలాటి బ్రహ్మ విద్యవు నీవే గనుక నీవల్ల నేనా సాయుజ్యానికి నోచుకోగలను. అది నాకు సిద్ధమయిందని విశ్వసించినప్పుడే నీకు నేను వీడ్కోలు చెబుతున్నాను. నీవు యధేచ్ఛగా వెళ్లవచ్చు నంటాడు.

**ఇదం ద్యావా పృథివీ సత్యమస్తు**

**పిత ర్మాత ర్యది హోప బ్రువే వాం**

**భూతం దేవానా మవమే అవోభిః**

**విద్యా మేషం వృ జినం జీర దానుమ్ -**

ఇప్పుడు నేను చెబుతున్న మాట సత్యమో కాదో నని శంకించనక్కర లేదు. కావలిస్తే ఇది యధార్ధమని చెప్పటానికి ఈ ద్యావా పృధువులే సాక్షులు. పైన ఆకాశమూ క్రింద భూమి. ఈ రెండింటి మధ్యనే బ్రతుకుతున్నాడు మానవుడు. ఎవరో కాదు. వారిద్దరూ నాకు తల్లిదండ్రులు. పితర్మాతః ఆకాశము తండ్రి – భూమి తల్లి. అది వర్షిస్తే ఇది ఫలిస్తుంది. దానివల్లనే మా జీవితం నడుస్తున్నది. కనుక అవే నాకు తల్లిదండ్రులని వారిని సంబోధిస్తున్నాడు. **యది హోపబ్రు వేవాం సత్యమస్తు.** నేను మీ సమీపంలో అన్న ఈ మాట వాస్తవమని మీకు తెలియదా. తెలుసు.

**భూతం దేవానా మవమే అవోభిః -** మీరు దేవతలనూ రక్షించగలరు – మాబోటి మానవులనూ కాపాడగలరు. దేవతలెవరో గాదు – మా మనః ప్రాణాదికరణ వర్గమే. ఇవి మీ మీద బ్రతుకు తున్నాయి. వీటి కాహారం పానీయం మీరేగదా ఇస్తున్నారు. **విద్యామ ఇషం -** మీవల్లనే ఇంత తిండి తిని బ్రతుకు తున్నాము. వృజినం జీర దానుం – నిర్దుష్టమైన మాకు జీవనాధారమైన దదే. దానివల్లనే శరీరమూ మనసూ పనిచేస్తున్నాయి. తన్మూలంగానే బ్రహ్మ జ్ఞానానికీ నోచుకొన్నాము. కనుక మీకు మేమెప్పుడూ కృతజ్ఞులమే.

**ఆకాశాత్పతితం తోయం - యధా గచ్ఛతి సాగరం**

**సర్వదేవ నమ స్కారః - కేశవం ప్రతి గచ్ఛతి**

**సర్వ వేదేషు య త్పుణ్యం - సర్వ తీర్థేషు యత్ఫలం**

**తత్ఫలం పురుష ఆప్నోతి - స్తుత్వా దేవం జనార్దనం**

**వాసనా ద్వాసు దేవస్య - వాసితం తే జగత్త్రయం**

**సర్వభూతనివా సోసి - వాసు దేవ నమోస్తుతే**

ఈ విధంగా సర్వమూ బ్రహ్మమే నని వస్తు సిద్ధంగానే గాక అది మనకు బుద్ధి సిద్ధం కూడా ఎప్పుడవుతుందో అప్పుడిక చెప్ప బని లేదు. సృష్టిలో తేడా అనేది ఏ మాత్రమూ కనిపించదు. ఏది చూచా బ్రహ్మమే.

ఏ పని చేసినా అది బ్రహ్మమే. సర్వమూ బ్రహ్మం వైపే ప్రయాణం చేస్తున్నట్టు కలుగుతుంది అనుభవం. అది ఎలా ఉంటుందో వర్ణిస్తున్నాయా శ్లోకాలు.

**ఆకాశాత్పతితం తోయం** - ఆకాశంలో మేఘాలు తయారయి వర్షం కురుస్తుంటుంది. నేలమీద పడ్డ ఆ జల మక్కడ నిలవదు. **యథాగచ్ఛతి సాగరం**. సాగరంలో కలిసే దాకా అది ప్రవహిస్తూనే పోతుంది. సాగరమే దానికి గమ్యం. నదీనాం సాగరో గతిః అన్నారు. అలాగే సర్వదేవ నమస్కారః – నీవు ముక్కోటి దేవతలలో ఎవరికి చేయి నమస్కారం. అది ఒక నది లాంటిదా దేవత. దానికి చేసిన స్తుతి నమస్కారాదులన్నీ చివరకు సముద్రం లాంటి కేశవం ప్రతిగచ్ఛతి. పరా దేవత అయిన పరమాత్మకు చెందేదే. కేశవ అనే మాట క అ ఈశ. అంటే త్రిమూర్తులుగా భాసించే అమూర్తమైన పరమాత్మ అనే అర్థం.

అంతే కాదు. **సర్వే వేదేషు యత్పుణ్యం - సర్వ తీర్థేషు యత్ఫలం** - వేదాలన్నీ వల్లిస్తే ఏ పుణ్యం లభిస్తుందో – గంగాది తీర్థాలన్నిటిలో మునిగితే ఏ ఫలం లభిస్తుందో – తత్ఫలం పురుష ఆప్నోతి. ఆ ఫలిత మంతా మానవుడు పొందగలడు. ఎలాగ. అవన్నీ సేవించి కాదు. **స్తుత్వా దేవం జనార్దనమ్** - జనులందరికీ ప్రార్థనీయుడైన ఆ పరమాత్మను ఆరాధిస్తే చాలు. వీటన్నిటి ఫలమూ అందులోనే కలిసి వస్తుంది. ఇవి వ్యష్టి అయితే అది సమష్టి. సమష్టిలో వ్యష్టి లయం కాక తప్పదు. దానికి

కారణ మొక్కటే. సమష్టి అంటే సామాన్యం సర్వత్రా వ్యాపించి ఉంటుందది. సర్వత్రా అంటే విశేషాన్నింటినీ అని అర్థం. ఏమిటా విశేషాలు. బాహ్యమైన రూపాలన్నీ సద్విశేషాలు. ఆంతరమైన నామాలూ లేదా భావాలన్నీ చిద్విశేషాలు. Both Things and Ideas. వీటన్నిటిలో పరుచుకొని ఉన్నదే దంటారు. ఆసచ్చిద్రూపమైన సామాన్యమే. అదే వాసుదేవ అంటే.

**వాసనా ద్వాసు దేవస్య వాసితంతే జగత్త్రయం.** ఈ మూడు లోకాలూ వాసితమయి ఉన్నాయి ఆ వాసుదేవ వాసనతో. ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్తని ఉపనిషత్తే ఘోషిస్తున్నది. ప్రతి ఒక్కటీ అది దృష్టం గాని ఆనుశ్రవికం గాని అస్తిభాతి అనే గదా చూస్తున్నావు. ఆ రెండు భావాలూ వదిలేసి ఏదైనా పట్టుకోగలదా నీ బుద్ధి. కనుక **సర్వభూత నివాసోసి వాసుదేవ -** ఓ సచ్చిదాత్మకమైన పరమాత్మా! సమస్తమైన చరా చర పదార్థాలలోనూ నీవే నివసిస్తున్నావు నీలోనే మరలా ఆ పదార్థాలు నివసిస్తున్నాయి. ఆధారా ధేయాలు రెండూ నీవే. ఇక ఈ ప్రపంచ మెక్కడిది. జీవకోటి ఎక్కడిది. ముక్కోటి దేవత లెక్కడున్నారు. అదంతా మూడు భంగిమలలో వ్యాపించిన నీ విభూతే సుమా. కనుక **నమోస్తుతే** నీకు నమస్కరిస్తే చాలు. నీకూ నీ విభూతికీ చేసినట్టే చెందినట్టే నీకు. అంటే ఏమని భావం. అంతా పరమాత్మే ననే భావన మనకు బలపడితే మనమేది చేసినా మనకు మనమే చేసుకొంటున్నా

మనే సర్వాత్మ భావ మపరోక్షంగా అనుభవానికి రాగలదు. అదే జీవిత ధ్యేయం. పరమ పురుషార్ధం. అంతకన్నా వాంఛించ దగినదిక ఏదీ లేదు మానవుడు. సమస్యలన్నీ అప్పుడిక సమసి పోవలసిందే. అదే సిద్ధి. ఇలాటి పురుషార్ధం సిద్ధించాలంటే ఏమిటి కర్తవ్యం. వినండి.

**చతుస్సాగర పర్యంతంగో బ్రాహ్మణేభ్యః శుభం భవతు**

**ఆంగిరస బార్హస్పత్య భారద్వాజ త్రయార్షేయ**

**ప్రవరాన్విత భారద్వాజ సగోత్రః - యజుర్వేదీ - తైత్తిరీయ**

**శాఖాధ్యాయీ - ఆపస్తంబ సూత్రః -**

**శ్రీ నివాస శర్మా అహం భో అభివాదయే -**

అని ఇలా ఎవరికి వారు తమ ప్రవర చెప్పుకొని ఆ వాసుదేవ తత్త్వానికి అభివాదనం చేయాలి. వాసుదేవ అనేది పరిపూర్ణ చైతన్య స్వరూపం. పరిపూర్ణ శక్తి సమన్వితం. అదే మనకు జీవిత లక్ష్యం. కాని ఇప్పుడు మనమలా పరిపూర్ణులం కాము. అపరిపూర్ణ జ్ఞానమూ అపరిపూర్ణ శక్తే మనది. అది సమష్టి అయితే మనం వ్యష్టి. వ్యష్టిగా ఉన్నంత వరకూ సమస్యే. జనన మరణాలు తప్పవు. ఇహ పరాలకు రాకపోకలు తప్పవు. ఇవి తప్పించుకోవాలంటే వ్యష్టిగా ఉన్న మనం సమష్టిగా మారాలి. కొత్తగా మారటం కూడా కాదది. మనలో అంతర్గతంగా ఉన్న పరిపూర్ణతనే మరలా

అను సంధానం చేసుకోవటమే. వ్యష్టి రూపంగా ఉన్నదా సమష్టి రూపమైన అహమే గాబట్టి మరలా ప్రత్యభిజ్ఞా బలంతో నేనా సమష్టి రూపమైన అహమేనని భావన చేయాలి మనం.

అందుకోసమా పరిపూర్ణమైన అహంభావానికి ఈ వ్యష్టి గతమైన అహంకారాన్ని సమర్పిస్తున్నాము మనం అభివాదన వ్యాజంతో. మరి ఎవడీ వ్యష్టి అంటే గుర్తు చేస్తున్నాడు. నేల నాలుగు చెరగులూ సముద్రమే వ్యాపించి ఉంది. ఈ నేలమీదనే నివసిస్తున్నారు గో బ్రాహ్మణులు. అనగా విద్యా విద్యావంతులూ. అవే జన్మ తారక మెప్పటికైనా. అవి రెండూ సుఖంగా ఉంటే మిగతా అందరికీ సుఖం. కనుక వారికి శుభం కోరవలసి ఉంది మొదట. తరువాత మన ప్రవర చెప్పుకోవాలి. ప్రవర అంటే మనమే ఋషుల వంశంలో జన్మించామో ఆ ఋషుల గోత్ర సూత్రాలు. వారు బ్రహ్మ విద్యా పారంగతులూ బ్రహ్మిష్ఠులూ గనుక మనకూ అదే ప్రసాదిస్తారు. అందులో ఒక్కొక్క గోత్రాని కొక్కొక్కరుంటారు ఋషులు. ఎవరిదే గోత్రమో అందులో ఎందరున్నారో ఋషులు - వారి పేర్లు స్మరించవలసి ఉంటుంది వారు. మాది ప్రస్తుతం భారద్వాజ గోత్రం. భరద్వాజుడికి సగోత్రులం మేము. అంచేత నేను భారద్వాజ సగోత్రుణ్ణి. మరి ఈ గోత్రాని కెందరు ఋషులు. ముగ్గురు. ఒకరు ఆంగిరసుడు.

అంగిరుని కుమారుడు బృహస్పతి. ఆయన కుమారుడు బార్హస్పత్యుడు. రెండవ ఋషి. పోతే ఆయన కుమారుడు భరద్వాజుడు మూడవ వాడు. త్రయార్షేయ మీ గోత్రం. ముగ్గురు ఋషులున్న గోత్రమని అర్థం.

అంతేకాదు. ఋషుల గోత్రంలో జన్మిస్తే సరిపోదు. మనకా ఋషిత్వ మంటే దర్శనముందా అని ప్రశ్న. ఉందనిపించుకోవాలి. ఎలాగా. యజుర్వేదీ. ఒక వేదమైనా సాంగో పాంగంగా నేర్చుకొని ఉండాలి. తైత్తిరీయ శాఖాధ్యాయిా అందులోనూ తైత్తిరీయ మనే శాఖ క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఉండాలి. అంటే బ్రహ్మ జ్ఞాన మలవడి ఉండాలి. అలాగే దాన్ని వివరించి చెప్పే అపస్తంబ సూత్రాలు తెలిసి ఉండాలి. అందులో అధ్యాత్మ పటల మని ఉంది. అదంతా బ్రహ్మ విద్యే. ఆ శాఖా ఈ సూత్రమూ ఇంతవరకూ ఏదో యాంత్రికంగా వల్లె వేసి ఉండవచ్చు. అర్థం లేని చదువు వ్యర్థమన్నారు. వ్యర్థం కాదు ప్రతి పదార్థం కూడా గ్రహించానని నీవు చాటుకోవచ్చు. కాని వాటన్నిటికీ వివక్షితమైన ఏ బ్రహ్మ తత్త్వ మున్నదో అది పరోక్షంగా గాక అపరోక్షంగా గ్రహించ గలిగావా. లేదు. అందుకే అలాటి అనుభూతిని ప్రసాదించమని వంశ ఋషులకు **అహం భో అభివాదయే** అని నీ పేరూ ఊరూ చెప్పుకొని నమస్కరించాలి – **ఆచార్యవాన్ పురుషో వేద** అన్న దుపనిషత్తు – ఎంత శాస్త్రాధ్యయనం చేసినా శాస్త్ర జ్ఞానమే గాని ఆగమ జ్ఞానం Intutive Knowledge లేదు మనకు. అలాటి అపరోక్ష జ్ఞానం గురు ముఖంగానే లభించా లెప్పటికైనా. అందుకోసమే ఈ గోత్రా

చార్య స్మరణం అభివాదనం ఇదీ ఇందులో ఉన్న రహస్యం.

ఇక్కడికి అంతా ముగిసింది - గాయత్రీ ఆవాహనం దానికి మూలమైన సూర్యోప స్థానం - గాయత్రీ జపం. చివరకు గాయత్రీ శక్తి కధిష్ఠానమైన వాసుదేవ తత్త్వాను సంధానం. దాన్ని మనకందించే ఆచార్య పరంపరాభి వాదనం - అంతా అయింది. సంధ్యా వందనమూ గాయత్రీ ఆవాహనోద్వాస నాదులూ అన్నీ సమస్త మయినాయి. పోతే ఇదంతా కర్మ కలాపమే. కర్మ కర్మగా మనల నుద్ధరించదు. అది జ్ఞానానికి దారి తీసి ఆ జ్ఞానం మన కొంట బట్టినప్పుడే పురుషార్థ సిద్ధి. సర్వం కర్మా ఖిలం పార్థ జ్ఞానే పరి సమాప్యతే - అన్నాడు కృష్ణ భగవానుడు. కనుక మనసా వాచా కర్మణా ఏది మనమెప్పుడు చేసినా అది ప్రకృతి విలాసమే కాబట్టి ఆ ప్రకృతి గుణాలతో సహా ఈ కర్మ కలాపమంతా ఆత్మజ్ఞానాగ్నిలో పూర్ణాహుతి చేసి పూర్ణ జ్ఞాన స్వరూపంగా మనలను మనం భావన చేయాలి. అప్పుడు నరులం కాము మనం. కేవలం నారాయణ స్వరూపులమే. ఆభావమే ఇప్పుడీ చివరి శ్లోకం బయట పెడుతున్నది. భగవద్గీతలో చరమ శ్లోకం వంటిదిది.

**కాయేన వాచా మనసేంద్రియై ర్వా**

**బుద్ధ్వాఽ త్మనా వా ప్రకృతేః స్వభావాత్**

**కరోమి యద్య త్స కలం పరస్మై**

**నారాయణా యేతి సమర్పయామి -**

నారాయణత్వం మనకు రావాలంటే మనకిప్పుడున్న నరత్వం పోవాలి. నరత్వమే జీవ భావం. జీవుడంటే కర్తా భోక్తా. కర్తృత్వ ముంటే చాలు. భోక్తృత్వం పిలిస్తే పలుకుతుంది. కర్తనని ఎప్పుడను కొన్నాడో అప్పుడు కర్మ అనేది తయారయింది. కర్మ చేసేవాడే కర్త. దేనితో చేయాలా కర్మ. దేనితో అన్నప్పుడది కరణం. కర్మ సాధన మని అర్థం. ఎన్ని అవి మూడు. **కాయేన వాచా మనసా** - మనో వాక్కాయాలు. వీటికే త్రికరణాలని పేరు. ఏ పని చేయాలన్నా మనసుతో ముందు సంకల్పిస్తాము. తరువాత మాట ద్వారా బయటపెడతాము. ఆ తరువాత శరీరంతో చేస్తాము.

ఇందులో వాక్కనేది కర్మేంద్రియాలలో ఒకటి. కర్మేంద్రియాలూ - జ్ఞానేంద్రియాలూ అన్నీ కలిసి మొత్తం పది ఇంద్రియాలు. ఇవన్నీ కరణాలే. పనిచేసే సాధనాలే. అంచేత వాక్కంటే ఒక వాగింద్రియమే ననుకొంటారని **ఇంద్రియైర్వా** అన్ని ఇంద్రియాలనూ పరిగణిస్తున్నదీ మాటతో. పోతే కరణాలే చెప్పారు గాని ఇంతవరకూ కర్త ఎవరో చెప్పలేదే అంటే కంఠోక్తిగా చెబుతున్నాడిప్పుడు. **బుద్ధ్యాత్మనావా** అని. బుద్ధ్యాత్మ విజ్ఞానాత్మ అంటే కర్త్రాత్మ. జీవుడని అర్థం. వాడే కర్త. పోతే కర్మ ఏమిటిక. ఒకటి గాదు. సవాలక్ష. అవినిత్య నైమిత్తిక కామ్య నిషిద్ధాలే కావచ్చు. లేదా లౌకికమైన దర్శన స్పర్శన వచనా దానాదులే కావచ్చు. అటు శాస్త్రీయమైనవీ కర్మలే. ఇటు లౌకికమైనా అవీ కర్మలే. వాటినే **యద్యత్కరోమి** అనే మాటలో

సూచిస్తున్నాడు. ఏది చేస్తున్నా అది కర్మే. సకలం. మనోవాక్కాయాలతో చేసే సమస్తమూ.

అయితే ఎందుకు చేయవలసి వస్తున్నదీ కర్మ కలాపమంతా ఈ జీవుడనే కర్త. **ప్రకృతేః స్వభావాత్ -** ప్రకృతి వాడిచేత చేయిస్తున్నది. అలా చేయించటం దాని స్వభావం. చేయిస్తే చేయటం వీడి స్వభావం. ప్రకృతి గుణాలనేవి మనలోపలా వెలపలా పరచుకొని ఉన్నాయి గదా. ప్రకృతేః క్రియ మాణాని గుణైః కర్మాణి అని భగవానుడే చెబుతున్నాడు. కార్యతే హ్యావశః కర్మ సర్వః ప్రకృతి జై ర్గుణైః – మన కిష్టమున్నా లేకున్నా బలవంతంగా చేయిస్తుంటాయి ప్రకృతి గుణాలు. అది సత్త్వమే కావచ్చు. రజస్సే కావచ్చు. తమస్సే కావచ్చు. మనస్సు సత్త్వ ప్రధానం. ప్రాణం రజః ప్రధానం. శరీరం త మః ప్రధానం. ఇక మనం కర్మ చేయకుండా తప్పించు కోట మెలాగా. చేసి తీరవలసిందే.

ఇలా కర్తృ కరణ క్రియలు మూడూ ఎప్పుడు తోడయినాయో సంసారమనే విష వలయంలో నుంచి బయటపడలేడీ జీవుడనే నరుడు. ఇలాటి నరుడు నారాయణుడు కావాలంటే ఇప్పుడేమిటి మార్గం. **నారాయణాయేతి సమర్పయామి.** చేయకుండా మానేయటం కాదు. చేస్తున్న ప్రతి కర్మా నారాయణుడికే సమర్పించాలి. నరుల కయనం గదా నారాయణుడంటే. అయన మంటే అధిష్ఠాన మాశ్రయం Base.

నదీ నాం సాగరోగతిః అన్నారు. గంగానది తన స్వరూపాన్ని సాగరాయ సమర్పయామి అన్నదంటే సాగరంలో కలిసి పోవటమే. అలాగే నరుడు తన కర్మ ప్రవాహాన్ని అంతటినీ నారాయణాయ సమర్పయామి అనుకొంటూ పోవాలి ప్రతిక్షణమూ. ఎలాటి వాడా నారాయణుడు. పరస్మై. వీడు అపర అయితే వాడు పర. అంటే వీడు గుణాధీనుడయితే వాడు గుణాతీతుడు. గుణాలను గుణాతీతంగా భావించటమే ఈ అర్పణం. అర్పించే సంకల్పంతో ఏ పని చేసినా అదే త్రికరణాలనూ శుద్ధి చేసి నరుడు నారాయణుడవుతాడు. జీవ భావం బ్రహ్మ భావంగా మారిపోతుంది. సదా తద్భావ భావితః అన్నట్టు అంతా మన భావనే. వాస్తవంగా జరగ లేదు గదా ఈ సృష్టి. జగత్తు గాని జీవుడు గాని ఆ భాసే గాని వాస్తవం కాదు. వాస్తవం బ్రహ్మ తత్త్వమే. అంచేత ఆ వాస్తవమైన తత్త్వాన్ని భావిస్తూ పోతే జీవ జగత్తులు వాస్తవంగా గాక ఆభాసగా దర్శనమిస్తాయి సందేహం లేదు.

నిత్యమూ ఈ అఖండాత్మ భావనతో ఉంటే చాలు. ఈ జీవుడే కర్మ చేసినా చేయకున్నా వాడు వస్తుతః ఈశ్వర స్వరూపుడే. జీవత్వమే వాడి కాభాస అయిపోతుంది. ఇప్పుడర్థ మవుతుంది మనకు. సంధ్యావందన ప్రక్రియలో మొట్ట మొదటి శ్లోకానికి చిట్ట చివరి ఈ శ్లోకానికీ ఉన్న సంబంధమేమిటో. **అపవిత్రః పవిత్రోవా** అని గదా ప్రారంభించాము

మనం సంధ్యావందనం. శుద్ధీ అశుద్ధీ మనసులో ఉండాలి గాని బాహ్యంలో కాదని మొదట గ్రహించాము. అదే ఇక్కడ మరలా ఆవృత్తి అవుతున్నది. చేసే ప్రతి పనీ పరమాత్మ భావనతో చేస్తే మనం పవిత్రులమే. అక్కడ **యః స్మరే త్పుండరీకాక్ష** మన్నాడు. ఇక్కడ **నారాయణా యేతి** అంటున్నాడు. ఆద్యంతాలు రెండూ కలిపి పట్టుకొంటే పరమాత్మ తాలూకు స్మరణ లేదా భావనే ప్రధానమదే కర్మ మాలిన్యాన్ని క్షాళితం చేసి మన జీవత్వమనే సంకుచిత భావాన్ని నిర్మూలిస్తున్నదని చెప్పినట్టయింది – ఇదే ఏకవాక్యత Consistancy శాస్త్రంలో.

**ఓమ్**

**తత్స**

**ద్బ్రహ్మార్పణ**

**మస్తు**

# ఫలశ్రుతి

అయింది. సంధ్యా వందన మయింది. గాయత్రీ మంత్రార్ధ మయింది. రెండూ ఇక్కడికి సమాప్తమయ్యాయి. రెండని మాటే గాని సంధ్యా గాయత్రీ రెండూ వాస్తవాని కొకటే. పరమాత్మ మాయా శక్తే అది. అది మనం చేసే కర్మానుష్ఠానంలో మధ్యలో కనిపిస్తున్నా దాని పూర్వోత్తరాలు రెండు వైపులా వ్యాపించి ఉంది. అపవిత్రః పవిత్రోవా మొదలు కాయేన వాచా వరకు దాని సామ్రాజ్యమే. పరమాత్మ కూటస్థమైనా ఆయన శక్తి క్రియా రూపిణి కాబట్టి దేహళీ దత్త దీప న్యాయంగా ఇటూ అటూ ప్రసరిస్తూనే ఉంటుంది. అది దాని స్వభావం. అది పరమాత్మ దగ్గర విద్యారూపిణి ఆశక్తి. అదే జీవులమైన మన దగ్గరికి వచ్చేసరి కవిద్యా రూపిణిగా మారింది. కనుకనే ఆయన మనకు స్వరూపమే అయినా దూరమై పోయాడు. ఆయన దూరమయ్యే కొద్దీ ప్రపంచం మనకు దగ్గర పడి మనలను చుట్టు ముట్టి మనకు బాధకమై కూచుంది.

ఇప్పుడిందులో నుంచి మరలా మనం బయట పడాలంటే మన స్వరూపమే అయిన పరమాత్మను గుర్తు చేసుకొని దానివైపు తిరిగీ ప్రయాణం సాగించాలి. ప్రయాణం శారీరకం గాదు. మానసికం. ఎందుకంటే సృష్టి

వాస్తవంగా జరగలేదు. జరిగిందని చేసిందని కేవలం మన భావనే Notional not actual. ఒక్క మానవుడి భావనే అయితే సరిపోదు. ఈశ్వరుడి భావన కూడా తోడవ్వాలి దానికి. ఈశ్వర భావన వ్యక్తమయితే అది భౌతిక ప్రపంచం. అలా వ్యక్తమయిందే వాస్తవమని భావించి తన్నిమిత్తంగా కష్ట సుఖాలను భవిస్తున్నా ననుకొంటే అది భావ ప్రపంచం. రజ్జువు సర్పరూపం ధరించి కనిపిస్తే అది రజ్జు శక్తి. రజ్జువును చూడక దాన్ని సర్పాకారంగా దర్శిస్తే అది మన దృక్శక్తి – రెండూ శక్తే అయినా ఒకటి విద్యా మరొకటి అవిద్య. రజ్జు స్థానీయమైన పరమాత్మ ప్రపంచాకారంగా భాసించట మాయన విద్య అయితే తదాకారంగా భావించి చూడటం మన అవిద్య.

ఇప్పుడీ అవిద్య మనకు తొలగి పోవాలంటే మనపాటికి మనం పోగొట్టు కోలేము. ఆయన సాహాయ్య మెంతైనా అవసరం. కారణం మన దవిద్య. ఆయనది విద్య. అవిద్య పోవాలంటే విద్యే దాని కుపాయం మరేదీ గాదు. కనుక ఆ ఈశ్వర శక్తి మనకు తోడ్పడాలి. తప్పదు. ఎలాగా అని తాపత్రయ పడ నక్కర లేదు. మన బలహీనత గమనించి దాని పాటికదే మనకు కరావలంబ మిచ్చి పైకి లేపుతున్నది. నామరూప క్రియాత్మకంగా వ్యాపించినదా దివ్య శక్తే. సృష్టి తేజోబన్నాత్మాక మని వర్ణిస్తున్నది ఛాందో గ్యోపనిషత్తు. **తత్తేజ అసృజత.** అది తేజస్సును సృష్టించిందట మొదట.

**తత్తేజ అపః తా ఆపః అన్న** మని వరుసగా సృష్టి అయినాయి మూడూ. అయినా యంటే నిజంగా అయినాయని కూడా కాదు. పరమాత్మ శక్తే తేజస్సనే ఉపాధిగా జలమనే ఉపాధిగా అన్నం లేదా పృధివి అనే ఉపాధిగా ప్రకటమయి కనిపిస్తున్నాయని భావం. అప్పటికివన్నీ పరమాత్మే. వీటిని పట్టుకొని పోతే చాలు. పరమాత్మ దగ్గరికే తీసుకెళ్లి చేరుస్తాయి మనలను. ఈ తేజస్సే దైవతం – జలమే తీర్థం – పృధివే క్షేత్రం. లోకంలో మనమొక క్షేత్రానికి పోయి అక్కడ ఒక తీర్థంలో స్నానం చేసి ఆ దేవుణ్ణి దర్శిస్తున్నా మంటే అందులో ఉన్న సంకేతమిదే. తేజోబన్నాలు మూడింటికీ దైవత తీర్థ క్షేత్రాలు మూడూ కేవలం సంకేతాలు.

కనుకనే సంధ్యావందన ప్రక్రియ అంతా మొదటి నుంచీ చివర దాకా తేజస్సూ జలమూ పృధివీ – ఈ మూడు తత్త్వాల తోనే ముడిబడి ఉంది. అనుష్ఠాన మంతా మూడింటితోనే సాగుతున్నది. **సవితుర్వ రేణ్యమని – సూర్యశ్చమా – అగ్నిశ్చమా** అని **ఆసత్యేన రజసా – హగ్ంస శ్శుచిషత్తని** అంటూ సూర్యోప స్థానం చేస్తున్నా మంటే అదంతా తేజస్సుకు సంబంధించింది. అలాగే **అపోహిష్ఠా మయోభువః హిరణ్య వర్ణా శ్శుచయః** అని మాటి మాటికీ ఆచమనం చేస్తూ సూర్యుడి కర్ఘ్య ప్రదానం చేస్తూ ఉన్నా మంటే అదంతా జలానికి సంబంధించింది. అలాగే బాహ్యంగా పృధివ్యాది భూత పంచకమూ శారీరకంగా శిరో ముఖ నేత్ర హృదయ

కరతల కరపృష్ఠాదులూ - దశదిశలూ - గంగా యమునాది పుణ్యనదీ ప్రాంతాలూ అంతేగాక మనం నివసించే ప్రదేశమూ గృహమూ ఇలాంటి వన్నీ స్మరిస్తున్నా మంటే అది పృధివికి సంబంధించింది. సంబంధించిన దంటే ఇదే పరమార్ధమని ఇక్కడికే ఆగిపోవటం కాదు. ఇవి మూడూ ఆ పరమాత్మ తాలూకు ఏ మహాశక్తి ఉందో దాని వ్యక్తమైన రూపాలే నని గ్రహించి వీటి ద్వారా మనమా మూలభూతమైన పరమాత్మ తత్త్వాన్ని భావించాలని అర్థం. భావనలోనే పడిపోయాము కాబట్టి మరలా భావన తోనే పైకి లేవాలి. పరమాత్మను తేజోబన్నాలుగా భావన చేయటం పడి పోవటమైతే మనకందు బాటులో ఉన్న ఈ తేజోబన్నా లేవోగా వా పరాశక్తి రూపాలే ఆశక్తి ఏదో గాదు మరలా ఆ పరమాత్మే ననే భావన పైకి లేవటం. పరాస్య శక్తి ర్వివి ధైవ శ్రూయతే అని చాటుతున్న దుపనిషత్తు. ఏక మనేక మయిందన్నారంటే మరలా ఈ అనేకాన్ని ఏకైకమైన తత్త్వంగా భావించమని ఉపదేశం. ఇదే అన్నేన సోమ్య శుంగేన - అద్భి స్సోమ్య శుంగేన అని ఛాందోగ్యం మన కుపదేశించటంలో ఉన్న ఆంతర్యం.

పోతే ఇంత గంభీరమైన అర్థాన్నంతటినీ లక్ష పొటెన్సీ హోమియో మాత్రలాంటి ఒక్క గాయత్రీ మంత్రంలో ఇమిడ్చి మనకందించారు మహర్షులు. విశ్వామిత్రులు వారు. విశ్వానికంతా హితైషులు. కనుకనే స్వయం తీర్ణాః పరాంస్తార యంతి అన్నట్టు తాము ఉత్తీర్ణులయి మనలను

కూడా ఉత్తీర్ణులను చేయటానికి తాపత్రయ పడ్డారు. అదే ఈ గాయత్రీ మంత్రోపదేశం. **మంత్రాణా మర్థ స్తిరోహితో భవతి** అన్నారు పెద్దలు. ఇంత విస్తరించి చెప్పవలసిన భావ మొక్క చిన్న మాటలో చెబితే ఏమర్థ మవుతుంది మనకు. అందుకే గుప్తమైన దాన్ని మరలా మనం విస్తరించి చెప్పుకోవలసి వస్తున్నది. భూర్భువ స్సువః అనే వ్యాహృతులు మూడూ తేజో బన్నాలకు సంకేతాలే. సువః తేజస్సు. భువః జలం. భూః పృథివిం క్రింది నుంచి పైకి చేయాలి కాబట్టి ప్రయాణం భూః అనే మాటతో ఆరంభించారు. మూడింటికీ కలిసి ఓమ్మనేది ఆధారం. ఆ ఏకాక్షరంలో గుప్తమయి ఉన్నాయీ మూడూ. అ ఉ మ. ఇదే ఓమ్మనే మాటగా తయారయినాయి. అ ఉ మాలు భూర్భువస్సువస్సులే. అది ఏదో గాదు ఆ ఓమ్మరలా. తత్. తత్తంటే అది. ఆ పరమాత్మ అని అర్థం. మనకిప్పు డాయన పరోక్షం కాబట్టి తత్తన్నారు.

మరి పరోక్షమైనది పరోక్షంగానే ఉంటే ఎలా. ప్రత్యక్షమైతే గదా. సవితుః – అంచేత సవిత అయిందది. ప్రసవిస్తుంది. ఏమిటి. తేజస్సా. తేజస్సే గాదు. తేజస్సనేది ఉపలక్షణం. తేజస్సు వల్ల జలం. జలం వల్ల అన్నం. ఇవన్నీ కలిసి వస్తాయి ఆ మాటలో. అది ఎలా ఏర్పడిందా తేజస్సు. భర్గః – భర్గ్ అంటే లాటినులో Freg ఆంగ్లంలో Break. అన్నిటికీ ఒకటే అర్థం. స్ఫుటితం కావటం ప్రేలటం. పగలటం. ఆ దివ్యశక్తి స్ఫుటితమైతే గాని సృష్టి జరగదు. తేజోబన్నాత్మకం గదా సృష్టి. అది తన శక్తి ప్రభావంతో

మొదట తేజస్సయి తరువాత అది జలమయి ఆతరువాత  అది పృథివి అయి అది ఓషధులయి దానివల్ల అన్నపానాలేర్పడి అదే మన శరీరంగా కూడా పరిణమించింది. అది సృష్టించిందంటే  అదే అలా అయిందని అర్థం. నిమిత్తోపాదానాలు రెండూ  ఒకటే పరమాత్మ విషయంలో. నిమిత్తం చైతన్యమైతే ఉపాదానం దాని శక్తి. శరీర మెప్పుడయిందో అందులో అన్నం శరీరంగా జలం ప్రాణంగా. తేజస్సు మనస్సుగా మారాయి. ఇప్పుడీ మనస్సు ఆలోచిస్తున్నది మరలా ఆ మూలతత్త్వమైన పరమాత్మను చేరటానికి.

మరి దానికేమిటి మార్గం. ప్రతిలోమంగా వెనక్కు ప్రయాణం చేయాలది.  అనులోమంగా మొదట ప్రయాణం చేసి దిగి వచ్చిందా శక్తి. అలా వచ్చి మనస్సులో చేరి విద్య అవిద్యగా మారింది. అవిద్యగా మారినందుకు గుర్తు మనసెప్పుడూ ప్రాపంచికమైన భావాలతో నిండి ఉండటమే. నామ రూప క్రియాత్మకమే మన ఆలోచనలన్నీ. **ధియో యోనః ప్రచోదయాత్.** ఇలాటి ఆలోచనలన్నిటినీ ప్రచోదన చేయాలది. చేయాలంటే అంత సులభమైన పనిగాదు. **భర్గో దేవస్య ధీమహి** ఆ పరమాత్మ తాలూకు చైతన్య ప్రకాశాన్ని ధ్యానం చేయాలి. తనలో నింపుకోవాలి.  నిలుపుకోవాలి. వరేణ్యమైనదా ప్రకాశం. పారమార్థికమే కాబట్టి శ్రేష్ఠమైనది. అందుకే మనకు  వరణీయమైనది. అలా నిలుపుకొంటే అది వీటన్నిటినీ ప్రచోదనం చేస్తుంది. ప్రచోదన మంటే ఎక్కడికో గాదు మరలా. తన లోకే. సర్వవ్యాపకం గనుక అది తనలోనే వాటిని

కలుపుకొంటుంది. అప్పు డవిద్య మనకు విద్యగా మారి తోడ్పడుతుంది. ఇదే ప్రతిలోమమంటే. అనులోమం అవిద్యా మూలమైన సృష్టి అయితే ప్రతిలోమం విద్యా నిమిత్తమైన లయం. ఆపోజ్యోతీరసో ఽ మృతం బ్రహ్మ. అప్పుడు క్రమంగా ఈ జీవుడు శరీర మనోవృత్తి వాసనా కలాపమంతా దాటి జ్ఞాన బలంతో తన స్వరూపమైన బ్రహ్మ భావాన్ని అందుకోగలడు.

ఇంత లోతైన పరమార్థం గుప్తమయి ఉందీ గాయత్రీ మంత్రంలో. మననం చేసే కొద్దీ బయట పడుతుందది మనకు. గాయత్రీ అంటే గానం చేస్తూ దిగి వచ్చిందది అవిద్యా రూపంగా. మరలా అదే గానం చేస్తూ పైకి తీసుకెళ్లుతుంది విద్యారూపంగా. విద్యా విద్యా స్వరూపిణి ఆ శక్తి. విద్యా రూపంగా స్వరూప స్థితిలో ఏకమై ఉంటుంది. అదే అవిద్యా రూపంగా అనేకంగా మారి కనిపిస్తుంది. స్వరూపంగా నిరుపాధికం. అది విస్తరిస్తే సోపాధికం. ఆ ఉపాధులే తేజోబన్నాలు. తదస్యరూపం ప్రతి చక్షణాయ అన్నారు. ఈ ఉపాధులన్నీ దాన్ని చేర్చటానికే. అందుకే ఈ సూర్యోపాసనా. ఈ వరుణోపాసనా. ఈ పృథ్వీ దేవతో పాసనా. సంధ్యా వందన ప్రక్రియ అంతా మొదటి నుంచీ చివరిదాకా ఈ మూడింటితోనే గదా సాగటం. అది వీటితోనే కాలక్షేపం చేయటానికి కాదు. వీటి ద్వారా వీటికి మూలమైన పరమార్థమేదో దాన్ని అందుకోటానికి. అందుకోసమే జీవేమ శరద శ్శతం. దీర్ఘకాలం బ్రతకాలి మనం. పశ్యేమ శరద శ్శతం శృణ వామ శరద శ్శతం. ప్రబ్రవామ శరదశ్శతం. ఇంద్రియ శక్తులన్నీ పని చేయాలి. ఎందుకని

**జ్యోక్చ సూర్యం దృశే - య ఉదగాన్మహతో ఉ_ర్ణవాత్** త్రిగుణాత్మకమైన ఈ సంసార మనే తమస్సు కతీతంగా వెలిగే ఆ దివ్య చైతన్య జ్యోతిస్సు నందు కోటానికి.

అదే మనవే అవస్థలో ఉన్నా - కాయికంగా ఎంత అపవిత్రులమైనా - మనలను మానసికంగా పరిశుద్ధులను చేస్తుంది. ఆ భావనమే మనకు పావనం. ఆ భావన వదలకుండా మనమే సౌర తేజస్సును ప్రార్థించినా ఏ అర్ఘ్య జల మర్పించినా ఏ జలాన్ని మనమీద ప్రోక్షణ చేసుకొన్నా ఏ అంగన్యాస కరన్యాసాదు లను ష్ఠించినా ఏ ద్యావాపృథ్వులను స్తుతించినా ఏ శివకేశవులను స్మరించినా కడకు ఏ దిగ్దేవతలకు మన తాలూకు ప్రవర చెప్పుకొన్నా - నమోవాకా లర్పించినా అదంతా ఆయా ఉపాధులలో ప్రకాశించే స్వ ప్రకాశమైన బ్రహ్మ తత్త్వాన్నే చూపుతుంది. అప్పుడంతా కలిసి ఏకైకమైన పరమాత్మ స్వరూపమేననే అఖండాను భవ మేర్పడుతుంది. ఈ అఖండ భావనతో చేసిన కర్మ కర్మ గాదు. అది జ్ఞానమే. త్రికరణ వ్యాపారాలన్నీ దానికి సమర్పయామి అని నిత్యమూ భావించినప్పుడే మనం చేసే సంధ్యావందనం బ్రహ్మ కర్మ అవుతుంది. బ్రహ్మ కర్మ బ్రహ్మ జ్ఞానమిస్తుంది అదే పరమ పురుషార్థం మానవుడికి అది మనల నెప్పటికైనా తరింప జేస్తుంది.